27-5Pg1exHMNWJQE.qxd:27-5Pg1exHMNWJQE.qxd 01/01/01 10:22 AM Page 1

మాజైన్ గత వారం రోజుల్లో జరిగిన ముఖ్య ఘటనల బులెటిన్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 115 పేజీలు: 12 వెల: 6.50

యూనస్‌ను దించేందుకు ఆర్మీచీఫ్ కసరత్తు

8 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు 9లో

## మోడీని ఢీకొంటే ఫలితం చూపించాం



### గుజరాత్ పర్యటనలో పాక్‌పై ప్రధాని ఆగ్రహం

**దాహోద్(గుజరాత్),మే 26:** ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్తాన్‌కు మరోసారి గట్టి వార్నింగ్ ఇచ్చారు. దాహోద్ సభలో పాకిస్తాన్ చర్యలను చీల్చిచెండాడారు. పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. పిల్లల ముందు తండ్రిని దారుణంగా చంపి ఉగ్రవాదులు 140కోట్ల మంది భారతీయులకు సవాల్ విసిరారని అన్నారు. మోడీతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో పాకిస్తాన్‌కు చూపించామన్నారు. పహల్గామ్ దాడి దృశ్యాలు గుర్తుకు వస్తే ఇప్పటికి కూడా తన రక్తం మరిగిపోతోందని మోడీ పేర్కొన్నారు. భారత మహిళల సిందూరాన్ని తుడిచేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేసినట్టు ప్రకటించారు. పహల్గామ్ దాడికి భారత ప్రజలు కోరుకున్న రీతిలో ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. పాక్‌లో 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. భారత్ మహిళలకు హాని కలిగించేవారు లేదా ఉగ్రవాదాన్ని >>2

# మహానాడుకు అంతా రెడీ

### నేడు మొదటిరోజు టిడిపి సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై ప్రధాన చర్చ

### రెండోరోజు ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా నివాళులు, ఇతర కార్యక్రమాలు

### కడపకు చేరిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మరికొందరు మంత్రులు

### పబ్బాపురంలో 101ఎకరాలలో సంబరాలు నిర్వహణ

### చివరి రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగసభ



కడపలో మహానాడుకు ముస్తాబైన ప్రధాన వేదిక దృశ్యం

**కడప మే 26, ప్రభాతవార్త బ్యూరో:** తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడును 43 సంవత్సరాల తరువాత కడపలో మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. నవాబుతో న భవిష్యత్ అన్న రీతిలో మూడు రోజులు జరగబోవు మహానాడు పండుగకు సర్వం సిద్ధం అయింది. గత వారం రోజులుగా మంత్రులు సభా ప్రాంగణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేశారు. మహానాడు సంబరం నేటి నుంచి ప్రారంభం అవుతుంది. కడపలో నిర్వహిస్తున్న మహానాడు సంబరం చరిత్రలో నిలిచిపోయేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. కడప ఇంచార్జీ మంత్రి సబిత, అన్నమయ్యజిల్లా ఇంచార్జీ మంత్రి జన్నార్దన్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు పుత్తా చైతన్య రెడ్డి, మాధవి రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మహానాడు ప్రాంగణం ఏర్పాట్లు పూర్తి చేశారు. మహానాడు సంబరాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారంరాత్రి కడపకు చేరుకోనున్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ కుప్పం నుంచి కడపకు రాత్రి 9గంటలకు కడపకు చేరుకున్నారు. ఇప్పటికే మంత్రులు తరలి వచ్చారు. కడప నగరంతో పాటు సభా ప్రాంగణం కమలాపురం నియోజకవర్గంపార్టీ >>2



## రిమాండ్‌కు కాకాణి

### నెల్లూరు సెంట్రల్‌జైలుకు తరలింపు

**నెల్లూరు క్రైమ్, మే 26, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డికి వెంకటగిరి కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. పొదలకూరు మండలం పరిధిలోని రుస్తుం క్వారీలో అక్రమ మైనింగ్ తవ్వకం, ఈ తవ్వకాల కోసం గిరిజనల్ పై దౌర్జన్యం చేయడం వంటి సంఘటనలపై పోలీసులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో ఏ5గా ఉన్న కాకాణి గత రెండు నెలలుగా అజ్ఞాతంలో ఉంటూ న్యాయస్థానాల్లో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించారు. దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులోను ఆయనకు ముందస్తు బెయిల్ లభించకపోవడంతో ఇక ఆయన అరెస్టు తప్పదని భావించి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. గత నెల >>2

# జమిలి ఎన్నికలు సాధ్యమే



చెన్నైలో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

### వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌తో ఎన్నోప్రయోజనాలు

### దేశానికి, తమిళనాడుకు ఇది కొత్తకాదు..

### చెన్నైలో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల కలిగే ప్రయోజనా ఎన్నో ఉన్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తరచుగా ఎన్నికలు జరగడం వల్ల మన దేశం ఎన్నికల పనుల్లోనే కూరుకుపోతోందన్నారు.అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు నిరంతరం పనిచేయాల్సి వస్తోందన్నారు. ఎన్నికల ఖర్చుల వల్ల ప్రజా సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతోందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ద్వారా ఎన్నికల ఖర్చు తగ్గించవచ్చు అన్నారు.ప్రజలకు మరిన్ని పథకాలు అమలు చేయవచ్చునని అన్నారు. చెన్నైలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేతలతో ఒకే దేశం, ఒకే ఎన్నిక( వన్ నేషన్ వన్ ఎలక్షన్) జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు, ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ప్రధాని ఒక ఆలోచన చేస్తే అది దృష్టితో ఉంటుందన్నారు. వికసిత్ భారత్ 2047ఆశయాలు నేరవేరాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశం ప్రజల్లో బలీయంగా వెళ్ళాలన్నారు.ఒకే దేశం ఒకే ఎన్నికపై తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోందని, కొందరు దీనిపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం తీసుకొచ్చి ఉంటే మద్దతు ఇచ్చేవారు. గెలిస్తే ఈవీఎం సూపర్ అని, ఓడిపోతే అక్రమాలు జరిగాయని అంటున్నారని ఆయన అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని కరుణానిధి మద్దతు ఇచ్చారు. కానీ స్టాలిన్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో తమిళంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తమిళ దేవుడు మురుగ స్వస్థలం తమిళనాడు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తమిళంలో మాట్లాడుతూ నేను పూజించే తమిళ దేవుడు మురుగ స్వస్థలం, మహాకవిస్వస్థలం, సిద్ధుల స్వస్థలం, నాకు చాలా ఇష్టమైన ఎంజిఆర్ స్వస్థలం. తమిళనాడుపై నాకు ఎప్పుడూ గౌరవం ఉంది అని అన్నారు. దీనిని వ్యతిరేకిస్తున్నవారు కరుణానిధి రాసిన నేంజుక్కు నీతి పుస్తకం చదవాలి. ఎందుకంటే కరుణానిధి ఆ పుస్తకంలో ఒకే దేశం ఒకే ఎన్నికకు మద్దతు ఇచ్చినట్లు రాశారు అని పవన్ కల్యాణ్ అన్నారు. హిమాలయ పర్వతాలు ఎలా తలవంచవో ప్రధానమంత్రి మోడీ సైతం ఎక్కడా తలవంచరు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మన దేశ శక్తిసామర్థ్యాలను చాటిన ఘనత మన ప్రధానమంత్రిదే అని ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రధానికి ఎన్నడూ ఓట్లు వస్తాయా రావా అనేది ఆలోచన చేయలేదు. దేశ అభివృద్ధే లక్ష్యంగా కర్తవ్యనిర్వహణలో ఉన్నారు. ఇందుకు ప్రత్యక్ష తార్కాణం పి.ఎం-జన్‌మన్ కార్యక్రమం. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పర్టీక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ >>2



యువకుల గల్లంతుపై ఆరా తీస్తున్న పోలీసులు

### విహారంలో విషాదం

## గోదావరిలో 8మంది యువకులు గల్లంతు

### శేరుల్లంకలో వేడుకకు వచ్చి నదీస్నానానికి వచ్చిన 11 మంది

### గాలింపు చర్యలు ముమ్మరం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 26 ప్రభాత వార్త :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని లంక సమీపంలో గోదావరి నదిలో పెను విషాదం చోటుచేసుకుంది. కె.గంగవరం మండలం శేరుల్లంక గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరైన పలు కుటుంబాలకు చెందిన 11మంది యువకులు నదిలో స్నానానికి దిగగా, దురదృష్టవశాత్తు ఎనిమిది మంది గల్లంతయ్యారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల ప్రకారం, కాకినాడ, రామచంద్రపురం, మండపేట గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు శేరుల్లంకలో జరిగిన ఓ వేడుకకు వచ్చారు. వేడుక అనంతరం సరదాగా గడిపేందుకు 11 మంది యువకులు సమీపంలోని గోదావరి నదికి వెళ్లారు. నదిలో దిగిన కొద్దిసేపటికే ప్రమాదవశాత్తు లోతు ఎక్కువగా ఉండటంతో వారు నీటిలో మునిగిపోయారు. ఈ దుర్ఘటనలో గల్లంతైన యువకులను కాకినాడకు చెందిన క్రాంతి (20), పాల్ (18), సాయి (18), సతీష్ (19) గా గుర్తించారు. అలాగే, ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన మహేష్, రాజేష్ (13), మండపేటకు చెందిన రోహిత్, మరియు శేరుల్లంకకు చెందిన మరో మహేష్ కూడా గల్లంతైన వారిలో ఉన్నారు. ఈ విషయం తెలియగానే బాధిత కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఒక్కసారిగా ఇంతమంది యువకులు గల్లంతు కావడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శేరుల్లంక గ్రామంలో విషాదకరమైన వాతావరణం నెలకొంది. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా ఎస్.పి ముమ్మిడివరం సి.ఐ, ఎస్.ఐ ల పర్యవేక్షణలో గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక మత్స్యకారులు మరియు సహాయక సిబ్బంది >>2

## పూర్తి స్థాయి డిజిపిగా హరీష్‌కుమార్ గుప్తా



**విజయవాడ,మూ26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇన్ చార్జీ డీజీపీగా వ్యవహరిస్తున్న హరీశ్‌కుమార్ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆయన ఏపీ పూర్తి స్దాయి డిజీపీగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.హరీశ్‌కుమార్ గుప్తా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా జమ్మూకాశ్మీరుకుచెందిన వారు, ఖమ్మం ఏఎస్పీగా తన తొలి పోస్టింగ్ పొందారు. మెదక్, పెద్దపల్లిలో ఏఎస్పీగా >>2

## పవన్ సినిమాలు ఆపే దమ్మెవరికి?

### థియేటర్లు మూసివేయడం జరగని పని

### ఎపి మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు

### తెలంగాణ ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు వివరణ



ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే26:** రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల యాజమాన్య సమస్యలు, బంద్ ప్రకటనల నేపథ్యంలో నెలకొన్న గందరగోళంపై ప్రముఖ నిర్మాతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తమపై వస్తున్న ఆరోపణలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ విషయమై జరుగుతున్న చర్చపై ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు, ఎగ్జిబిటర్, తెలంగాణ ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు వివరణ ఇచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సినిమా రంగానికి అండగా ఉంటామని ప్రకటించిన ఎపి సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు కృత జ్ఞతలు తెలిపారు. ఈ వివాదానికి ఆయన ఓ రకంగా ఫుల్ స్టాప్ పెట్టారని అన్నారు. తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఓ ఇష్యూని కన్ క్లూజ్ చేయడం ఆనందంగా ఉందని, మినిస్టర్ ఇచ్చిన స్టేట్ మెంట్‌తో ఫుల్‌స్టాప్ పడిందని అనుకుం టున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 19న తూర్పు గోదావరిలోని పంపిణీదారులు, ఎగ్జిబిటర్స్ >>2

## యువకుల గల్లంతుపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**విజయవాడ,మే26, ప్రభాతవార్తప్రతినిధి:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం కమిని లంక సమీపాన గోదావరిలో ఎనిమిది మంది యువకులు గల్లంతవ్వడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోదావరిలో స్నానానికి దిగి ఎనిమిది మంది యువకులు గల్లంతైన విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్‌తోఫోన్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడారు. గల్లంతైన యువకుల కోసం చేపట్టిన గాలింపు చర్యల గురించి సీఎంకు కలెక్టర్ వివరించారు. గల్లంతైన వారిని రక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. >>2



## ఆసుపత్రికి వల్లభనేని తరలింపు

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:**వైకాంగ్రెస్‌పార్టీ నేత,మాజీ ఎంఎల్ఏ వల్లభనేని వంశీకి తీవ్ర అస్వస్దతతో ఇబ్బంది పడుతున్నారు.ఆయనను ఆయన పరిస్దితి ఎంత మాత్రం బాగాలేదని వంశీ బంధువులు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలో ఆయనకు ఉద్దేశపూర్వకంగా వైద్యం అత్యవసరంగా అందించాల్సి ఉందని వారు అంటున్నారు. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తీసుకొచ్చారు. మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య వంశీపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా వైద్యం అందించకుండా చేస్తున్నారని అభియోగించారు. విజయవాడ జీజీహెచ్‌ఈ క్రమంలో గుంటూరు జీజీహెచ్ ప్రధాన ద్వారాన్ని పోలీసులు మూసివేశారు. పోలీసుల హడావుడితో రోగులు,వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ వైపు ఉన్న ద్వారం నుండి రోగులను లోపలికి రావాలన్నారు. దీంతో నడవలేని పరిస్థితిలో చుట్టూ ఎలా తిరిగి రావాలని వారు వాపోతున్నారు. నకిలీ ఇళ్ళ పట్టాల కేసులో వల్లభనేని వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. శ్వాసకోస సంబంధిత సమస్యలతో ఆయన ఇబ్బంది పడుతున్నారు. దీంతో కంకిపాడు ఆస్పత్రిలో వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు.

**కోర్టులో చుక్కెదురు:** వల్లభనేని వంశీకి నూజివీడు కోర్టులో చుక్కెదురైంది. వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వంశీ బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. వంశీ బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా వంశీ ఇదే కేసులో అరెస్టై విజయవాడ >>2

## వానొచ్చె.. వరదొచ్చె..



భారీ వర్షాలకు ముంబయిలో ఏరులైన వరద


### నాలుగు రాష్ట్రాల్లో కుంభవృష్టి

### మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడులో స్తంభించిన జనజీవనం

### ముంబయలో రెడ్ అలర్ట్, 'మెట్రో' స్టేషన్ నీట మునక



**ముంబయి, మే26:**మహారాష్ట్రలోని తీరప్రాంత జిల్లాలతోపాటు అర్బన్ జిల్లాలను కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. ఉరుములు మెరుపులతోపాటు తీవ్రస్థాయిలో ఈదురుగాలులు మహారాష్ట్ర ప్రజలను అతలాకుతలంచేస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి కొనసాగుతున్న వర్షాలు మహారాష్ట్ర రాజధాని ముంబ యిని వరదలతోముంచెత్తాయి. ఇప్పటికే థాణె, రత్నగిరి, రాయ్‌గఢ్ జిల్లాలకు రెడ్‌అలర్ట్ జారీచేసింది. రాత్రికిరాత్రే కురిసిన భారీ వర్షం ముంబయిలోని లోతట్టుప్రాంతాలను ముంచివేసింది. కొన్ని సబర్బన్‌రైళ్ల రాకపోకలు నిలిచి పోయాయి. ఛత్రపతి శివాజి మహరాజ్ ఎయిర్ పోర్టునుంచివెళ్లే విమానసర్వీసులనుకూడా నిలిపివేసారు. స్పైస్ జెట్, ఇండిగో సంస్థలు తమతమ ప్రయాణీకులకు సందేశాలు పంపించాయి. >>2



నీట మునిగిన ముంబయిలోని మెట్రో స్టేషన్

27-5pg2exHMNWJQE.qxd:27-5pg2exHMNWJQE.qxd 01/01/01 10:24 AM Page 1





సోమవారం కర్ణాటకలో భారీ వర్షం



సోమవారం తమిళనాడులోని నీలగిరి జిల్లాలో ఎడతెరిపిలేని వాన దృశ్యం

# వానొచ్చె.. వరదొచ్చె..

>> నారిమన్ పాయింట్‌లో లోతట్టుప్రాంతాల్లో భారీ ఎత్తున వర్షం నీరునిలిచిపోయింది. ఆరునుంచి ఏడు గంటలలో 40 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గ్రాంట్‌రోడ్‌లో 36 మిల్లీమీటర్లు, కొలాబాలో 31 మిల్లీమీటర్లు, బైకుల్లాలో 21 మిల్లీమీటర్లు వర్షంకురిసింది. ముంబయి, కొంకణ్ ప్రాంతాల్లో మరింత భారీ ఎత్తున వర్షం కురుస్తోంది. వొర్లిలోని భూగర్భ మెట్రోస్టేషన్ మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా చుట్టుముట్టాయి. రానురాను ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గంటకు 50నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కొన్ని జిల్లాలను ముట్టుముట్టాయి. పూణె, సతారా, సింధుదుర్గ్, పాల్ఘర్, థాణె, రాయ్‌గడ్, రత్నగిరిజిల్లాల్లో భారీవర్షాలు కురిశాయి. అలీబాగ్‌నగర్, కొల్హాపూర్, సాంగ్లి, సోలాపూర్, లాతూర్‌జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేశారు. గత 75 సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించాయి. ఈ క్రమంలో భారీవర్షం కురిసింది. ఫలితంగా 107 సంవత్సరాల రికార్డు బద్దలయ్యింది. మే మాసంలో 107 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో భారీ వర్షం కురిసింది. ముంబయిని నైరుతి రుతుపవనాలు చేరాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా జూన్ 11 వరకు వస్తుండగా.. ఈ సారి మాత్రం 16 రోజుల ముందుగానే వచ్చాయని తెలిపింది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) శాస్త్రవేత్త సుష్మా నాయర్ మాట్లాడుతూ.. గతంలో నైరుతి రుతుపవనాలు తొలిసారిగా 1956 మే 29న ముంబయికి ముందస్తుగా చేరాయని.. ఆతర్వాత 1962, 1971లో ఆదే రోజుల్లో వచ్చినట్లుగా పేర్కొంది. ఇకపోతే కర్ణాటక కోస్తా జిల్లాల్లో కూడా భారీ వర్షం కురిసింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలనురంగంలోకి దింపింది. ఐదురోజులపాటు కర్ణాటక కోస్తా జిల్లాలకు రెడ్ అలర్ట్ అమలులో ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇక తమిళనాడులోని వాతావరణకేంద్రం ఇప్పటికే నీలగిరి హిల్స్‌కు రెడ్ అలర్ట్ జారీచేసింది. కోయంబత్తూరు ప్రాంతంలో కూడా ఇదే విధంగా భారీ వర్షాలు కురుస్తాయి. 28వ తేదీవరకూ ఇదే తీరు ఉంటుందని పశ్చిమఘాట్ ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించినట్లు వాతావరణకేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప ఇళ్లనుంచి బయటికి రావద్దని హెచ్చరికలు జారీచేసింది. ఆదేవిధంగా కేరళలోని 11 జిల్లాల్లోకూడా రెడ్ అలర్ట్ జారీ అయింది. కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, త్రిశూర్, పాలక్కడ్, మలప్పురం, కోజికోడ్, వాయనాడు, కన్నూర్, కాసరగడ్ జిల్లాలకు రెడ్అలర్ట్‌జారీచేశారు. తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. దక్షిణాసియా ప్రాంతం ఈ వేసవిలో అత్యంత వేడి, గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుచేసింది. రానురాను వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీనితో ఈప్రాంతంలో ఇప్పటికే సగటు వార్షిక వర్షపాతంలో 80శాతం నమోదయినట్లు వాతావరణశాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు.

## అభివృద్ధిపనులపై ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**కుప్పం, మే 26 ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం చంద్రబాబునాయుడు జిల్లా ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్ వద్ద సిఎం చంద్రబాబునాయుడు తన కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరిలను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. కుప్పం నియోజకవర్గంతో పాటు జిల్లాలో అవసరమైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు తెలిసింది.

## రిమాండ్‌కు కాకాణి

>> నాలుగవ తేదీ నుండి పోలీసులు ఆయన కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు బెంగళూరు శివార్లలో ఆదివారం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను వెంటనే నెల్లూరులోని పోలీస్ శిక్షణ కేంద్రానికి తీసుకువచ్చి జిల్లాకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అనంతరం సోమవారం ఉదయం కాకాణిని ప్రత్యేక బందోబస్తుతో వెంకటగిరి కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో వాదన అనంతరం న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డికి 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పోలీసు అధికారులు, సిబ్బంది ఆయననెల్లూరుకేంద్రకారాగారానికి తరలించారు.

**అరెస్ట్ అక్రమం.. వైసీపీ నేతలు:** కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ప్రభుత్వం నమోదు చేయించిన కేసు అక్రమమని, ఆయన్ను అన్యాయంగా ఇరికించారని ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన వైసిపి నేతలు ఆరోపించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేసిన మొదలు కోర్టు తీర్పు వెలువడిన అనంతరం జైలుకు తరలించేంతవరకు ఆయన అభిమానులు వైసిపి కార్యకర్తలతో పాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ వైసీపీ నాయకులందరూ అన్నిచోట్ల ఆయన వెంట ఫాలో అయ్యారు. ఈ సందర్భంగా పలుచోట్ల వారు విలేకరులతో మాట్లాడుతూ ఏ 1 నుండి ఏ 4 వరకు ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్నవారందరికీ న్యాయస్థానాలు బెయిలు మంజూరు చేశాయని, ఏ 5 గా కాకాణి గోవర్ధన్ రెడ్డికి మాత్రం ప్రభుత్వం కొట్టపల్లి బెయిలు రాకుండా చేసిందని ఆరోపించారు. కాకాణిని జైలు లోపలికి తరలించే సమయంలో జైలు వద్ద ఆయన అనుచరులు, వైసీపీ నాయకులతో ఉద్రిక్తత వాతావరణం కనబడింది.



సోమవారం శివపురం వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

## ప్రజలనుంచి వినతులు స్వీకరించిన సిఎం చంద్రబాబు

**శాంతిపురం, మే 26 ప్రభాతవార్త:** మూడు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం శివపురం వద్ద ఉన్న తమ నివాస ం వద్ద ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు వింటూ వారి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుకు ఆదేశించారు. అనంతరం 10.50గంటలకు ద్రవిడ వర్సిటీలోని హెలిప్యాడ్‌కు రోడ్డుమార్గంలో బయలుదేరారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, స్థానిక నేతలు విశ్వనాథనాయుడు, ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, బాలు, రమేష్, జయరాంరెడ్డి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రమంతా వర్షాలే

**విజయవాడ,మూ26,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాలు కేరళతో పాటు గోవా,కర్నాటక, మహారాష్ట్ర,మిజోరాం,మణిపూర్,నాగాలాండ్ లోని మరి కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. రాగల మరికొద్ది గంటల్లో రాయలసీమను నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణం విభాగం (ఐఎండీ) తెలిపింది. దాంతో రానున్న మూడు రోజుల పాటు ఏపీలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ఆవర్తనం,ద్రోణి ప్రభావంతో ఇప్పటికే ఉత్తర కోస్తా జిల్లాల్లో వానలు,ఈదురుగాలులు కొనసాగుతున్నాయి. వారం రోజుల ముందుగానే ఏపీకి రుతుపవనాలు వస్తున్నాయి. మహారాష్ట్ర లోని రత్నగిరి సమీపంలో తీరం దాటిన వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది.ప్రస్తుతం మహారాష్ట్ర,కర్నాటక పరిసరాల్లో కొనసాగుతోన్న అల్పపీడనం...క్రమంగా తూర్పు దిశగా పయనించి ఈ రోజుకి మరింత బలహీన పడుతుందని ఐఎండీ పేర్కొంది. ఇక మంగళవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో రాబోయే 4 రోజుల్లో కోస్తాంధ్ర,రాయలసీమ,తెలంగాణ లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది.ఈ నెల 27 నాటికి పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్ని ప్రాంతాల్లో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బలమైనఈదురుగాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్లతో వీచే అవకాశంఉంది.రాగల 7రోజుల్లోగరిష్ట ఉష్ణోగ్రతలు3 నుంచి5 డిగ్రీలు తగ్గే అవకాశం ఉంది.

# మహానాడుకు అంతా రెడీ

>> జెండాలు, తోరణాలు, భారీ కటౌట్లు, ఫ్లెక్సీలతో పసుపుమయమైంది. ఎటు చూసినా జెండాలు రెపరెపలాడుతూ పసుపు రంగులో కనిపిస్తోంది. కడప నగరంలోనే పబ్బాపురం సమీపంలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు ప్రాంగణం ఏర్పాటు చేసి మూడు రోజుల పండుగ నిర్వహిస్తున్నారు. చివరి రోజు 29న జరుగు భారీ బహిరంగ సభకు 5 లక్షల మందికి పైగా తరలివస్తున్నట్లు మంత్రులు తెలిపారు. గతంలో జరిగిన మహానాడుకు, ఇప్పుడు జరుగుతున్న మహానాడుకు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందని మంత్రులు పేర్కొన్నారు. ఇప్పటికే మంత్రులు అచ్చెన్నాయుడు, పొల్లా రవీంద్ర, నారాయణ, నిమ్మల రామానాయుడు, పార్థసారధి, వాసిరెడ్డి సుభాష్‌తోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తరలివచ్చారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన నేతలు, మంత్రులు మహానాడుకు సంబంధించి విజయవంతం చేసేందుకు భారీగా జనాభాను సమీకరించేందుకు బాధ్యతలు ఆయా పార్టీ నాయకులకు సమీక్షలో అప్పజెప్పడం జరిగింది. ఈ మహానాడులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 10 మంది ఎస్పీలు, 5వేల మంది సిబ్బంది, 150 సిసి కెమెరాలు, డ్రోన్ల సహకారంతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మొదటి రోజు మంగళవారం ఉదయం ప్రతినిధుల నమోదుతో మహానాడు ప్రారంభం కానుంది. తరువాత ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళితో మహానాడు ప్రారంభం కానుంది. 12 గంటలకు ముఖ్యమంత్రి ఉపన్యాసం చేస్తారని మంత్రులు తెలిపారు. రెండవ రోజు ప్రతినిధుల సభతోపాటు పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 152 జయంతి సందర్భంగా నివాళులు అర్పించి, ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ముసాయిదా తీర్మాణంపై చర్చించి ఆమోదించనున్నారు. ఈ రెండు రోజులు జరుగు సభకు సుమారు 20 వేల మంది హాజరవుతారని వారు తెలిపారు. సభా వేదిక 450 మంది కూర్చునేలా వారు నిర్మాణం చేపట్టారని తెలిపారు. చివరి రోజు 29వ తేది 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఇది చరిత్రలో నిలబడిపోయే విధంగా ఉండిపోతుందన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ వాహనాలలో కడపకు చేరుకుంటున్నారు. ఎవరికి ఎలాంటిఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టామని మంత్రులు తెలిపారు. రోజువారి కార్యక్రమాలలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానికనాయకులతో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాయలసీమ వంటలతో భోజనవసతి కల్పించామన్నారు. రాయలసీమ అభివృద్ధి తోపాటు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు వారు తెలిపారు.ఈ సభావేదిక ద్వారా రాయలసీమ అభివృద్ధి బాట పడుతుందన్నారు. మహానాడు మూడు రోజుల పండగ చరిత్రలో నిలబడే విధంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహానాడు కార్యక్ర మానికి ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి ఆ పార్టీ నాయకులు, అభిమానులు తరలిరానున్నారు.



మహానాడు ప్రాంగణం వద్ద పోలీసు బందోబస్తు

## ఆసుపత్రికి వల్లభనేని తరలింపు

>> జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

**పోలీసుల కస్టడీ పిటిషన్:** మరోవైపు ఇదే కేసులో వల్లభనేని వంశీని కస్టడీకి కోరుతూ హనుమాన్ జంక్షన్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. మరో 2 రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ నూజివీడు కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

## మోడీని ఢీకొంటే ఫలితం చూపించాం

>> వ్యాప్తి చేసేవారు మట్టిలో కలవాల్సిందేనని వార్నింగ్ ఇచ్చారు. పహల్గామ్ ఘటన దేశాన్ని కదిలించింది. కఠినమైన చర్య తీసుకోవాలని అంతా డిమాండ్ చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఏప్రిల్ 22న, దాడి చేసిన వారిని ఆపరేషన్ సిందూర్‌తో మట్టిలో కలిపేశామన్నారు. పాకిస్తాన్ ఏకైక లక్ష్యం భారత్‌ను ద్వేషించడం. మనకు హానికలిగించాలన్న మార్గాలపైనే ఆలోచిస్తోందని మండిపడ్డారు. కానీ మన దేశం మాత్రం దేశంలోని పేదరికాన్ని నిర్మూలించి ఆర్థికవృద్ధి సాధించే లక్ష్యంతోముందుకువెళుతున్నదన్నారు. దహోద్‌లో రూ.24వేలకోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు.

**మే 26.. చాలా ముఖ్యమైన రోజు:** 11 ఏళ్ల క్రితం 2014లో ఇదే రోజు ప్రధాని పగ్గాలు చేపట్టానని ప్రధాని మోడీ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రయాణంలో మే 26ని ఒక ముఖ్యమైన రోజని పేర్కొన్నారు. 2014లో ఇదే తేదీన తాను తొలిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ రోజు మే 26. 2014లో ఇదే తేదీన, నేను మొదటిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని మొదట, గుజరాత్ ప్రజలు నన్నుఆశీర్వదించారు, తరువాత కోట్లాది మంది భారతీయులు నన్ను ఆశీర్వదించారు. అంటూ మోడీ పేర్కొన్నారు. వడోదర తర్వాత దాహోద్‌కు వెళ్లిన ప్రధాని, భారతీయ రైల్వేలకు కొత్త గిఫ్ట్ ఇచ్చారు. దాహోద్‌లో రైలు ఇంజిన్ల తయారీ కర్మాగారాన్నిదేశానికి అంకితం చేశారు ప్రధాని మోడీ. ఈ ప్లాంట్‌లో తయారైన తొలి ఎలక్ట్రిక్ రైల్ ఇంజిన్‌కు ప్రధాని పచ్చజెండా ఊపారు. భారతీయ రైల్వేల లోడింగ్ కెపాసిటీ ఈ రైలు ఇంజిన్లు పెంచబోతున్నాయన్నారు. మూడేళ్లక్రితం ఈ ప్లాంట్‌కు శంకుస్థాపనచేసానని, ఎన్నో విమర్శలుచేసారని, ఎన్నికల సమయం కాబట్టి ప్లాంట్‌కు పునాదివేసారని, ఏనిర్మాణాలు చేపట్టరని విమర్శించారని, కానీ ఇపుడు లోకోమోటివ్ తయారయిందని అది మనకు విమర్శలు చేసినవారికి కూడా కనిపిస్తోందన్నారు. ఇక్కడ 9000 హార్స్‌పవర్ సామర్థ్యమున్న ఎలక్ట్రిక్ రైలు ఇంజిన్ల ఉత్పత్తి చేస్తారు. మొత్తం 80వేల కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు.

## గోదావరిలో 8మంది యువకులు గల్లంతు

>>కూడా గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. అయితే, చీకటి పడుతుండటంతో గాలింపు చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఈ దుర్ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఒకేసారి ఎనిమిది మంది యువకులు నీటిలో మునిగిపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నదిలో ఇలాంటి ప్రమాదాలు జరగడం ఇది మొదటిసారి కాదని స్థానికులు అంటున్నారు. నదిలో లోతు ఎక్కువగా ఉండటం మరియు సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మరియు స్థానిక అధికారులు గల్లంతైన యువకుల ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రేపు ఉదయం వెలుగు వచ్చాక గాలింపు చర్యలు మరింత ముమ్మరం చేసే అవకాశం ఉంది. ఈ విషాదకరమైన ఘటనతో ఆ ప్రాంతంలో అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. గల్లంతైన వారి కుటుంబాలకు గ్రామస్థులు మరియు బంధువులు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

>> బాధిత కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సీఎం సూచించారు.

**హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి:** నీటి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అధికా రులకు సీఎం పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలోని నీటి వనరులు ఉన్న అన్ని ప్రాం తాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నీటి కుంటలు, చెరువులు వంటి ప్రాంతాలను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయా లన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు కనిపించక పోయినా, నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు.

## పూర్తి స్థాయి డిజిపిగా హరీష్‌కుమార్ గుప్తా

>>సేవలందించారు.కృష్ణా,నల్గొండ జిల్లాల ఎస్పీగా ఆయన పనిచేసారు. ప్రజా ఫిర్యాదులపై ఆయన స్వయంగా స్పందించేవారు.ఎస్ఐలు, సీఐలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారి ప్రజా ఫిర్యాదు మేరకు విచారించి కఠిన చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు రెంజీ ఐజీగా, శాంతి భద్రతలు విభాగంబ, ప్రోవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ,అదనపు డీజీపీగా పని చేసారు. 2022 మే నుంచి హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. జనవరి31న అప్పటి డీజీపీ ద్వారకా తిరమలరావు పదవి విరమణ చేసారు. దాంతో ఇన్ చార్జి డీజీపీగా హరిశీకుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. తాజాగా పూర్తి స్థాయిలో బాధ్యతలు అప్పగించింది.

## సౌర విద్యుత్తును ప్రోత్సహించడానికి సమగ్ర విధానం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** సౌర విద్యుత్ ద్వారా దేశం 2030 నాటికి 500 గిగా వాట్ల స్వదేశీ తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడానికి ఒక సమగ్ర విధాన చట్టాన్ని అభివృద్ధి చేసిందని అన్నారు. ఇది ఫలితాలను ఇస్తూ మన రాష్ట్రం భారతదేశపు సౌర తయారీ కేంద్రంగా అభివృద్ధి చెందుతుండటం సంతోషంగా ఉందని అన్నారు. తాము రాష్ట్రానికి మరిన్ని తయారీదారులను తీసుకువచ్చి, దేశ పర్యావరణ పరివర్తనను నడిపించటంతో పాట ప్రజలకు లక్షలాది ఉద్యోగాలను కూడా సృష్టిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## జమిలి ఎన్నికలు సాధ్యమే

>> గ్రూప్స్ (పి.వి.టి.జి.) ఉండే ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించగలుగుతున్నాము. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం విషయానికి వస్తే పి.ఎం.- జన్ మన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.555.61 కోట్ల నిధులతో 612.72 కి.మీ. మేర రహదారులు నిర్మిస్తున్నాము. ఇవన్నీ పి.వి.టి.జి. ఆవాసాలను అనుసంధానించే రహదారులే. వీటి ద్వారా ఏడు జిల్లాల్లో 239 పి.వి.టి.జి. ఆవాసాలకు రహదారులు ఏర్పరచగలుగుతున్నాము. ఓట్లు కోసం చూస్తే... 239 ఆవాసాలకు రహదారులు మూలంగా సుమారు 50 వేల మందికి రోడ్డు సౌకర్యం వస్తుంది. వారు మనకు ఓట్లు వేస్తారా లేదా అనే ఆలోచన ఎక్కడా చేయలేదు మన గౌరవ ప్రధాన మంత్రి. అదే మొత్తాన్ని ఓట్లు వస్తాయి అనే చోట వెచ్చించవచ్చు. ప్రతి ఒక్కరికీ, అన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందాలి అనే ఉద్దేశంతో మోడీ ముందడుగు వేస్తున్నారు. ఆ స్ఫూర్తితోతోనే ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు ముందుకు వెళ్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర క్యాబినెట్ ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలియచేసింది. రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారికి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ మూడు నెలలపాటు రాష్ట్రంలో పర్యటించి రూపొందించిన నివేదికను అనుసరించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాము. ఆపరేషన్ సిందూర్, అందుకు దారి తీసిన పరిస్థితులు చాలా క్లిష్టమైనవి. ఇటువంటి దశలో కూడా ప్రజల రక్షణతోపాటు వారి భవిష్యత్తు కోసం ప్రధానమంత్రి ఆలోచన చేశారు. కుల గణన చేపట్టడం అనేది ఎంతో అవసరం. దేశంలో ఉన్న కులాల పరిస్థితులు, వారి జీవనం, వృత్తులు, స్థితిగతులు తెలుస్తాయి. వారికి జీవనోపాధుల మెరుగుదలకు ఏ విధమైన చర్యలు చేపట్టాలి, ఏ పథకాలు తీసుకురావాలో పాలన వర్గాలకు ఒక స్పష్టత వస్తుంది" అన్నారు.1952- 67 వరకు దేశంలో ఒకేసారి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ ఆంథోనీ, బీజేపీ తమిళనాడు నేతలు అర్జున మూర్తి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్ఆర్ విచారణ రెండో రోజు పూర్తి, ముగిసిన కస్టడీ

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో నిందితుడు ఐపిఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును పోలీసులు రెండో రోజు విచారించారు.కోర్టు పీఎస్ఆర్‌ను పోలీసు కస్టడీకి రెండు రోజుల పాటు అనుమతినిచ్చింది.. పీఎస్ఆర్ ఆంజనేయులుకు సోమవారం కస్టడీ ముగిసింది.రెండు రోజుల పోలీసు కస్డడీలో పీఎస్ఆర్ ఆంజనేయులు ఏ మాత్రం సహకరించలేదని అధికారులు అంటున్నారు.ఆయన ప్రతి విషయాన్ని దాటవేసారని తెలిపారు.ఈ రోజుతో ఆయన కస్టడీ ముగిసినందున ఆస్పత్రిలో వైద్య పరీక్షలు జరిపించి,కోర్టు హాజరు పరుస్తామని,తరువాత సబ్ జైలుకు పంపిస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఏ2 మధుసూధన్‌ను కూడ పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం.విచారణఅనంతరం పీఆర్ఎస్ఏతో పాటుగా విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. వీరిద్దరిని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు అధికారులు ప్రశ్నించారు. వారిని రాత్రి సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. పీఎస్ఆర్ ఆంజనేయుల్ని సుమారు 30కి పైగా ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. దేనికి వారి నుంచి బదులు రాలేదంటున్నారు. కనీస సాక్ష్యాధారాలు లేకుండా మీడియా కథనాలు ఆధారంగా తమను అరెస్ట్ చేసారని వారిద్దరు విచారణ సందర్భంలో ఆరోపించారంటున్నారు.విచారణాంశాలను పోలీసులు వెల్లడించాల్సి ఉండగా ఉహాజనీతంశాలు బయటకు వస్తున్నాయని పీఎస్ఆర్ ఆంజనేయుల్ని పోలీసులను ప్రశ్నించినట్లు సమాచారం.

# పవన్ సినిమాలు ఆపే దమ్మెవరికి?

>> ఏర్పాటు చేసుకున్న మీటింగ్ లో పర్సెంటేజ్ విధానంలో ఆడితే తమకు బాగుంటుందని థియేటర్ ఓనర్స్ చెప్పారు. ఇవాళ యేడాదికి 150 సినిమాలు విడుదలైతే, 90 శాతం పర్సంటేజ్ సిస్టమ్‌లోనే ప్రదర్శితమౌతున్నాయి. కొన్ని సినిమాలే రెంట్ లేదా పర్సంటేజ్‌కు ఆడుతున్నాయన్నారు. ఆ విషయంలోనే ఎగ్జిబిటర్స్ అభ్యంతరం చెబుతున్నారు. ఈస్ట్ గోదావరి ఎగ్జిబిటర్స్ తమ నిర్ణయాన్ని హైదరాబాద్‌లోని ఎగ్జిబిటర్స్‌కు తెలిపారు. దీనిపై ఏప్రిల్ 26న జరిగిన గిల్డ్ మీటింగ్‌లో మేం చర్చించాం. ఆరు నెలల పాటు వారి ఆదాయ వ్యయాలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని నిజంగా నష్టం వస్తోందనిపిస్తే, తప్పకుండా వారికి సాయం చేద్దామని మేం అనుకున్నాం. సహజంగా పెద్ద సినిమాలకు మొదటివారం రెంట్ ఇస్తున్నాం. ఆ తర్వాత పర్సెంటేజ్ ఇస్తున్నాం. ఇది కొందరు ఎగ్జిబిటర్స్‌కు నచ్చడం లేదు. మేం ఈ విషయాల గురించి గిల్డ్‌లో మాట్లాడే సమయానికి 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్ ఫిక్స్ కాలేదు. కాబట్టి ఇది ఆ సినిమా వ్యతిరేకంగా జరిగిన నిర్ణయం అనేది కరెక్ట్ కాదు. ఇక థియేటర్ల విషయానికి వస్తే... నైజాంలో 370 సింగిల్ స్క్రీన్ ఉంటే మాకు, మా మిత్రులకు కలిపి 30 థియేటర్లు ఉన్నాయి. ఏసియన్ ఫిలిమ్స్ సునీల్ నారంగ్, సురేశ్ బాబుకు వాళ్లకు 90 ఉన్నాయి. మిగిలిన వాటిని ఓనర్స్ లేదా వారి సంబంధీకులు నడుపుతున్నారు. మా గిల్డ్ మీటింగ్ తర్వాత తెలంగాణలోని సింగిల్ థియేటర్స్ ఓనర్స్ కూడా పర్సంటేజ్ గురించి శిరీష్‌ను అడిగారు. అతను నా దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే... మే 18న ఎపి, తెలంగాణ ఎగ్జిబిటర్స్ మీటింగ్ పెట్టుకున్నారు. ఆ మీటింగ్ చివరిలో నేను వెళ్లాను. ఆ రోజున మీటింగ్‌లో ఏం జరిగిందో పూర్తిగా తెలుసుకోకుండానే 'జూన్ 1 నుండి థియేటర్స్ బంద్' అనే ప్రచారం మీడియాలో మొదలు పెట్టారు. నిజానికి ఆ సమస్యను ఫిల్మ్ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లమని చెప్పాను. ఎగ్జిబిటర్స్ కూడా త్వరలో జరుగబోయే జాయింట్ కమిటీ మీటింగ్‌లో తమకు అనుకూలంగా నిర్ణయం రాకపోతేనే థియేటర్లు బంద్ చేస్తామని చెప్పారు. కానీ అప్పటికే ఓ నిర్ణయం తీసుకున్నట్టుగా తప్పుడు ప్రచారం అంతటా జరిగిపోయింది. అయితే ఆ తర్వాత నిర్మాతలు, పంపిణీ దారులు జరుపుకున్న మీటింగ్‌లో థియేటర్ల బంద్ చేయకూడదనే నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిబిటర్స్‌తో చర్చలు జరిపి సానుకూల నిర్ణయం తీసుకుందామని భావించారు. ఈ నెల 30న జరిగే ఛాంబర్ ఇసి మీటింగ్ ఓ కమిటీని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటారు' అని దిల్ రాజు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో అనవసరంగా 'హరిహర వీరమల్లు' మూవీని లాగారని దిల్ రాజు వాపోయారు. కల్యాణ్ సినిమాను ఆపే దమ్ము ధైర్యం ఎవరికీ లేదని తెలిపారు. సినిమా వాళ్లకు రెండు ప్రభుత్వాలతో పని ఉంటుందని, ఎపిలో ప్రభుత్వం మారిన తర్వాత సినిమా వాళ్లకు చాలా చక్కని యాక్సెస్ లభించిందని ఆయన అన్నారు. ఉత్తరాంధ్రలోనూ తనకు ఇరవై థియేటర్లు ఉన్నాయని చెప్పారు. సినిమా రంగానికి ప్రభుత్వాలతో ఖచ్చితంగా పని ఉంటుందని, రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు అండగా ఉండాలని కోరుకుంటామని అన్నారు. కొందరు ఆయనకు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్లే పవన్ కల్యాణ్ కోపానికి గురయ్యారని అన్నారు. ఒకవేళ ఆయన తిట్టినా పడతామని, పెద్దన్న స్థానంలో ఉన్న ఆయనకు ఆ హక్కు ఉందని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలో ఏకాభిప్రాయం లేని కారణంగానే చాలా సమస్యలు వస్తున్నాయని, తమ గిల్డ్ లోనే కాకుండా... ప్రతి చోట ఈ సమస్య ఉందని దిల్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నిర్మాతలు సైతం గేమ్ ఛేంజర్ పైరసీని నేనే చేశానంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారని, ఎవరైనా తమ సినిమాను తాము చంపుకుంటారా అని దిల్ రాజు అన్నారు.

**ఆస్కార్ నటులు అంటూ బండ్ల గణేశ్ సెటైర్**

అయితే, దిల్ రాజు మీడియా సమావేశం జరుగుతున్న సమయంలోనే మరో ప్రముఖ నిర్మాత బండ్ల గణేశ్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'ఆస్కార్ నటులు, కమలహాసన్లు ఎక్కువైపోయారు. వీళ్ల నటన చూడలేకపోతున్నాం' అంటూ బండ్ల గణేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఆయన ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై స్పష్టత లేనప్పటికీ, దిల్ రాజు ప్రెస్ మీట్ జరుగుతున్న తరుణంలో ఈ ట్వీట్ రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. బండ్ల గణేశ్ వ్యాఖ్యలు దిల్ రాజును ఉద్దేశించే కావొచ్చని పలువురు సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 27-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు,
అమావాస్య ఉ.8.33
శుక్ల పాడ్యమి తె.5.03
రోహిణి రా.2.51
వర్జ్యం ఉ.7.55-9.21
దు.ఉ.8.11-9.03, 2) రా.11.48-12.40
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తు సేకరణ.

**వృషభం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. విందు వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:** అనుకోని ఖర్చులు పెరుగుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సోదరుల కలయిక.

**సింహం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడుతాయి. ఋణబాధలు తప్పవు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కన్య :** ప్రయాణాలు లాభిస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వస్తు సేకరణ.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యవహారాలలో నిదానం అవసరం.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** సంఘంలో ఆదరణ పొందుతారు. బాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** అనుకోకుండా వచ్చిన అవకాశాలు చేజారతాయి. ఖర్చులు పెరుగుతాయి. ఋణవత్తిడులు తప్పవు.

**మీనం :** భూవివాదాలు తీరిన తన ఒప్పందాలు కుదురుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

27-05Pg3exHMNWJQECL.qxd:27-05Pg3exHMNWJQECL.qxd 01/01/01 9:58 AM Page 1



## ప్రభుత్వం సంవత్సర పాలన కానుకగా ప్రజలపై 784 కోట్ల ఆస్తి పన్ను - సిపిఎం



చంద్రబాబు ప్రభుత్వ ఏడాది పాలనలో ఆస్తిపన్నుపై సీపీఎం నాయకులు డాక్యుమెంట్ ఆవిష్కరణ

**విజయవాడ.మే26,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం సంవత్సర పాలన పూర్తి సందర్భంగా పట్టణ ప్రజలపై 784 కోట్ల రూపాయల ఆస్తి పన్ను(ఇంటి పన్ను) పెంపు కానుకగా ఇస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. ఆస్తి పన్నుల సర్వేపై విజయవాడలోని శ్రీశ్రీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పన్నుల బాదుడులో వైసిపి ప్రభుత్వ దారిలోనే కూటమి ప్రభుత్వం ప్రయాణిస్తుందని విమర్శించారు. 123 నగరాలు, పట్టణాలలో 40 లక్షల గృహాలకు పన్ను పెంచటానికి ఇంటింటికి సర్వే ప్రారంభం అయిందని ఆయన పేర్కొన్నారు. ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పెట్టిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అనధికార కట్టడాల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై 100 పెనాల్టీ విధించిందని ఆగ్రహించారు. ఒకవైపున 15,485 కోట్ల రూపాయల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం, మరోవైపు ఇంటి పన్ను భారం వేస్తుందని మండిపడ్డారు. పట్టణాలలో మంచినీరు, డ్రైనేజీ పారిశుధ్యం, రోడ్లు తదితర సదుపాయాల కల్పనను విస్మరించి, నెల రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పన్నులు పెంచడానికి సర్వే చేపట్టడం దుర్మార్గమన్నారు. మేయర్లు, చైర్మన్ ల పదవుల కోసం ఫిరాయింపులు, బెదిరింపులకు పాల్పడడంపై దృష్టి తప్ప పట్టణ ప్రజల సదుపాయాల కల్పనపై కూటమి పార్టీలకు దృష్టి లేదన్నారు. అదానీ ఇతర కార్పొరేట్ కంపెనీలకు ఆస్తి పన్ను పూర్తిగా రద్దు చేస్తూ రాయితీలు ఇస్తూ, పేద మధ్యతరగతి ప్రజలపై ఇంటి పన్నుల భారాలు శోచనీయమన్నారు. మహానాడులో టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు విద్యుత్ భారాలు, ఇంటి పన్నుల పెంపును చర్చించాలని, రద్దు చేయాలన్నారు. ఇంటి పన్ను పెంపు కొరకు సర్వే ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా పౌర సంఘాలను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్పు!

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీనిపై ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో జిల్లా పేరు మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం కడప జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం కడప పేరును తొలగించి వైఎస్సార్ జిల్లాగా పరిగణించడంపై గతంలో ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తాయి. పేర్ల పిచ్చితో మార్పు: గతంలో జిల్లాలో ప్రతిపక్ష నేత హోదాలో పర్యటించిన సీఎం చంద్రబాబు పేరు మార్పుపై హామీ ఇచ్చారు. మంత్రి సత్యకుమార్ సైతం పేరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. పేర్ల పిచ్చితో మాజీ సీఎం జగన్ కడప అనే పదాన్ని లేకుండా వైఎస్సార్ జిల్లాగా మార్చడాన్ని తప్పుబట్టారు. ప్రజల నుంచి కూడా ఫిర్యాదులు రావడంతో వైఎస్సార్ కడప జిల్లాగా నామకరణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అభిప్రాయానికి వచ్చి పేరు మార్పుపై నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు ఇచ్చింది.

# తిరుమల సమాచారం

## పలకరించిన 'నైరుతి'! - చల్లబడిన తిరుమల



**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతిరుతుపవనాలు సకాలంలో రావడంతో మేనెలలో ఎండవేడినుండి ఉపశమనం కల్పిస్తూ వరుణదేవుడు సోమవారం మధ్యాహ్నం తిరుమలను పలకరించాడు. మోస్తరుగా కురిసిన వర్షంతోభక్తులు పులకించారు. అసలే మండుతున్న ఎండలకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంమేఘావృతమై చల్లటిగాలులు వీయడంతో రెండురోజులుగా ఆకాశంలో వాతావరణంలో మార్పులు రావడంతో వర్ష రూపంలో ప్రభావం చూపింది. తిరుమల కొండపై, తిరుపతిలోనూ సుమారు పదినిమిషాలు పాటు మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం కురిసిన వర్షంతో భక్తులు ఆలయంలోపలకు, వెలుపలకు తడుస్తూ సేదదీరారు.

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.11లక్షలు విరాళం



**తిరుమల,మే 26ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమలతిరుపతి దేవస్థానమ్ నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు విరాళాలు సమర్పిస్తున్నారు. సోమవారం ఉదయం అమెరికా టెక్సాస్‌కు చెందిన వేదాల రంగనాథ్, కృష్ణకుమారి టిటిడి ట్రస్టులకు 11లక్షలు రూపాయలు డిడిలను విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాల్లో ఎస్వీ అన్నదానంకు 10లక్షలు, ఎస్వీగోసంరక్షణకు ఒకలక్ష డిడిలను టిటిడిఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందించారు.

## గుంటూరు-గుంతకల్లు మధ్య పూర్తైన డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టు పనులు

**గుంతకల్లు రైల్వే,మే 26,ప్రభాతవార్త** తూర్పు-నైరుతీలను కలిపే రైలు మార్గంలో అంతర్భాగమైన రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వే గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలో నంద్యాల- గాజులపల్లి-దిగువమెట్ట సెక్షన్ మినహా మిగిలిన సెక్షన్‌లలో డబ్లింగ్ రైలు మార్గం పూర్తయ్యింది. 2018నుండి పనులు ప్రారంభమైన ఈ మార్గాన్ని 23దశలుగా విభజించి పనులు చేపట్టగా ఇప్పటివరకు 21దశలలో 343.462ట్రాక్ కిలోమీటర్ల డబ్లింగ్ రైలు మార్గాన్ని పూర్తి చేశారు. ఆయా దశలలో, సెక్షన్‌లలో పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసి ప్రారంభించిన డబ్లింగ్ రైలు మార్గం మొత్తం ట్రాక్ కి.మీలు (టికెయం)వివరాలు ఇలా వున్నాయి. పెరిచెర్ల-సాతులూరు మధ్య 24.004కి.మీలను 4-2-2020న ప్రారంభించారు. డోన్-పెండేకల్లు మధ్య 27.441కి.మీలను 8-3-2020న,నల్లపాడు-పెరిచెర్ల మధ్య 7.788కి.మీలను 1-12-2020న, పెండేకల్లు-ఎద్దులదొడ్డి మధ్య 8.581కి.మీలను 21-1-2021న,దొనకొండ-గజ్జెలకొండ మధ్య 12.403కి.మీలను 28-3-2021న, కురిచేడు-దొనకొండ మధ్య 12.523కి.మీలను 28-9-2021న,ఎద్దులదొడ్డి-మద్దికెర మధ్య 22.546కి.మీలను 22-2-2022న,గుండ్లకమ్మ-కురిచేడు మధ్య 11.451 కి.మీలను 8-3-2022న, గజ్జెలకొండ-తర్లుపాడు మధ్య 25.428కి.మీలను 19-10-2022న, చీకటిగలపాలెం- గుండ్లకమ్మ మధ్య 6.835కి.మీలను 6-12-2022న, మునుమాక-శావల్యపురం మధ్య 21.578కి.మీలను 28-2-2023న, బేతంచెర్ల-మల్కాపురం మధ్య 25.285కి.మీలను 26-3-2023న, తర్లుపాడు-జగ్గంభట్ల(క్రిష్ణాపురం మధ్య(జెబికె)20.377కి.మీలను 5-7-2023న, మద్దికెర-గుంతకల్లు మధ్య 10.748కి.మీలను 25-7-2023న, శావల్యపురం-చీకటిగలపాలెం మధ్య 14.903కి.మీలను 2-8-2023న,మనుమాక-సాతులూరు మధ్య 16.613కి.మీలను 3-11-2023న, మల్కాపురం-డోన్ మధ్య 11.232కి.మీలను 26-11-2023న,జగ్గంభట్ల-క్రిష్ణాపురం (జెబికె)-గిద్దలూరు మధ్య26.447కి.మీలను 4-1-2024న,బుగ్గానపల్లి సిమెంట్ నగర్-బేతంచెర్ల మధ్య 6.233కి.మీలను 27-3-2024న,గిద్దలూరు-దిగువమెట్ట మధ్య 12.011కి.మీలను 20-9-2024న, పాణ్యం-బుగ్గానిపల్లె సిమెంట్ నగర్ మధ్య 19.035కి.మీలను 27-12-2024న అందుబాటులో తెచ్చింది. ఈ మార్గంలో తూర్పు కనుమలలో భాగమైన దిగువమెట్ట-బొగద-చెలమ-బసవాపురం-గాజులపల్లి మధ్య 27కి.మీల సెక్షన్‌లోని నల్లమల ఫారెస్ట్‌లో డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టు పనులు ప్రారంభం కాగా గాజులపల్లి-నంద్యాల మధ్య 16కి.మీలు, నంద్యాల-పాణ్యం మధ్య మరో 14కి.మీల డబ్లింగ్ రైలు మార్గాన్ని సెప్టెంబరు నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు చేస్తుంది.



నల్లమల అడవుల్లో రైలు మార్గం(ఫైల్)

## మద్యం కుంభకోణం కేసు.. దిలీప్ బెయిలు పిటీషన్‌పై విచారణ వాయిదా

**విజయవాడ మే 26,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి(ఎ1) ప్రధాన అనుచరుడు దిలీప్ దాఖలు చేసిన బెయిలు పిటీషన్‌పై విచారణ వాయిదా పడింది. విచారణను విజయవాడ ఏసిబి కోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది. చెన్నై నుండి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో దిలీప్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. చెన్నై విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని..సిట్ అధికారులకు సమాచారమిచ్చారు. అప్పటికే దిలీప్ కదలికలపై నిఘా పెట్టిన అధికారులు చెన్నైలోనే మకాం వేసి ఉండటంతో వెంటనే విమానాశ్రయానికి వెళ్ళి అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరుపర్చగా అప్పటి నుండి రిమాండులో ఉన్నారు.



## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి:తిరుమలలో ప్రముఖులు

**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని పలువురు ప్రముఖులు వేడుకున్నారు. సోమవారం ఉదయం మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, ఏపి హైకోర్టు జడ్జి జస్టిస్ టిసిడి శేఖర్, కర్నాటక లోకాయుక్త జస్టిస్ బిఎస్ పాటిల్, మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్, సినీనటి సురేఖవాణి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు.

ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గోదావరిలో 8మంది గల్లంతుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హోంమంత్రి అనిత

**విజయవాడ.మే26,ప్రభాతవార్తప్రతినిధి:** బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం కమినిలంక వద్ద గోదావరిలో 8 మంది యువకులు గల్లంతయిన ఘటనపై హోంమంత్రి అనిత ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ కృష్ణారావుతో హోంమంత్రి అనిత ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. కె.గంగవరం మండలం శురుల్లంకలో శుభకార్యానికి వెళ్లిన యువకుల్లో 11 మంది స్నానం కోసం గోదావరిలో దిగి గల్లంతైనట్లు కలెక్టర్... హోంమంత్రికి వివరించారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. ఏపీఎస్డీ ఆర్ఎఫ్ ఐజీ రాజకుమారితోనూ హోంమంత్రి అనిత ఫోన్ చేసి మాట్లాడి అప్రమత్తం చేశారు. రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి భద్రత బలగాల ద్వారా సత్వరం గాలింపు చర్యలు చేపట్టాలని హోంమంత్రిఆదేశించారు.

## కుటుంబంలో నలుగురిని కబళించిన రోడ్డుప్రమాదం..

### మృతులలో ముగ్గురు మహిళలు

**రాజమహేంద్రవరం సిటీ మే 26 ప్రభాతవార్త.** ..జాతీయ రహదారి దివాన్ చెరువు నాలుగు వరుసల రహదారి బ్రిడ్జిపై సోమవారం రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. ఒకే కుటుంబానికి చెందిన భార్య భర్త అత్త మరణించారు. భార్య మృతి చెందగా భర్త అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఈ రోడ్డు ప్రమాదం ముగ్గురు మహిళలు, ఒక వ్యక్తి ప్రాణాలు బలి తీసుకుంది. కొవ్వూరు వైపు బొగ్గు లోడు వేలుసుకుని లారీ జాతీయ రహదారి గామన్ బ్రిడ్జి సమీపంలో లారీ టైర్ పేలిపోయింది. దీంతో లారీ బ్రేక్ వేయడాని డ్రైవర్ ప్రయత్నం చేశాడు. అయినా టైర్ రహదారిపై సుమారు 30 మీటర్లు రాసుకుంటూ అదుపు తప్పి రహదారిపై కుడివైపుకు ఒకకసు వేగంగా తిరిగింది. అదే సమయంలో కొవ్వూరు నుండి దివాన్ చెరువు వస్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. దీనిలో ప్రయాణం చేస్తున్న కొవూరుకు చెందిన ఉప్పులూరి వర ప్రసాద్(60), ఉప్పులూరి శివ లీలావతి(56), లంకసాని బిందు (34) అక్కడికక్కడే మరణించారు. తీవ్రగాయాలైన ఇమ్మాని వీర వెంకట సత్యవతి(75) లంకసాని సురేష్ 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సత్యవతి మరణించింది. సురేష్ , బిందు భార్యాభర్తలు. ఇతను అవంతి సీడ్స్ లో సూపర్ వైజర్ గా పని చేస్తున్నాడు. వరప్రసాద్ కు శివ లీలావతి భార్య, వీరి వెంకట సత్యవతి అత్త అవుతుంది. కాకినాడలో శివ లీలావతి కుమార్తె ఇంజనీరింగ్ చెందుతుంది ఈరోజు ఆమె పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పడానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృత్యువు కదిలించింది. బిందు పుట్టినిల్లు చాగొల్లు గ్రామంలో వరప్రసాద్, శివ లీలావతి, సత్యవతి మార్కొంపాడు గ్రామంలో విషాదఛాయలు నెలకొంటున్నాయి. బిందు, సురేష్ లకు పెళ్లి జరిగి ఆరేళ్ల అయింది పిల్లలు లేరు. ఈ ప్రమాదంలో భర్త భార్య ను కోల్పోయి అపస్మారక స్థితిలో ఉన్నారు. మరొకరు అత్త కూతురు అల్లుడు మృతి చెందారు. రెండు కుటుంబాల్లో నాలుగురు మృత్యువాతకు గురైనారు. సంఘటనా స్థలాన్ని నార్త్ జోన్ డిఎస్పీ వై. శ్రీకాంత్ పరిశీలించారు. లారీని వేగంగా ఢీ కొట్టడం వలన కారు ముందు భాగం లారీల్లోకి ఇరుక్కుపోయింది ప్రొక్లీనర్ సహాయంతో తీసారు.

అయితే లారీ టైర్ పేలిపోవడం లేదా బ్రేక్ ఫెయిల్ అవ్వడం వలన ప్రమాదం జరిగిందా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో ముగ్గురు చాగల్లు మండలంగా భావిస్తున్నారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈమేరకు డిఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైటప్..1) ప్రమాదంలో మృతిచెందిన వరప్రసాద్ శివ లీలావతి భార్యాభర్తలు.

(ఫైల్ ఫొటో) 2) వీర వెంకట సత్యవతి (ఫైల్ ఫొటో), 3) మృతురాలు బిందు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ (ఫైల్ ఫొటో), 4. ప్రమాదానికి గురైనారు.

## రికార్డుస్థాయిలో వెంకన్న దర్శనాలు



**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవుల రద్దీ తిరుమలలో కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం ఒక్కరోజే 91,538మంది భక్తులకు రికార్డుస్థాయిలో శ్రీవారి దర్శనం కల్పించారు. అంతేగాక శనివారం రోజు కూడా 90,211మంది భక్తులకు రికార్డుస్థాయిలో టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. గతంలో 2014-15లో 91వేలమంది దాటినా గత ఐదేళ్ళలో వేసవిసెలవుల్లో ఇంతమందికి దర్శనం చేయించడం రికార్డుగా నమోదైంది. అందరి భక్తులకు సంతృప్తికరంగా ఆలయంలోపల దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వీయపర్యవేక్షణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ వివిఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్ సహకారంతో ప్రశాంతంగా దర్శనం చేయించారు. మరోవైపు వేసవిసెలవులు ముగింపుకు వస్తుండటం...వారాంతం సెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. ఆది,సోమవారాల్లో కూడా తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. సాయంత్రానికి 52వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇదిలా ఉండగా అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. ఈనెల 24రోజుల్లో 51లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ జరిగింది. ప్రతిరోజూ సగటున 2.5లక్షల అన్నప్రసాదాలు, 90వేలకుపైగా అల్పాహారాలు, పానీయాలు అందిస్తున్నారు. శనివారం ఒక్కరోజే వెంగమాంబ అన్నదానభవనంలో 93,950మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గత మూడురోజుల్లో 3.32లక్షమంది భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు.

## పంచాయతి సంబరాల్లో విద్యుద్ఘాతం

### ముగ్గురు మృతి, మరో ఇద్దరికి గాయాలు



**కంచిలి (శ్రీకాకుళం జిల్లా), మే 26 ప్రభాతవార్త:** కంచిలి మండలం తలపంపర పంచాయతీ సిర్లపుట్టుగ గ్రామంలో సోమవారం ఉదయం జరిగిన విద్యుత్ ఘాతానికి ముగ్గురు బలయ్యారు. తలపంపర పంచాయతీలో గత నాలుగైదు రోజులుగా సంబరాలు జరుగుతున్నాయి. ఈ సంబరాల కోసం వీధిలో ఏర్పాటు చేసిన అలంకరణలో విద్యుత్ తీగ తెగిపడి ముగ్గురు ప్రాణాలను బలిగొంది. ఈ గ్రామంలో 30 కుటుంబాలు నివశిస్తున్నాయి. సంబరాల కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చుట్టాలు రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం రోజు చుట్టాలంతా గ్రామానికి వచ్చి సంబరాల్లో పాల్గొన్నారు. ఒరియా నారాయణపురం గ్రామానికి చెందిన నలియా కృష్ణ మూడు సంవత్సరాలు ఇంటి బయట ఆడుకుంటుండగా విద్యుత్ తీగ తగలడంతో మృతి చెందాడు. అతన్ని కాపాడడానికి వచ్చిన అతని మేనమామ ఈశ్వర్ (28) కూడా విద్యుత్ షాక్ తగిలి అక్కడే మృతి చెందాడు. ఆ పక్కనే నివసిస్తున్న పురుషోత్తపురం గ్రామానికి చెందిన బహడపల్లి నందిని (12) కూడా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది.మృతి చెందిన ఈశ్వర్ శ్రీకాకుళంలోని హోటల్లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. ఈశ్వర్‌కు కొద్దిరోజుల క్రితమే బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం కుదిరింది. ఈశ్వర్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న అమ్మాయి రోదన వర్ణనాతీతం.వీరితో పాటు విద్యుత్ షాక్‌కు గురైన మరో ఇద్దరు సోంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలానికి సోంపేట సీఐ, కంచిలి ఎస్సైలు పారినాయుడు చేరుకొని విచారణ చేపట్టారు. అయితే పోలీసులు చేరుకునే సరికి గ్రామంలో అంతా ఒక్కటై జరిగిన సంఘటన ఆనవాళ్లు లేకుండా విద్యుత్ వైర్లని తొలగించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులతో మాట్లాడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారని నాయకులు పేర్కొన్నారు. చనిపోయిన మృతులంతా నిరుపేదలకు చెందినవారు. రాష్ట్ర ప్రభుత్వం మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఢిల్లీలో సిఆర్‌డిఎ కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు సమాలోచనలు

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ సీఆర్‌డిఏ కమీషనర్ కూనపరెడ్డి కన్నబాబు ఢిల్లీ పర్యటన చేపట్టారు. అమరావతిలో పెట్టుబడులు సమీకరించేందుకు ఢిల్లీ,గుడ్‌గావ్‌లో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఆదివారం ఏరో సిటీ,గుడ్‌గావ్ లోని కీలక ప్రాంతాలల్లో పర్యటించి, అమరావతి మాస్టర్ ప్లాన్,పెట్టుబడుల సమీకరణ వ్యూహంపై పలువురితో చర్చించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా జాతీయ,అంతర్జాతీయ నిర్మాణ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అమరావతి విమానాశ్రయా నిర్మాణం,నదీతీర ప్రాంత అభివృద్ధి తదితర ప్రధానమైన ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షించారు.

## మొదటిఘాట్‌లో చిరుత సంచారం



**తిరుమల,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండల్లో చిరుతల సంచారం మళ్ళీ భయంగోల్పిస్తోంది. సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఓ చిరుతపులి ఏకంగా దిగువఘాట్‌లో (మొదటి)వినాయకుడిగుడి వద్ద రక్షణగోడపై కూర్చుని ఉండటం, వాహనాల రాకతో వెలుతురుఫోకస్‌కు గోడపై వెళ్ళడం జరిగింది. మొదటిఘాట్‌రోడ్డు దాటడాన్ని వాహనదారులు గమనించారు. వెంటనే భయంతో విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సాధారణంగా శేషాచలంఅటవీప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వేసవిలో వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక,ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.చిరుతపులి సంచారంతో భక్తులు భయపడుతున్నారు.

## శ్రీసిటీని సందర్శించిన థాయిలాండ్ కాన్సుల్‌జనరల్ - పెట్టుబడి అవకాశాల పరిశీలన

**సత్యవేడు, మే 26 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం సమీపం శ్రీసిటీలో రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. తన భార్య నరఫాన్‌అరిబార్గ్, కాన్సుల్ పిన్‌పాంగ్ చౌవాచాటాతో కలసి రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్(బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ శ్రీసిటీలోని థాయిలాండ్ పరిశ్రమ రాక్‌వర్త్ స్థాపన, ప్రస్థానాన్ని కాన్సుల్ జనరల్ బృందం దృష్టికి తెచ్చారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, వ్యాపార ప్రయోజనాలను వారికి వివరించారు. మొదటి రోజు పర్యటనలో శ్రీసిటీ అధికారులతో చర్చలు, పారిశ్రామిక వాడ పరిసరాల వీక్షణతో పాటు స్థానిక రాక్‌వర్త్, మోండెలెజ్ పరిశ్రమలను ఆయన సందర్శించారు. కంపెనీ ప్రతినిధులతోను సమావేశమయ్యారు. రెండవ రోజు పర్యటనలో బ్లూస్టార్, మురుగప్ప గ్రూప్ కంపెనీలను ఆయన సందర్శించనున్నారు.



శ్రీసిటీలో రాయల్ థాయ్ కాన్సుల్ రాచా అరిబార్గ్

## మద్యం కుంభకోణం నిందితుల కస్టడీ పిటిషన్‌పై ఎసిబి కోర్టు తీర్పువాయిదా

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుల కస్టడీ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు తన తీర్పును వాయిదా వేసింది. మే 29వ తేదీకి ఈ తీర్పును వాయిదా వేస్తున్నట్లు కోర్టు సోమవారం వెల్లడించింది. మద్యం కుంభకోణంలో నిందితులను తమ కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ కోర్టులో సోమవారం ఉదయం వాదనలు జరిగాయి. వాదనలు విన్న కోర్టు... సాయంత్రం తీర్పు వెలువరిస్తామని తెలిపింది. దీంతో తీర్పును రిజర్వు చేసింది. కానీ తీర్పును మే 29వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ఆ తర్వాత ప్రకటించింది. మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి రాజశేఖరరెడ్డి కీలక సూత్రదారంటూ వైసీపీ మాజీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి బహిరంగంగా మీడియా ముందు ప్రకటించారు. దీంతో అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో మారు పేరుతో గోవా నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టులో దిగిన అతడిని ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించి.. సిట్ పోలీసులు విచారించారు. అతడు చెప్పిన ఆధారాలతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డితోపాటు మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వారిని సైతం విచారించారు. ఇక ఇదే కేసులో బాలాజీ గోవిందప్ప కూడా అరెస్టయ్యారు. వీరిని తమ కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఈ కేసులో కీలక సూత్రధారి కసిరెడ్డి రాజశేఖరరెడ్డిని సైతం మరోసారి తమ కస్టడీకి అప్పగించాలంటూ వారు కోర్టును కోరారు. ఆ క్రమంలో సోమవారం ప్రభుత్వం తరపు న్యాయవాది, సిట్ తరపు న్యాయవాదితోపాటు నిందితుల తరపు న్యాయవాది కోర్టులో తమ వాదనలు వినిపించారు.

వార్త

మంచి కథ కల్పించినట్లుగా కాక
నిజంగా జరిగినట్లుగా ఉండాలి.
చదివే వారికి కథ అనే శంక కలిగితే అది కథ కాదు.

-చలం

# కబళిస్తున్న మత్తు రక్కసి

మాదక ద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తుందని, దానిని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు చెప్తూనే ఉన్నారు. ఆ రాక్షసిని ఉక్కుపాదంతో అణచివేయాలని కూడా పిలుపునిస్తున్నారు. కానీ అంతకు రెట్టింపుస్థాయిలో ఈ మహ్మమారి యేడాది యేడాదికి విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. ముఖ్యంగా ఈ వ్యసనం ఇరవైఏళ్ల లోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరోవైపు నేరాల సంఖ్య అదుపు లేకుండాపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకోవడానికి హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్ ద్వారా జరిగిన మత్తుమందుల కొనుగోళ్లలో ఆసియా ఖండం వాటా పద్నాలుగు శాతానికి పెరిగిపోయింది. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. 2004 దశకంలో భారత్‌లో కోటి డెబ్బైలక్షల మందికిపైగా మత్తువాడకం దార్లు ఉండగా ప్రస్తుతం మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించే వారిసంఖ్య దాదాపు నలభై కోట్లకు చేరుకుందని చెబుతున్నారు. ముఖ్యంగా అస్సాం,హర్యానా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, యుపి, పశ్చిమబెంగాల్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ మత్తు పదార్థాల వినియోగం పెరిగిపోతున్నది. కేంద్ర సామాజిక న్యాయ సాధికార వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం గతంలో వెల్లడించిన గణాంకాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. మత్తుమందులు వాడకంలో ఉత్తరాది రాష్ట్రాలతో దక్షిణాది రాష్ట్రాలు కూడా పోటీ పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతున్నాయి. దీనికితోడు గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీలోనూ, ఇటు తెలంగాణ ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లోనూ అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు విస్తరిస్తున్నట్లువార్తలు అందుతున్నాయి. గతంలో గంజాయి సాగు రవాణా, వినియోగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకునేవారు. ఎందుకోఏమోకానీ నిఘా తగ్గిపోతున్నది. 2021అక్టోబరు మూడో వారంలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో నల్గొండ జిల్లా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విష యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అక్రమదారులను ప్రోత్స హిస్తున్నది మీరంటే మీరని పరస్పర ఆరోపణ చేసుకున్నారు. ఆ తర్వాత ఎందుకో ఆ ఆపరేషన్ ఆగి పోయిందనే చెప్పొచ్చు. దీనికితోడు విదేశాల నుండి భారీ ఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రాపోర్టులో ఇరవై ఒక్కవేల కోట్ల విలువైన మూడువేల కిలోల హెరా యిన్ పట్టుబడినట్లు విజయవాడ లింకులు వెలుగు చూశాయి. మత్తు మందు సరఫరాలో కోట్లాది డాలర్లలోఅధిక శాతం ఉగ్రవాదుల సంస్థలకే చేరుకుంటుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద నేరముఠాలు మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. ఈ మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా ఈ మత్తుమందు వ్యాపారులు ఉప యోగించుకుంటున్నారు. ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయగలిగే 'క్రిప్టోకరెన్సీ' వాడకం సైతం జరగడంతో ఈ లావాదేవీలకు అదుపులేకుండా పోతున్నది. గతంలో మత్తు మందులు కొనేవారు తెలిసినా, వాడకం దారులు వారికి నమ్మకం ఉన్న వ్యాపారినే సంప్రదించేవారు. మత్తు మందును తీసుకొని డబ్బు చేతిలో పెట్టేవారు.ఆ వ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తుమందు తెప్పించి అప్పగించేవాడు. అయితే అత్యంత పకడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడో ఒక దగ్గర దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్నమత్తుమందు వ్యాపారికి ఆర్డరు ఇవ్వొచ్చు. మత్తుమందు రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోతు న్నాయి. ప్రపంచమంతా విస్తరించిపోతున్నది. పట్టుబడిన కేసుల్లో కూడా పటిష్టంగా వ్యవహరించలేక పోవడం వల్లనో లేక చట్టంలో ఉన్న లొసుగులేమోకానీ జైళ్ల నుంచి బయటకు వచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఇంకొక పక్క సమర్థవంతంగా దర్యాప్తు జరిపి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు విఫలం కావడంతో అధికశాతం కేసులు న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేం. ఏదోఒక రాష్ట్రం చర్యలు తీసుకుంటే నియంత్రించడం సాధ్యం కాదనేది కొంతవరకు నిజమే కావొచ్చు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణరూపొందించి అమలు చేయాలి. ఏదిఏమైనా మానవ జీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలోచూపాల్సిన తరుణమిది. ఈ బాధ్యతంతా పాలకులపై వదిలి పెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు,ప్రజాస్వామ్యవాదులు అందరు కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన సమయమిది.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్

వయసు మీరిన తర్వాత మనకు అవసరమైన ఆశ్రయాన్ని ఇవ్వగలిగింది విజ్ఞానమే.



చెస్టర్ ఫీల్డ్

## ప్రజావాక్కు



### ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

దేశంలో ఉన్న అన్ని రవాణా వ్యవస్థల్లో రైల్వే రవాణా సగటు భారతీయునికి తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనంకలిగిన వ్యవస్థగా ఉండేది.కానీ ఇటీవల జరుగుతున్న తరచూ ప్రమాదాలవల్ల అమలు చేస్తున్న అసాధారణ నిర్ణయాలవలన రైల్వేల పట్ల నిర్లిప్తత వ్యక్తం అవుతున్నది. గతంలో జరిగిన 200 రైల్వే ప్రమాదాల్లో దాదాపు 350 మంది మరణించినట్లు, 970 మంది ప్రమాదాల బారిన పడినట్లు తెలుస్తున్నది. 2020 సంవత్సరంలో కవాచ్ ప్రవేశపెట్టిన తర్వాతకూడా దాదాపు 200 ప్రమాదాలు జరిగాయి. రక్షణ భద్రత బదులుగా ఆధునికమైన నవీకరణఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రధానమంత్రి కలల స్వప్నమైన బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం లక్షల కోట్లు వెచ్చిస్తున్నారు. సాధారణ ప్యాసింజర్ రైళ్ల జనరల్ బోగీలను పెంచడంపెంచిన ఛార్జీలను తగ్గించడం ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపులను ఏర్పాటు చేయాలి.

- దండంరాజు రాంచందర్‌రావు, హైదరాబాద్

### పెరుగుతున్న అంతర్జాల వినియోగం

ఇటీవల కాలంలో అంతర్జాల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. రీల్స్ పేరిట వెర్రిచేష్టలు, ఆన్‌లైన్ గేమ్స్ మోసాలు, ఆన్‌లైన్‌లోనే వేధింపులు ఇంకా అనేక రకాల సైబర్ మోసాలను తరచూ మనం చూస్తూనే ఉన్నాం. వీటిబారిన పడకూడదంటే పాఠశాల, కళాశాలస్థాయి నుండి అంతర్జాల వాడకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పౌర సమాజం బాధ్యతగా వ్యవహరించాలి.

-ఎం. ముత్యంరెడ్డి, సిద్ధిపేటజిల్లా

### పేదల ఆకలి పట్టని రేషన్ డిపోలు

ఆంధ్రప్రదేశ్ ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా అర్హులైన పేదలకు ఉచిత బియ్యంతోపాటు రాయితీపై కందిపప్పు, పంచదారను కూడా సరఫరా చేయాల్సి ఉండగా గత నాలుగైదు నెలలుగా కార్డుదారులకు కేవలం ఒక్క బియ్యం మాత్రమే సరఫరా చేస్తూ కొన్ని ప్రాంతాల్లో అరకొరగా పంచదార ఇస్తున్నారు. అంగన్‌వాడీలకు జ్యుడీషియల్ ప్రివ్యూ నుంచి అనుమతులు లభించిన తర్వాత కూడా కందిపప్పు టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లకుండా పౌర సరఫరాల శాఖ నిలిపివేసింది.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

### యువతలో మానసిక సమస్యలు

నేటి ఉరుకులపరుగుల జీవితం, ఆధునిక జీవనశైలి, యువత జీవితాల్లో మానసిక ఒత్తిడిని వేగంగా పెంచుతోంది. టీనేజర్లు, యువకులు ఒత్తిడిని ఎక్కువగా అనుభవిస్తున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో మానసిక ఒత్తిడి కనిపించడం ఆందోళనకరంగా మారింది. దీనికి ప్రధాన కారణం పాఠశాల, కళాశాలల ఒత్తిడి, సోషల్ మీడియా డిమాండ్, సమాజంలో తమ సొంతగుర్తింపును సృష్టించడానికి మానసికంగా సంఘర్షణకు గురవుతూ, పోరాడుతున్నారని వైద్యనిపుణులు చెబుతున్నారు. వీడియో గేమ్‌లు, షేర్‌చాట్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటివాటితో గడుపుతున్న టీనేజర్లు ఎక్కువగా హిక్కోమోరి సిండ్రోమ్ బారినపడుతున్నారని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఫలితంగా యుక్త వయస్సు నుండే యువత పలు మానసిక అనారోగ్యాలకు గురవుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రోడ్లను బాగు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. సంక్షేమ కార్యక్రమాల పేరుతో అప్పులు చేసి తెచ్చిన పప్పు కూడుగా డబ్బులు నేరుగా ప్రజల అకౌంట్లోకి వెళ్లిపోవడం వల్ల కెసిఆర్ స్వార్థం కారణంగా కాంగ్రెస్ వారి తెలివి తక్కువఆలోచన కారణంగా విభజించబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిన్న రాష్ట్రంగా మారింది. 13 జిల్లాలు 26 జిల్లాలుగా మారి ఉద్యోగుల సంఖ్యను పెంచేసింది. రాజకీయ నాయకుల సంఖ్యను కూడా పెంచేసింది. వారి పోషణ ప్రజలకు చాలా కష్టంగా మారింది. రోడ్లు అధ్వాన్నంగా ఉండడం వల్ల యాక్సిడెంట్లు విపరీతంగా జరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రజల రక్షణ కోసం ఎగుమతులు, దిగుమతులు సక్రమంగా జరగడం కోసం రోడ్ల మీద దృష్టిపెట్టాలి.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

### రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

ప్రజల కష్టార్జితాన్ని సులువుగా నిమిషాలలో దోచేస్తున్నారు నేడు సైబర్ నేరగాళ్లు. వీరి బారినపడి నిత్యం ఎందరో అమాయకులు మోసపోతున్నారు. రోజుకో తీరున, రోజుకో పేరున కొత్త రకాల మోసాలతో జనాలని దోచుకుంటున్నారు. ఇంట్లో డబ్బుకు దొంగల భయం, బ్యాంకులో సైబర్ నేరగాళ్ల భయం అనే విధంగా నేడు ధనం భద్రంగా దాచుకునే అవకాశం లేకుండాపోయింది. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు గట్టిచర్యలు తీసుకోవాలి.

-కె. శేషగిరి, సికింద్రాబాద్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# జీవన గమనాన్ని మార్చుతున్న సాంకేతిక రంగం

**సాంకేతిక రంగం లేనిదే పూట గడవని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించడానికే భయంగా ఉంది. భువన గగనాల్లో ఆధిపత్యం కోసం పోరాటం జరుగుతున్నది. ఇందులో సాంకేతికత ప్రముఖ భూమిక పోషిస్తున్నది. యుద్ధాలు కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్నాయి. అణ్వస్త్రాల్యు, ఇతర యుద్ధ పరికరాలు, యుద్ధవిమానాలు ఆధునికత సంతరించుకున్నాయి. అన్నింటా టెక్నాలజీ దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తగు జాగరూకత వహించాలి. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు మాత్రమే సాంకేతిక పరిజ్ఞానం వినియోగపడేటట్లు తగిన యంత్రాంగం నెలకొల్పాలి. విధ్వంసానికి, విద్వేషాలకు సాంకేతికతను దుర్వినియోగపరచకూడదు. సాంకేతిక పరిజ్ఞానమంటే యుద్ధాలకో, విధ్వంసానికో కాదు ఉద్యోగ కల్పన కోసం, మెరుగైన జీవన శైలికోసమనే భావన ఏర్పడింది.**

సుంకవల్లి సత్తిరాజు

సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా ప్రపంచాన్ని పెను మార్పులకు గురి చేస్తుందని ఎవరూ ఊహించలేదు. రాబోయే కొద్ది సంవత్సరాల్లో ప్రపంచాన్ని ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పూర్తిగా ఆవహించే అవకాశాలు మెండుగాఉన్నాయి. వచ్చే ఏడాది నాటికి 50శాతం కోడింగ్ ఏఐ చేస్తుందని మెటాప్లాట్‌ఫామ్స్ సిఇఓ మార్క్ జుకర్‌బర్గ్ చెబుతుంటే, మైక్రోసాఫ్ట్‌లో ఇప్పటికే 30 శాతం కోడింగ్ ఎఐ చేతుల్లోకి వెళ్ళిందని ఆ సంస్థ సిఇఓ సత్య నాదెళ్ల పేర్కొనగా, హేమాహేమీల కందని కోడింగ్ ఏఐ సొంతమని స్పేస్‌ఎక్స్, ఎక్స్,టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించడాన్ని బట్టి చూస్తే భవిష్యత్తులో ఏఐ ప్రాధాన్యత ఎలా ఉండగలదో ఊహించగలం. భవిష్యత్తులో ఎఐ మీద పట్టుగల వారికే ఉద్యోగాలు దక్కుతాయి. సాఫ్ట్‌వేర్ రంగం సాఫ్ట్‌నెస్ కోల్పోయింది. కష్టించి పనిచేసి, అప్పగించిన పనులు విజయవంతంగా పూర్తి చేయగలిగితేనే కొంతకాలం ఉద్యోగాల్లో కొనసాగగలరు.నేటి చదువులు,మార్కులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి ఉపకరించగలవా? అనే సంశయం కలగడం సహజం. మారుతున్న టెక్నాలజీని ఎప్పటికప్పుడు ఒడిసిపట్టుకుని, ఉద్యోగాలు సంపాదించాలి. ఉద్యోగార్థులు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ వేతనాలతో పని చేసే వారికే టెక్ కంపెనీలు ప్రాధాన్యత నిచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే అరకొర జీతాలతో గొడ్డుచాకిరీ చేస్తున్నవారిని చూస్తున్నాం. మానసికంగా నలిగిపోతూ, ఉంటుందో, ఊడుతుందో తెలియని భద్రత లేని ఉద్యోగాల కోసం మనశ్శాంతి కోల్పోవడం కంటే ప్రత్యామ్నాయ ఉపాధిని అన్వేషించుకోవడం మంచిది. మార్కులతో, బట్టీ చదువులతో తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని భ్రమపడే తల్లిదండ్రుల ధోరణి మారాలి. బోధనా పద్ధతులు కూడా మారాలి.అన్ని రంగాలు సాంకేతికతతో మేళవించిన కారణంగా ఎక్కడ ఏచిన్న పొరపాటు జరిగినా యావత్ ప్రపంచం స్తంభించిపోయే ప్రమాదముంది.సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన నిపుణులు, ఉద్యోగులు, టెక్ కంపెనీలు సాంకేతిక వ్యవస్థలు దుర్వినియోగంకాకుండా ప్రపంచ జీవన గమనం సాఫీగాసాగడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయి. వర్తమాన ప్రపంచంలో చోటుచేసుకుంటున్ననేరాల్లో అత్యంత ఆధునిక నేరంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. ఈ మాట వింటుంటే ముచ్చెమటలు పట్టక మానవు. ఒకప్పటి సినిమాల్లో భయంకరమైన రౌడీ వేషాల్లోవచ్చి,కిడ్నాపులు చేయడం,దోపిడీలకు పాల్పడడం వంటి సన్నివేశాలు కనిపించేవి. అయితే ఈ ఆధునిక సమాజంలో నిజంగా నిర్లజ్జగాక్షణాల్లో మోసాలు జరిగిపోతున్నాయి. కాలు బయటకు కదపకుండా, కోట్లు కూడబెట్టే విద్యలో కొంతమంది ఆరితేరిపోయారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్లకు కాసుల పంటగా మారింది.కోట్లు దండుకునే ఘరానా మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎక్కడో విదేశాల్లో కూర్చుని, చెమట పట్టకుండా, విద్యాధికులకు సైతం ముచ్చెమటలు పట్టించే వికృతమైన క్రీడా విన్యాసానికి పర్యాయపదంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. అశ్లీల దృశ్యాలను సాంఘిక మాధ్యమాల్లో పెడతామని బ్లాక్ మెయిల్ చేసి, సామాన్యుల నుండి సెలబ్రిటీలను సైతం మోసం చేసి,డబ్బులు గుంజుకోవడం చూస్తున్నాం. ప్రభుత్వ పథకాల పేరుతో, బ్యాంకు అధికారుల పేరుతో వివిధ రకాలుగా బెదిరింపులకు పాల్పడుతూ, ఎటియం పిన్‌చెప్పమంటూ అజ్ఞాత వ్యక్తులు మాయ మాటలు చెప్పడం, కెవైసి అప్‌డేట్ కోసమంటూ ఓటిపి అడగడం,మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపడం, వాట్సాప్‌లలో లింకులు పంపించి, క్లిక్ చేయమనడం ద్వారా డబ్బులు కాజేయడం వంటి సంఘటనలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడా లేకుండా నమ్మించి, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయించడంతో ఏం చేయాలో అర్థంకాక ఎంతోమంది ఆవేదన చెందుతు




న్నారు. కష్టించి,సంపాదించిన సొమ్మంతా క్షణాల్లో మాయం కావడంతో ఏంచేయాలో అర్థంగాక అమాయకులు తీవ్రమైన మనోవ్యధకు గురవుతున్నారు. మన మాటలను, వీడియోలను పరిశీలించి, ఎడిట్ చేసి, మోసంచేయడం, శీల హననం చేయడానికి యత్నించడం, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం, తమ మాట వినకపోతే తీవ్రంగా నష్టపోతారంటూ, బెదిరింపులకు పాల్పడడం జరుగుతున్నది. ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్టుల పేరుతో తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న ముఠాలు బయలు దేరాయి. సైబర్ క్రైమ్ నేరాలను నిరోధించడానికి టోల్ ఫ్రీ నెంబర్లు ఇవ్వబడ్డాయి. అనేక కేసులు నమోదవుతున్నాయి. అయితే కేసులు పెట్టడం వలన ఎంత మంది నేరస్థులు పట్టుబడుతున్నారో,ఎలాంటి శిక్షలు విధిస్తున్నారో అర్థం కావడం లేదు. భారతదేశంలో డిజిటల్ అరెస్టులకు చట్టబద్ధత లేకపోయినా,వీటి పేరుతో నేరస్థులు సాగిస్తున్న కార్యకలాపాలకు బెంబేలెత్తిపోతున్న అమాయకుల ఆక్రందనలకు అడ్డుకట్టవేయలేమా? సాంకేతిక రంగంలో పెను విప్లవం 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్'. కృత్రిమ మేధస్సుతో వివిధ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి, ఆధునీకరించిన సాంకేతిక ప్రక్రియతో వేగవంతంగా పనులను పూర్తి చేసి, ప్రగతిని పరుగులు పెట్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విస్తృతం చేసే ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. భవిష్యత్తులో కృత్రిమ మేధ కీలక భూమిక పోషించే అవకాశముంది.అయితే ఇలాంటి కృత్రిమ మేధ సైబర్ నేరస్థులకు స్వర్గధామంలా మారడం దురదృష్టకరం. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌సహాయంతో మన మాటలను, మన వీడియోలను మార్ఫింగ్ చేసి, వాట్సాప్ ద్వారా పంపించి, డబ్బులు పంపించమంటూ కోరడం, ఆ వీడియోలు నిజమేనని నమ్మి డబ్బులు పంపించడం ద్వారా ఆర్థికంగా నష్టపోతున్న వారు ఎవరిని ఆశ్రయించాలో తెలియక తికమకపడుతున్నారు. కేసులు పెట్టినా ఫలితం ఉంటుందనే నమ్మకం లేక దిగాలు పడుతున్న వారికి న్యాయం జరుగుతుందా? టెక్నాలజీ దుర్వినియోగం విశృంఖలంగా కొనసాగుతున్నది. మన ప్రయోజనాల కోసం మనం నిర్మించుకున్న సాంకేతిక ప్రపంచం వక్రమార్గంలో పయనిస్తున్నది. విద్య,వైద్య,ఆర్థిక,రవాణా, కమ్యూనికేషన్, సాంస్కృతిక రంగాల్లో నిర్మాణాత్మకంగా వినియోగపడవలసిన టెక్నాలజీ అసాంఘిక శక్తుల చేతుల్లోకి పోయి, అడ్డదారుల్లో పయనిస్తున్నది. మొబైల్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. మొబైల్ ఫోన్ లేనిదే రోజు గడవని పరిస్థితులు ఏర్పడ్డాయి. యూట్యూబ్, వాట్సాప్ ఫేస్బుక్, ఇన్‌స్టాలు, ట్విట్టర్,ఎక్స్ వంటి సాంకేతిక వేదికలు సమాజానికి ఉపకరించాలి. అయితే సోషల్ మీడియా అన్ని విలువలను అతిక్రమించి,అత్యంత ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో కొత్తగా పుట్టుకొచ్చిన "ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్" వలన ఎన్నో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే దీని ప్రభావం వలన అనేక మంది బాధితులైనారు. మొబైల్ ఫోన్లలో నిక్షిప్తమైన మన వ్యక్తిగత భద్రత ప్రశ్నార్థంగా మారుతు న్నది. నిర్మాణాత్మకంగా ఉపయోగపడవలసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను అసాంఘిక కార్యకలాపాలకు, ఆర్థికనేరాలకు వినియోగించడం వలన వ్యక్తిగత గోప్యతకు, ఆర్థికభద్రతకు, స్వేచ్ఛకు ముప్పుగా పరిణమించింది. డేటాచౌర్యం యథేచ్ఛ గా సాగుతున్నట్టు పలు వార్తా కథనాలు సూచిస్తున్నాయి. ఇకనైనా సైబర్ నేరాల పట్ల పటిష్ఠమైన, వేగవంతమైన చర్యలు తీసుకోవాలి. సైబర్ నేరాలను అణచివేయడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకంకావాలి. సమిష్ఠితత్వంతోపటిష్ఠమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి. సాంకేతిక రంగం లేనిదే పూట గడవని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించడానికే భయంగా ఉంది. భువన గగనాల్లో ఆధిపత్యంకోసం పోరాటం జరుగుతున్నది. ఇందులో సాంకేతికత ప్రముఖ భూమిక పోషిస్తున్నది. యుద్ధాలు కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్నాయి. అణ్వస్త్రాల్యు, ఇతర యుద్ధ పరికరాలు, యుద్ధవిమానాలు ఆధునికత సంతరించుకున్నాయి. అన్నింటా టెక్నాలజీ దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తగు జాగరూకత వహించాలి. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు మాత్రమే సాంకేతిక పరిజ్ఞానం వినియోగపడేటట్లు తగినయంత్రాంగం నెలకొల్పాలి. విధ్వంసానికి, విద్వేషాలకు సాంకేతికతను దుర్వినియోగపరచకూడదు. సాంకేతిక పరిజ్ఞానమంటే యుద్ధాలకో, విధ్వంసానికో కాదు ఉద్యోగ కల్పన కోసం,

# అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం

బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రభుత్వం నెల నెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన, బాధ్యతగా మెలగాల్సిన కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు నెల విడిచి సాము చేస్తూ తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి,చిన్న,సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును ముక్కు పిండి మరీ వసూలు చేస్తూ తమ వికృత,నికృష్ట నైజాన్ని చాటుకుంటుండటం తీవ్ర హేయమైన, ఆక్షేపణీయమైన విషయం. ఆ విధంగా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల డబ్బు పిచ్చి ఏ విధంగా తయారు అయింది అంటే'అయ్యగారికి లంచం ఇస్తేనే కంచం కదిలేది' లాగా, కాస్తో, కూస్తో 'సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే' వారికి ఆరోజు నిద్రపట్టేలా లేదు అన్నట్లుగా. ఒక విధంగా చెప్పాలంటే ఒక వేటగాడు తన కడుపు నింపుకోవడానికి ఏదేని జంతువును ఎలా వెంటాడి వెంటాడి వేటాడుతాడో ఆ తరహాలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు సామాన్య ప్రజలను ఒక జలగల లాగా పీక్కుతుంటూ వారి నుంచి బలవంతంగా అయిన దానికి కాని దానికి కాసులు దండుకుంటుండటం



అత్యంత జుగుస్సకరం, సిగ్గు చేటైనా విషయం.కొన్ని సందర్భాలలో వీరి అవినీతి, లంచాలు శృతిమించి, సామాన్య ప్రజలకు వెర్రెత్తి వీరి బాగోతాన్ని ఎసిబి అధికారులకు చేరవేస్తే వారు అఘామేఘాల మీద వచ్చి వీరి మీదపడి వీరిని అత్యంత అవమానకరంగా సస్పెండ్ చేస్తున్నప్పటికీ వీరి వక్ర బుద్ధిలో ఏ మాత్రం మార్పురాకపోవడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన, దురదృష్టకరమైన విషయం. ఏదిఏమైనా వీరికి ఏ మాత్రంపేద, నిరుపేద ప్రజలపై, సామాన్య రైతులపై జాలి,దయ,సానుభూతి అంటూ ఏ మాత్రం, ఏ కోశానా ఉండదు.ఎంతసేపు వీరి బొక్కసాలను నింపుకోవడం పైనే వీరి దృష్టి అంతా. ఏమి చేస్తాం వీరికి ఎంతసేపు డబ్బు సంపాదనపై తీరని వ్యామోహం తప్పించి వీరిలో మానవత్వం ఇసుమంతైనను కానరాదు. 'పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు' కొంత మంది నిజాయితీ గల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వీరిని చూసి అవినీతికి, లంచాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారే ప్రమాదం సైతం పొంచి వుంది. ఇందులో ఎలాంటి సందేహానికి తావులేదు. ఏమైనా ఆ కాలమే వీరి దుర్బుద్ధిని,వక్ర స్వభావాన్ని మార్చాలి తప్ప వీరు మారరు గాక మారని దురాశపరులు, లంచాలను అడుగడుగున రుచి మరిగిన బొత్తిగా వ్యక్తిత్వం లేని ధనాశపరులు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు మనమంతా ఒక యుద్ధ ప్రాతిపదికన ఉద్యమిద్దాం. అవినీతి, లంచం అనే మహమ్మారిని తరిమి తరిమి కొడదాం! అవినీతి రహిత సమాజ రూపకల్పనకు మన వంతుగా పాటుపడదాం. ●

# వ్యూహాత్మక సంకల్ప వేదిక మహానాడు

సిద్ధార్థ రాయ్

దేశ రాజకీయ చిత్రపటంలో కొత్త అధ్యాయానికి తెర లేపిన తెలుగుదేశం పార్టీ ఈసారి మహానాడుతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపబోతున్న సంకేతాలు అం దుతున్నాయి. ఎన్నోఆశలు, ఆకాంక్షలతో లక్షలాది మంది తెలుగుదేశం తమ్ముళ్లు ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. అదే మహానాడు విశాల వేదిక. ఈసారి టీడీపీ మహా నాడు మాత్రం సాదాసీదా సభగా భావించలేము. ప్రత్యే కించి నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగే ఈ మహానాడు, గతంలో అన్నింటకన్నా విభిన్నంగా, విస్తృతంగా, విశిష్టంగా మారుతోంది.

## ప్రత్యర్థులకు స్పష్టమైన సంకేతం

ఈ సమావేశానికి కడప వేదిక కావడం రాజకీయంగా ప్రతీకాత్మకంగా మారింది. ఇది వైఎస్సార్ కాంగ్రెస్ కోటగా ఉన్న కడప జిల్లాలో నిర్వహించడమే. కడప అంటేనే వైఎస్ కుటుంబానికి అఖండ వేదికగా భావించిన స్థలం. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా వైఎస్ రాజ్యమేలిన ఈ భూభాగంలో టిడిపి మహానాడు నిర్వహించడం వాస్తవానికి రాజకీయ ధైర్య సాహసానికి నిదర్శనం. ఈ నిర్ణయం ద్వారా చంద్రబాబు కొన్ని స్పష్టమైన సంకేతాలు పంపిస్తున్నారు. ఒక్క కడపనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తిరిగి పునరుత్తేజానికి సంకేతం. ఎవరూ ఊహించని స్థలంలో మహానాడు నిర్వ హించడం, ప్రత్యర్థుల గూఢార్థాలను కట్ చేస్తూ, పార్టీ సామర్థ్యాన్ని రుజువు చేయడం అనే వ్యూహాత్మక సంకల్పమే దీని వెనుక ఉంది.

## పునరుత్తేజ స్ఫూర్తి

టిడిపి మహానాడు అంటే కేవలం ఒక వార్షిక సమావేశం మాత్రమే కాదు. ఇది పార్టీలో సామూహిక ఆత్మపరిశీలనకు, బహిరంగ చర్చలకు వేదిక. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన అనంతరం జరిగే మహానాడు కావడంతో, నూతన పాలనకు రూపురేఖా విలాసాలను నిర్దేశించే సభ. అందుకే ఇది కీలకం. ఎన్నికల హామీలు, పాలన తీరుపై స్పష్టత, బృహత్తర అభివృద్ధి యాజమాన్యం గురించి పార్టీ శ్రేణులకు సమాచారం అందించేందుకు, అధికారంలో ఉన్న నేతలు తమ లక్ష్యాలు షేర్ చేసుకునేందుకు ఇది అత్యుత్తమ అవకాశం.

ఈ మహానాడు సందర్భంగా పార్టీలో పునరోత్సాహం కలిగించే ముఖ్య నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వివిధ కమిటీల ఏర్పాటు, యువ నాయకత్వానికి అవకాశం కల్పించే మార్గదర్శక చర్యలు, పార్టీ శ్రేణుల బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు చర్చకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

## వ్యూహాత్మక మార్గదర్శకత్వం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపికి దక్కిన సీట్లు ఘన విజయానికి నాయకత్వ పటిమకు స్పష్టమైన కారణంగా నిలిచింది. చంద్రబాబునాయుడు అనుభవం, రాజకీయ వ్యూహాశాస్త్రం, ప్రజల్లోకి తీసుకెళ్లిన అభివృద్ధి దృక్కోణం, ఈ విజయాన్ని పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా ప్రదర్శిస్తూ, అదే దృఢసంకల్పంతో ముందుకు సాగేందుకు చంద్రబాబు ఈ మహానాడును వేదికగా మార్చనున్నారు. ఈసారి మహానాడులో చంద్రబాబు మార్గదర్శకత్వం అత్యంత ప్రాధాన్యత కలిగింది. గత ప్రభుత్వ తీరును ఎండగట్టడమే కాకుండా, కొత్త ప్రభుత్వ ప్రాధాన్యాలు, అనుసరించబోయే విధానాలపై స్పష్టత ఇవ్వనున్నారు. పార్టీ శ్రేణులను ప్రజా సేవకు పునరంకిత దిశగా సమాయత్తం కాగల వేదిక. ఇది కేవలం పార్టీ కార్యకర్తలకే కాదు, ప్రజలకూ సందేశం.

వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసిపి భవిష్యత్తు చర్చల్లోనే లేకుండా పోయింది. ప్రజా వ్యతిరేకపాలన, అప్పుల వృద్ధి, నెరవేర్చని హామీలు, దుర్వినియోగ దుష్పరిపాలన వల్ల ప్రజలు వైసిపికి తలుపు మూసేసిన తరుణంలో కార్యకర్తలకు హితోపదేశం ఎంతో అవసరం. ఇప్పుడు చంద్రబాబు అదే ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి వచ్చారు. ఈ తరుణంలో మహానాడు ఒక ప్రతిఘటన వేదికగా మారనుంది. గత పాలనపై విమర్శల ద్వారా ప్రజల్లోకి సంకేతాలు పంపించడమే కాకుండా, భవిష్యత్తు పాలనలో ప్రాధాన్యతలు ఏమిటో స్పష్టత ఇవ్వనుంది.

## రాజకీయ దిక్సూచి!

ఈ మహానాడు టిడిపి భవిష్యత్ పయనానికి దిక్సూచి వంటిది. రాజకీయంగా, సంస్థాపితంగా పార్టీ ఎలాంటి మార్పులు చేపట్టనుంది? యువతను ఆకర్షించే చేరే దిశగా ఎలాంటి వ్యూహాలు రూపొందించనుంది? అనేవి ఈ మహానాడులో నిర్ణయిస్తారు. 2029 లక్ష్యంగా తీసుకుంటూ పార్టీ వ్యూహాలు రూపొందించబోతున్నారు. కడపలో జరుగుతున్న మహా నాడు, తెలంగాణాలో పార్టీ పరిస్థితి, పొత్తుల వైఖరిపై చర్చలకు తలుపులు తెరుస్తుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలన్న సంకల్పంతో చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు పార్టీ శ్రేణులకు ఆత్మవిశ్వాసం నింపే, వ్యూహాత్మక పునర్నిర్మాణానికి బీజం వేయనున్న మహానాడు.. నిజమైన కార్యకర్తల ప్రతిష్ఠాత్మక వేదికగా పునరాగమన పథానికే వేదికగా నిలుస్తోంది. ●

# మరుగుదొడ్ల నిర్మాణం సామాజిక బాధ్యత

## -గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరుతూర్పు,మే26,ప్రభాతవార్త:** మరుగుదొడ్ల నిర్మాణం మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. సోమవారం గుంటూరులోని రాజావారితోట ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్మించిన 39 టాయిలెట్లను ఎమ్మెల్యే



నసీర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.38 లక్షలు, ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫీజు ఫండ్ నుంచి రూ.25 లక్షలతో ఈ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బాలికల విద్యాలయాలలో టాయిలెట్ల నిర్మాణం అనేది బాధ్యతగా తీసుకున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే మ లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో విద్యాలయాలలో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. జూనియర్ మహిళా కళాశాలలో ఎన్నో ఏళ్లుగా అసౌకర్యాలలేమి కనిపిస్తోందని, ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చిన వెంటనే స్పందించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించుకోవడంతోపాటు ప్రత్యేక ఫీజు ఫండ్ ద్వారా సుమారు 60 లక్షలతో 39 టాయిలెట్ల నిర్మాణానికి పూర్తి చేశామని చెప్పారు. తిరిగి కళాశాల ప్రారంభమయ్యే సమయానికి టాయిలెట్లు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ విషయంలో కళాశాల యాజమాన్యం కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించే దిశగా సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యా విధానాలలో సమూల మార్పులు చేపట్టినట్టు తెలిపారు. ఇవి విద్యార్థుల జీవన ప్రగతికి బాటలు వేసే విధంగా ఉండబోతున్నాయని తెలిపారు. గుంటూరు నగరంలో అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక శాఖ కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత డివిజన్ అధ్యక్షులు జీజ, ప్రిన్సిపాల్ సునీత, ఆర్ఐఓ జుబేర్, కోట పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పరిష్కార వేదిక అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలి

## -బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

**బాపట్ల,మే26,ప్రభాతవార్త:** ప్రజా పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు.పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా



కలెక్టర్ అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.177 అర్జీలు నమోదు కాగా, తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.అర్జీల పరిష్కారంపై ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. పి జి ఆర్ ఎస్ పై అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. 22ఏ క్యాటగిరీలో పెండింగ్లో ఉన్న 108 అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవోలకు సూచించారు. సాధారణ బదిలీల్లో అధికారులు పారదర్శకత పాటించాలన్నారు. బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయరాదన్నారు. ఆ స్థానంలో పొరుగు జిల్లాల నుంచి అదే హోదాలో వచ్చే వారు ఉంటేనే అనుమతి కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌కు 75 అర్జీలు

**నరసరావుపేట, మే26 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో



సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి బాధితులనుండి మొత్తం 75 ఫిర్యాదులు అందాయి. అమరావతి గ్రామానికి చెందిన పవిత్రకు పవన్‌కుమార్‌తో వివాహం జరిపించగా రూ.2లక్షలు కట్నం, బంగారం తీసుకుని సంతానం కల్గిన తర్వాత రోజూ త్రాగి వేధిస్తున్నాడని బాధితురాలు తెలిపారు. లింగంగుంట్ల గ్రామంలో తన ఇంటిని అద్దెకు ఇవ్వగా వారు ఖాళీ చేయటం లేదని బాధితుడు టిఆర్ శ్రీనివాసరావు ఆర్జీ అందించారు. వినుకొండ స్వీపర్స్ కాలనీలో వెంకట నారాయణ మూర్తి అనే అతను తొమ్మిది మంది వద్ద లోన్ జిడిఎస్ బ్యాంకులో ఇప్పిస్తానని చెప్పి రూ.15వేలు ఒక్కొక్కరి వద్ద వసూలు చేసినట్లు ఫిర్యాదు చేసారు. సంతమాగులూరు గ్రామానికి చెందిన కాటం రాజు ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన్నట్లు బాధితుడు వేణుబాబు ఎస్పీ గ్రీవెన్స్‌లో తెలిపారు. అదే విధంగా చాకలికుంట తండాకు చెందిన కేతావత్ దేవికి 10సంవత్సరాల క్రితం సత్తెనపల్లికి చెందిన గోపి నాయక్‌తో వివాహం అయ్యిందని కొంత కాలంగా మద్యం సేవించి వేధిస్తున్నాడని బాధితురాలు తెలిపింది. కాగా ఆయా సమస్యల పై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కారించాలని ఎస్పీ కె శ్రీనివాసరావు ఆదేశాలు ఇచ్చారు.

# ప్రతి ఫిర్యాదును శాశ్వతంగా పరిష్కరించాలి : డాక్టర్ డి.చంద్రశేఖర్

**విజయవాడ కార్పొరేషన్,మే 26,ప్రభాతవార్త:** ప్రతి ఫిర్యాదును శాశ్వతంగా పరిష్కరించాలని అదనపు కమీషనర్ డాక్టర డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదుల వేదికను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుండి 20 ఫిర్యాదులను అందుకున్నారు. వీటిలో పట్టణ ప్రణాళికకు సంబంధించి-5, ఇంజనీరింగ్-9, రెవిన్యూకు సంబంధించినవి-1 ,వైద్య, ఆరోగ్యం-4, ఎస్టేట్



మొత్తం కలిపి 17 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమీషనర్ రెవిన్యూ జి.సృజన, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖరరెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధంలో పాల్గొన్న జవాన్‌కు సన్మానం

నరసరావుపేట టౌన్, మే26 ప్రభాతవార్త : ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో పాల్గొన్న వీర జవాన్ పఠాన్ గౌస్‌ఖాన్‌కు సోమవారం స్దానికపెద్దలు ఘనంగా సన్మానం చేసారు. ఎంహెచ్‌పిఎస్ నాయకులు



మస్తాన్‌వలి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ దేశ రక్షణలో విధులు నిర్వహించి పట్టణానికి మంచి పేరు తీసుకుని రావటం గొప్ప విషయమన్నారు. వరవకట్ట ప్రాంతంలోని యువతకు జవాన్ చేసిన సేవలు స్ఫూర్తినిస్తుందన్నారు. దేశ రక్షణలో వరవకట్టకు చెందిన వారు ఉండటం గర్వకారణమన్నారు. తనకు సత్కారం చేసిన స్దానికులకు సన్మానగ్రహీత పఠాన్ గౌస్ కృతఘ్నతలు తెలిపారు. కార్యక్రమంలో జక్రియ, ఇమామ్, సైదావలి, రఫీ, సుభాని, కరీం తదితరులు పాల్గొన్నారు.

# రైఫిల్ షూటింగ్‌లో కెఎల్‌యు విద్యార్థి ముఖేష్‌కు కాంస్య పతకం



**తాడేపల్లి,మే 26,ప్రభాతవార్త :** ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ షూటింగ్ ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ లో కెఎల్ యూనివర్సిటీకి చెందిన నేలపల్లి ముఖేష్ కాంస్య పతకం సాధించినట్లు వర్సిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ సోమవారం తెలిపారు. 25మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఫిస్టల్ విభాగంలో 22 పాయింట్లతో ముఖేష్ ఈ పతకం సాధించాడు. ఈనెల 24నుంచి జర్మనీలోని సుహి షూటింగ్ రేంజ్‌లో ఈ పోటీలు జరిగాయి. థామస్ క్లెమెంట్ (ఫ్రాన్స్) ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణపతకం సాధించగా, పోలెండ్‌కు చెందిన విక్టర్ లూయిస్ ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం దక్కించుకోగా భారత్‌కు చెందిన ముఖేష్ నేలపల్లి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నారు. ముఖేష్ నేలపల్లి కెఎల్ యూనివర్సిటీలో బిటెక్ సిఎస్ఐటి 3వ సంవత్సరం చదువుతున్నట్లు డాక్టర్ కె.హరికిషోర్ చెప్పారు.

# ఫిర్యాదులను 48 గంటలలోగా పరిష్కరించాలి : నగర మేయర్ కోవెలమూడి

**గుంటూరు కార్పొరేషన్,మే26,ప్రభాతవార్త:** క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు నగరం కోసం నగరంలో వార్డుల వారీగా చేపట్టిన మెగా క్లీనింగ్ కార్యక్రమంలో గుర్తించిన, ప్రజల ఫిర్యాదులను 48 గంటల్లోగా పరిష్కరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం 21వ వార్డ్ లోని భాను ప్రసాద్ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీ, కెవిపి కాలనీ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ



నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి తో కలిసి పర్యటించి మెగా క్లీన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మెగా క్లీన్ కార్యక్రమం ద్వారా వార్డ్ లలో సుదీర్ఘ కాలం నుండి ఉన్న పారిశుధ్యం, డ్రైన్ల సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కెవిపి కాలనీ మెయిన్ రోడ్ వివిపిలు నిత్యం రాకపోకలు చేస్తుంటారని, సదరు రోడ్, మెయిన్ డ్రైన్ ఆక్రమణలతో నిండిపోయిందన్నారు. సదరు ఆక్రమణలను 2 రోజుల్లో తొలగించాలన్నారు. డ్రైన్లలో తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ కార్యదర్శులు చిత్తశుద్ధితో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ని కోరారు. అనేక ప్రాంతాల్లో అనధికార, నిర్దేశిత జిఎంసి నుండి అనుమతి లేకుండా, మాస్టర్ ప్లాన్ కి భిన్నంగా నిర్మాణాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సదరు ప్రాంతాల పట్టణ ప్రణాళిక సచివాలయ కార్యదర్శులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, వార్డ్ లో సాదారణంగా విధులు నిర్వహించే కార్మికులతో పాటు అదనంగా కార్మికులతో ప్రతి వీధిని, డ్రైన్ల ను శుభ్రం చేయడం, అనధికార హోర్డింగ్స్, బోర్డ్ లు ఉంటే తొలగించడం జరుగుతుందన్నారు. నూతన సిసి రోడ్ ల నిర్మాణంకు ముందే డ్రైన్ల నిర్మాణం చేపట్టాలన్నారు. సక్కింగ్, జెట్టింగ్ యంత్రాల ద్వారా ఇళ్ళ మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిని బెయిల్ అవుట్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భానుప్రసాద్ కాలనిలో త్రాగునీటి సరఫరా కాలుష్యంపై ప్రజలు తెలిపిన మేరకు సరఫరా సమయంలోనే ప్రజలు నీటిని పట్టుకోవాలని, ఇతర సమయాల్లో మోటార్ల ద్వారా నీటిని పంప్ చేయకూడదన్నారు. ఆయా ప్రాంతాల్లో సరఫరా సమయంలో శ్యాంపిల్స్ తీసి, ఎక్కడైనా లీకులు ఉంటే తక్షణ చర్యలు తీసుకోవాలని డిఈఈని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా క్లీన్ ద్వారా నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన పారిశుధ్యాన్నిఅందించడానికి కృషి చేస్తున్నామన్నారు. వార్డ్ ల వారీగా పేరుకోపోయిన చెత్త కుప్పలను తొలగించడం, మౌలిక వసతుల కల్పనను ఈ ప్రత్యేక డ్రైవ్ లో చేపడతామన్నారు. క్షేత్ర స్థాయిలో కొందరు కార్యదర్శులు, సిబ్బంది విధుల్లో నిర్లిప్తంగా ఉంటున్నారని, అటువంటి వారు పని తీరు మార్చుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులు, ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. శివారు ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేసి, వాటికి లైటింగ్ అధికంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్యదర్శులు, అధికారులు ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకొని, ఉన్నతాధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, విధుల్లో భాధ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ సిటి ప్లానర్ సూరజ్ కుమార్, డిఈఈ మధుసూదన్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, కంద్రగుంట గురవయ్య, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# యోగాంధ్ర -2025లో భాగంగా నేడు ర్యాలీ

**గుంటూరు కార్పొరేషన్,మే26,ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం (27వ తేదీ) ఉదయం 7 గంటలకు బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం నుండి లక్ష్మీపురం మధర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ జరగుతుందని, ర్యాలీలో జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొంటారని, నగరంలోని యువత, సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు,



స్వచ్చంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుండి జూన్ 21 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో గుంటూరు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనెలా అవగాహన కల్గించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా యోగంధ్ర వెబ్ సైట్ లో యోగా పై ఆసక్తి కల్గి, దేశ ప్రధాని పాల్గొనే వైజాగ్ లో జరిగే సదస్సు కు వెళ్ళాలనుకునే వారి రిజిస్ట్రేషన్ చేస్తున్నామని తెలిపారు. మంగళవారం జరిగే ర్యాలీలో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్

## -తహశీల్దార్ సిద్దార్ధ

**కొల్లిపర,మే 26 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమవారం గ్రీవెన్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయటం జరిగిందని తహశీల్దార్ గుమ్మడి సిద్దార్ధ అన్నారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 6 ధరఖాస్తులు రావటంతో వాటిని పరిష్కరించాలని సంభంధిత అధికారులను తహశీల్దార్ ఆదేశించారు.ఈ సందర్భంగా సిద్దార్



మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి ధరఖాస్తును పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగించు కోవాలన్నారు. గ్రీవెన్స్‌కు హాజరైన వారిలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి ఈవోపిఆర్‌డి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# వీసి నియామకానికి కసరత్తు.!

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే26, ప్రభాతవార్త:** ఏఎన్‌యుకు రెగ్యులర్ వీసి నియామకానికి సంబందించిన సెర్చ్ కమిటీ సమావేశం ముగిసినట్లు సమాచారం. ఈ సెర్చ్ కమిటీలో ముగ్గురు నిష్ణాతులైన ప్రొఫెసర్ల పేర్లను సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి కమిటీ సిఫార్సు చేస్తుంది. కాగా, మద్రాస్ నుంచి ఒకరు, ఆంధ్రా యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీల నుంచి పలువురు ప్రొఫెసర్ల పేర్లు ఉన్నట్లు తెలిసింది. వీసి పదవి కోసం పదవుల సంఖ్యలో దరకాస్తులు రావడంతో వాటన్నింటిని వడపోసి ముగ్గురి పేర్లను ఖరారు చేసి ఎంపిక ప్రక్రియను పూర్తిచేస్తారు. వారిలో ప్రభుత్వ సూచనల మేరకు గవర్నర్ ఒకరిని రెగ్యులర్ వీసిగా నియమిస్తారు. వీసిగా నియమితులైన వారు 3ఏళ్ళు పదవిలో కొనసాగుతారు. వీసి పదవికి నాగార్జున యూనివర్సిటీ నుంచి 10మంది దరఖాస్తు చేసుకున్నట్లు వినికిడి. వీరిలో ఆరుగురికి మాత్రమే అన్ని అర్హతలు ఉన్నాయని తెలిసింది. ఇదిలా ఉండగా రాజధానిలో ప్రభుత్వ యూనివర్సిటీగా నాగార్జున వర్సిటీ నడుస్తుంది. నూతన రాజధాని అమరావతిలో ఇప్పటికే కొత్తగా ఐదు ప్రవేట్ యూనివర్సిటీలు నడుస్తున్నాయి. మరికొన్ని ప్రారంభానికి చర్చలు జరుగుతున్నాయి. వాటితోపాటు కెఎల్ యూనివర్సిటీ, విజ్ఞాన్ యూనివర్సిటీ, వివిఐటి యూనివర్సిటీల ప్రభావం నాగార్జున యూనివర్సిటీపై బలంగా పడనుంది. ఆ యూనివర్సిటీలను తట్టుకుని నిలవాలంటే ఇక్కడ విధులు నిర్వహించే అధికారులు శ్రమించాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. ఈ క్రమంలో నాగార్జున యూనివర్సిటీకి స్థానికులను వీసిగా నియమించాలా లేక ఇతర యూనివర్సిటీల నుంచి తీసుకురావాలనా అనే సందిగ్ధంలో ప్రభుత్వం ఉంది. స్థానికేతరులకు వీసి పదవి ఇస్తే వారు యూనివర్సిటీపై పట్టు సాధించడానికే చాలా సమయం పడుతుందనేది ఒక ఆలోచనగా ప్రభుత్వం భావిస్తుంది. అలాగే గత ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుకు ఇతోధికంగా




సహకారం అందించిన రాష్ట్రానికి చెందిన ఆశావాహులు చాలామంది పలు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. పార్టీకోసం పనిచేసిన వారిని కాదని ఇతర రాష్ట్రాల నుంచి వీసిలను దిగుమతి చేసుకునే సాంప్రదాయానికి ప్రభుత్వం ఫులుస్టాప్ పెట్టినట్లు వేగుల సమాచారం. కాగా, గతేడాది జూలై నుంచి నాగార్జున యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసిగా ఆచార్య కె.గంగాధరరావు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన వైపు మొగ్గు చూపుతుందని వర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# బదిలీలకు కౌన్సిలింగ్‌ను నిర్వహించిన సిపి రాజశేఖరబాబు

**విజయవాడ క్రైం,మే 26,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో భాగంగా ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందిలో ఒకే పోలీసు స్టేషన్ నందు ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఏఎస్ఐలకు, హెడ్ స్టేషన్‌లకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో 14 మంది ఏఎస్ఐలకు, 118 మంది హెడ్ కానిస్టేబుళ్ళకు, 188 మంది కానిస్టేబుళ్ళకు కౌన్సిలింగ్ నిర్వహించి వివిధ పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. ఎన్నడూ లేని విధంగా సిబ్బందితో స్వయంగా మాట్లాడి వారి అభ్యర్థనల మేర



కానిస్టేబుళ్ళకు, కానిస్టేబుళ్ళకు సోమవారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్వి రాజశేఖరబాబు కౌన్సిలింగ్ నిర్వహించారు. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారితో స్వయంగా మాట్లాడి వారి వారి అభ్యర్థనల మేరకు వివిధ పోలీసు బదిలీలు చేసినందుకు పోలీస్ సిబ్బంది నగర పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు బదిలీ కాబడిన సిబ్బంది కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి కెజివి సరిత, ఏడిసిపి ఎం.రాజారావు, ఎసిపిలు, సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81ఫిర్యాదులు

**విజయవాడ క్రైం,మే 26,ప్రభాతవార్త:** సోమవారం సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు పోలీస్ కమీషరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికను డిసిపి కృష్ణమూర్తి నాయుడు



నిర్వహించారు. ఆయన ప్రజల నుండి 81 ఫిర్యాదులను స్వీకరించారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్ళి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఫిర్యాదుల్లో భూ వివాదాలకు, ఆస్థి వివాదాలకు, నగదు లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు-39, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించి-07, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి-07, చోరీలకు సంబంధించి-4, కొట్లాటలకు సంబంధించి-5, సైబర్ నేరాలకు సంబంధించి-5, ఇతర చిన్న చిన్న వివాదాలు,సమస్యలకు, సంఘటనలకు సంబంధించి-14 ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# బైక్ దొంగలకు 6 నెలలు జైలు శిక్ష

**కొల్లిపర,మే 26 ప్రభాతవార్త:** బైక్ దొంగతనం కేసులో 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ సోమవారం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ తీర్పు వెలువరించారు. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం కుంచవరం గ్రామానికి చెందిన వెలివెల కోటేశ్వరరావు హీరో హోండా మోటార్ సైకిల్‌ను, కొల్లిపరకు చెందిన కేశన గంగాధర్ మోపెడ్‌ను డిసెంబరు 29 వ తేదీ 2024 సంవత్సరంలో ఇంటి ముందు పెట్టుకున్నారు. ఉదయం నిద్రలేచి చూడగా కనిపించపోవటంతో కొల్లిపర పోలీస్‌స్టేషనులో పిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో కొల్లిపరకు చెందిన అమిరే ఆనందకిషోర్, పిల్లి శ్రీనులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా ముద్దాయిలకు ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ తెలిపారు. ఈ కేసుకు పీపీగా సునీల్‌కుమార్ వ్యవహరించారు.

# బ్లాక్ బర్లీ పొగాకు పంటను కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

## -బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

**బాపట్ల,మే25,ప్రభాతవార్త:** బ్లాక్ బర్లీ పొగాకు పంటను కంపెనీలు వేగంగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం స్థానిక పిజిఆర్ఎస్ హాలులో జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు కొనుగోలులో సమస్యల పరిష్కారం కొరకు పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. పొగాకు రైతుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పొగాకు కొనుగోలుపై ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొగాకు కొనుగోలు తర్వాత పంట నిల్వ చేయడానికి అవసరమైన గోదాములు గుర్తించి, సిద్ధంగా ఉంచాలన్నారు. పొగాకు కొనుగోలు ముగిసే వరకు పొగాకు కంపెనీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో వీడియో, టెలి కాన్ఫరెన్స్ లు నిరంతరాయంగా నిర్వహిస్తామన్నారు. మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పందాల మేరకు పొగాకు కొనుగోలులు జరగాలన్నారు. అలాగే ధాన్యం సేకరణ వేగం పుంజుకునేలా



అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 33,200 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగ్గా, ఇంకా 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా ఈనెల 27వ తేదీన బాపట్లలోని భావపురి మందిరం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు, వారి సిబ్బంది మొత్తం హాజరు కావాలన్నారు. అదే మాదిరిగా ఈనెల 31వ తేదీన సూర్యలంక సమీపంలోని అటవీ శాఖ నగర వనంలో భారీ స్థాయిలో యోగాసనాల కార్యక్రమం జరపాలన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమంపై మాట్లాడారు. అవాంతరాలు ఏర్పడకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు, ధ్రువీకరణ పత్రాలు సేకరించాలన్నారు. ఐవిఆర్‌యస్ ఫిర్యాదులపై అధికారులు తక్షణమే విచారణ జరపాలన్నారు. 16 రకాల ప్రభుత్వ సేవల గురించి ప్రజల స్పందనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జూన్ 22వ తేదీ తర్వాత గ్రామీణ ప్రాంతాలలోని రహదారుల వెంట చెత్త కనిపించరాదన్నారు. ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు భరోసా ప్రజా పరిష్కార వేదిక

బాపట్ల, మే26,ప్రభాతవార్త: ప్రజా పరిష్కార వేదిక అర్జీదారులకు భరోసా కల్పిస్తుందని చీరాల డిఎస్పీ ఎమ్.డి.మోయిన్ అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు సోమవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చీరాల డిఎస్పీ ఎమ్.డి.మోయిన్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల (వ్రాతపూర్వక అర్జీలను డిఎస్పీ మోయిన్ స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో విచారించి పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను సూచించారు.



కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు ఇతర పలు సమస్యల పై 59 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిజిఆర్ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కర్లపాలెం,మే26,ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు తాను పరిశుభ్రంగా ఉండడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉండే విధంగా చూడాలని టీడీపీ నాయకులు, యూనిట్ ఇంచార్జి మాదా శ్రీనివాసరావు అన్నారు.కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కలను గ్రామస్తుల సహకారంతో సాకారం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రజని,జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు



## డొంక నిర్మాణానికి సర్వే జరిపించండి

యద్దనపూడి, మే 26, ప్రభాతవార్త : యద్దనపూడి గ్రామ పంచాయితీ పరిధిలోని నేషనల్ హైవే నుండి విశ్వనాధకండ్రిక వరకు ఉన్న డొంక సర్వే నిర్వహించి హద్దు రాళ్లు వేయవల్సిందిగా తహశీల్దార్ విజయశ్రీకి రైతులు, నాయకులు వినతి పత్రం సోమవారం అందజేసారు. ఈ సందర్భంగా వారు వివరిస్తూ గతంలో సంబంధిత డొంకకు గ్రామ పంచాయితీ తీర్మానం చేయటం జరిగిందని, కావున రెవెన్యూ అధికారులు డొంకకు సర్వే నిర్వహించి హద్దులు చూపితే నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, కావున రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని త్వరలోనే సర్వే పనులు ప్రారంభించే విధంగా కోరుతున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన గ్రామ పంచాయితీ తీర్మానం కూడా అందజేయటం జరిగిందన్నారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో పోపూరి రాఘవయ్య, ముత్తవరపు సుబ్బారావు, వంకాయలపాటి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు ఎన్ఆర్‌టి సెంటర్ వద్దనున్న ఐటిసి పొగాకు కంపెనీ ఎదురు రైతులు నిరసనదీక్ష

చిలకలూరిపేట,మే26,ప్రభాతవార్త: రైతులు పండించిన నల్లబర్లి పొగాకును వెంటనే ప్రభుత్వం, సంబంధిత పొగాకు కంపెనీలు కొనాలని కోరుతూ మంగళవారం నరసరావుపేట సెంటర్ వద్దనున్న ఐటిసి కంపెనీ ఎదుట రైతులు నిరాహారదీక్ష చేయనున్నారని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు సోమవారం తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయమంత్రి సమక్షంలో పొగాకు కంపెనీలు అంగీకరించిన విధంగా బర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయమంత్రి సమక్షంలో ఏప్రిల్ 28వ తేదిన పొగాకు కంపెనీలు అంగీకరించిన విధంగా గత సంవత్సరం కొన్ని క్వింటాల్ రూ 15వేలకు తగ్గకుండా కంపెనీల చేత కొనిపించాలి. కంపెనీలు న్యాయమైన ధర రూ15వేలకు కొనకపోతే, ప్రభుత్వ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా రైతులు పండించిన బర్లీపొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకును కూడా కొనేవిధంగా చట్టం తేవాలని అనే అంశాలపై ధర్నా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాజమోహన్‌రావు వివరించారు. కావున నేడు జరగనున్న ఈ ధర్నా, నిరసన దీక్షలు రైతులందరూ పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా ఆయన కోరారు.

# పిజిఆర్ఎస్‌కు 8పిర్యాదులు

### -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

పొన్నూరు, మే 26,ప్రభాతవార్త: తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు ఎనిమిది



అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. అందులో రెవెన్యూకు సంబంధించి-2, సివిల్ సప్లయిస్‌కు సంబంధించి-3, సర్వేకి-1, ఇరిగేషన్‌కు-1, డ్రైనేజి సంబంధించి-1 అర్జీ అందినట్లు చెప్పారు. పరిష్కారం కోసం అర్జీలను ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీకి నిర్ణీత గడువులోపు పరిష్కారాన్ని చూపిస్తున్నామన్నారు. పిజిఆర్ఎస్ అంతా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ప్రజలు కూడా వారి సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్‌ను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సమస్యల పరిష్కారంలో పొన్నూరు ముందున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తుండడం వల్లే సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నట్లు తహశీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ హసన్ అహమ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి దేవాలయంలో ముగిసిన హనుమ జయంతి ఉత్సవాలు

మంగళగిరి, మే 26, ప్రభాతవార్త: మంగళగిరి మిద్దె సెంటర్ శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో మూడు రోజులపాటు జరిగిన హనుమ జయంతి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి అన్న



సమారాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సుమారు పదివేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్య అతిథులుగా ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ చిరంజీవి మాట్లాడారు. హనుమ జయంతి అనంతరం ట్రస్ట్ దాతలు సహకారంతో సుమారు 10 వేల మందికి అన్నదాన కార్యక్రమం చేయడం అభినందనీయ మన్నారు. హనుమంతుని ఆశీస్సులు రాష్ట్రంపై ఉండి, రైతాంగం పాడిపంటలతో అభివృద్ధి చెందాలన్నారు. అమరావతి త్వరితగతిన పూర్తయి రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగుపడాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ లకు హనుమంతుడు శక్తి సామర్థ్యాలు అందించాలని ఆయన అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ అన్న సమారాధన వంటి గొప్ప కార్యక్రమం చేపట్టిన శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి అన్న సమారాధన ట్రస్ట్ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా కమిటీ మరిన్ని ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, మాజీ డైరెక్టర్ పారేపల్లి రామకృష్ణ, రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, తెలుగు మహిళా నాయకురాలు మన్నెం అనిత, ట్రస్ట్ అధ్యక్షులు పారేపల్లి దుర్గాప్రసాద్, గౌరవాధ్యక్షులు పణిదపు శ్రీనివాసరావు, ట్రస్ట్ ప్రతినిధులు రాజశేఖర్, శివరాం ప్రసాద్, రమేష్, భాను ప్రసాద్, సాయిబాబా, దినేష్, వెంకటేశ్వరరావు, నందం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని వెంటనే అరెస్టు చేయ్యాలి

చిలకలూరిపేట,మే26,ప్రభాతవార్త: మున్సిపల్ కార్యాలయంలో రూ35లక్షల అవినీతి చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఇక్కుర్తి గంగాభవానిని వెంటనే అరెస్ట్ చేయమని సస్పెండ్ అయిన మున్సిపల్ ఉద్యోగులు సోమవారం పట్టణ సిఐ రమేష్‌ను కలసి వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతికి మాకు ఎటువంటి సంబంధం లేదని, గంగాభవానిని అరెస్ట్‌చేస్తే నిజానిజాలు బయటకు వస్తాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.



## దేవాలయ అభివృద్ధికి దాతలు,భక్తులు ముందుకు రావాలి

### -కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్

పొన్నూరు, మే 26,ప్రభాతవార్త: శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవాలయం అభివృద్ధికి దాతలు-భక్తులు ముందుకు వచ్చి సహకరించాలని దేవాలయం కార్య నిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ కోరారు. ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగిన హనుమజ్జయంతి ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరీ ముఖ్యంగా దాతలు ముందుకు వచ్చి భక్తులకు అన్న ప్రసాద వితరణ, పులిహోర, చక్కెర పొంగలి, మంచినీరు, మజ్జిగ తదితరాలను పంపిణీ చేసిన దాతలను, కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను అభినందించారు. అదేవిధంగా కళ్యాణోత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు భక్తులు, దాతలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఆధ్యాత్మికతకు నిలయాలైన దేవాలయాలలో ప్రశాంత వాతావరణం ఉట్టిపడేవిధంగా భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దాతలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.



## స్వరనీరాజనం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : కొత్తమాసు శ్రీరామమూర్తి

మాచర్ల, మే 26 ప్రభాతవార్త: గాన గంధర్వుడు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



కళాపరిషత్ మాచర్ల వారి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో జూన్ 1న సాయంత్రం 7 గంటలకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారన్నారు. జూన్ 1న జరిగే పాటల పోటీల్లో పాల్గొనదలచిన వారు జూన్ 1న ఉదయం 9 గంటలకు మానుకొండ కల్యాణ మండపంలో జరిగే ఎంపికకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. 25 మందిని మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. సాయంత్రం 7 గంటలకు జరిగే పోటీల్లో ప్రతిభ చూపిన అయిదుగురిని ఎంపిక చేసి బహుమతులు ఇస్తామన్నారు. మొదటి బహుమతి 10000, రెండో బహుమతి 7000, మూడో బహుమతి 5000, నాలుగో బహుమతి 4000, అయిదో బహుమతిగా 3000 నగదు బహుమతులను అందజేస్తామన్నారు. మరో 20 మందికి రూ.1000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. కళాభిమానులు, ఎస్పీ బాలు అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కళాపరిషత్ ఉపాధ్యక్షులు బాహటం శేషగిరిరాజు, ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పటాన్ జాన్‌ఖాన్, జాయింట్ సెక్రటరీ పులుసు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు పలువవురు కళాభిమానులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి స్పెషల్ సమ్మర్ క్యాంప్-2025

పొన్నూరు, మే 26,ప్రభాతవార్త: పట్టణంలోని లయన్స్‌పాలీ సర్వీస్ సెంటర్, వెల్ఫేర్ సెంటర్, స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ తరంలో మేము ప్రత్యేకం అనే శీర్షికన స్పెషల్ సమ్మర్ క్యాంప్-2025 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్‌పాలీ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు మాత్రమేనని వారు తెలిపారు. విద్యార్థులకు ఉత్సాహాన్ని కలిగించడానికి డాన్స్ క్లాస్ నిర్వహణ, హానికరమైన జంక్‌ఫుడ్‌ని మాన్పించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కలిగించే హెల్త్‌ట్రైనింగ్, సెల్‌ఫోన్ వీడియో గేమ్స్ మాన్పించి చదువు పట్ల శ్రద్ధ కలిగేలా ఎడ్యుకేషనల్ కౌన్సిలింగ్, లైఫ్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ. వేసవి సెలవుల విరామం ద్వారా విద్యార్థుల్లో ఉన్న బద్ధకాన్ని నిర్లక్ష్యాన్ని నిర్మూలించి మరలా చదువులకు సిద్ధం అయ్యేలా కౌన్సిలింగ్ ఇవ్వడం, ఈ క్యాంపు అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్, మెమొంటో,అతి విలువైన మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపులో పాల్గొనేవారు నామ మాత్రపు ఫీజు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు సెల్:9393097378 సంప్రదించాలన్నారు.

## పల్లెల్లో సమస్య పరిష్కారం కోసం నూతన కార్యక్రమానికి శ్రీకారం

తాడేపల్లి,మే 26,ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడేపల్లి మండలంలోని పెనుమాక గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం. ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరు నార్త్ సబ్ డివిజన్ డిఎస్పీ మురళీకృష్ణ,తాడేపల్లి సిఐ కళ్యాణ రాజు,ఎస్ఐ ఖాజావలి స్థానికులు.ప్రధానంగా పల్లెటూరిలోని సమస్యలను నేరుగా ప్రజల మధ్య నుంచే తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.గ్రామంలో ఓపెన్ డ్రింకింగ్,అతివేగంగా వాహనాలు నడుపుతున్నారని అలానే సాయంత్రం సమయంలో స్కూల్ వదిలే సమయానికి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తెలిపారు.ఓపెన్ డ్రింకింగ్,స్కూల్స్ వద్ద అతివేగంతో వాహనాలు నడిపే వారి వివరాలతోపాటు గ్రామ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలను తమకు అందజేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని,సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని డిఎస్పీ మురళీకృష్ణ,సిఐ కళ్యాణ్‌రాజులు తెలియజేశారు.ప్రజలతో పోలీసు మమేకమై శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ అవగాహన సదస్సులో పెనుమాక గ్రామ ప్రజలు,తాడేపల్లి పోలీసులు పాల్గొన్నారు.



## హత్యా రాజకీయాలకు స్వస్తి పలకాలి : యాగంటి మల్లికార్జునరావు

మాచర్ల, మే 26 ప్రభాతవార్త: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో ఇకనైనా హత్యా రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు అందరూ సహకరించాలని



మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. గుండ్లపాడులో జరిగిన జంట హత్యలు బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్య చేసిన వారితోపాటు హత్య కాబడిన కుటుంబాల పరిస్థితి ఏమిటన్న విషయం ఒక్క క్షణం ఆలోచిస్తే జరిగిన నష్టం అర్థమవుతుందన్నారు. ఆవేశంలో చేస్తున్న హత్యలు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయన్నారు. ఇకనైనా తెలుసుకొని ఆధిపత్యం కోసం, నాయకుల మెప్పు కోసం ఒకరినొకరు హత్యలు చేసుకుంటూ పోతే నష్టపోయేది మీ కుటుంబాలే. ఎలాంటి సమస్యలు ఉన్నా కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని హితవు పలికారు. వెనుకబడిన మాచర్ల ప్రాంతాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో రక్తపాతం వల్ల ప్రజల్లో భయాందోళనలు నెలకొని అభివృద్ధి పనులు జరగవన్నారు. విద్యాపరంగా గణనీయమైన మార్పులు వచ్చి పిల్లలు మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్న విషయం పెద్దలు గుర్తించాలన్నారు. పిల్లలు ప్రయోజకులైతే ఆ కుటుంబాలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయి. ఒకరినొకరు చంపుకుంటూ పోతే కుటుంబాల్లో మహిళలు, పిల్లలు అనాథలుగా మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న చిన్న గొడవలను పెద్దవిగా చేసుకుంటూ వాటిని హత్యల వరకు తీసుకెళ్లడం మంచి పద్ధతి కాదన్నారు. పల్నాడు అభివృద్ధి వైపు అడుగులు వేసేలా ఉండాలేకానీ హత్యా రాజకీయాలు ఉండకూడదని కోరారు. ఫ్యాక్షనిజంలో నా తండ్రిని కోల్పోయి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని యాగంటి తన బాధను వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో రాజీ పడేందుకు అవకాశం లేకపోతే పైస్థాయిలో పెద్దలు చాలా మంది ఉంటారు వారిని సంప్రదించాలన్నారు. ఫ్యాక్షనిజం జోలికి వెళ్లి హత్యా రాజకీయాలు చేసుకుంటే పోలీసు స్టేషన్లో, కోర్టుల చుట్టూ తిరిగి సమయంతోపాటు ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుంది. అందరూ కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని పలికిన గాంధీ మహాత్ముని నినాదాన్ని ఆదర్శంగా తీసుకొని పల్లెల్లో ప్రశాంతత నెలకొనేలా కృషి చేయాలన్నారు. పదవులు, రాజకీయాలు శాశ్వతం కాదు, స్నేహాలు, బంధుత్వాలే శాశ్వతం అని యాగంటి మల్లికార్జునరావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.


# పిడుగురాళ్లలో ఇనిస్టిట్యూట్ పేరిట ఘరానా మోసం

### జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును ఆశ్రయించిన బాధిత విద్యార్థులు

పిడుగురాళ్ల, మే 26 ప్రభాతవార్త: పిడుగురాళ్లలోని లలిత టూరిజం అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఉద్యోగాల పేరుతో తమన మోసం చేశారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఎస్పీ శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. 2022 నుంచి 2024 మధ్య కాలంలో యూరప్ దేశానికి పంపిస్తామని ఇనిస్టిట్యూట్ ఉద్యోగాల పేరుతో మోసం చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ. 40 లక్షల దాకా నగదు వసూలు చేశారని బాధిత విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగం వచ్చిందని కొందరు విద్యార్థులను ఊటికీ దొంగ ట్రిప్పు పంపారని విద్యార్థులు చెబుతున్నారు. ఇనిస్టిట్యూట్ యజమాని పసుమర్తి కిషోర్, అతని బంధువులు, మేనేజర్ సునీతలు తమ వద్ద నుంచి సుమారు రూ. 5 కోట్లకు పైగా వసూలు చేశారని బాధిత విద్యార్థులు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీ శ్రీనివాసరావును వేడుకున్నారు.

## నల్ల బర్లి పొగాకును ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలి : పాశం రామారావు

పెదనందిపాడు మే 26. (ప్రభాతవార్త): నల్ల బర్లి పొగాకు ను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో పార్టీ సీనియర్ సభ్యులు జంపని రామారావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది ఈ సమావేశంలో రామారావు పాల్గొని మాట్లాడుతూ మండలంలో పేద వర్గాల వారు నల్ల బర్లి పొగాకు ను అధిక సంఖ్యలో రైతులు పండించారని.గత మూడు సంవత్సరాలు గా అధిక దిగుబడి, మంచి ధర పలికినందున ఎక్కువ మంది రైతులు గత అప్పుల బారి నుండి బయట పడేందుకు పొగాకు వైపు మళ్ళారని అన్నారు. గత సంవత్సరం 18 వేల రూపాయల వరకు కొన్న పొగాకు ప్రస్తుతం 4000 రూపాయలకు కూడా కొనే నాథుడు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ముఖ్యమంత్రితో సహా పలువురు మంత్రులు పొగాకును వెంటనే కొనుగోలు చేస్తామని ప్రకటన చేస్తున్నారు కానీ కొనుగోళ్ళు జరగటం లేదని , ప్రకటనలకే పరిమితమైందని తెలిపారు.వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల నుండి పొగాకు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా గుంటూరు చానల్ కు నిధులు కేటాయించి మొదటి ప్రాధాన్యత గా పొడిగింపు పనులు పూర్తి చేస్తామని నాయకులు హామీ ఇస్తున్నారని అన్నారు.ఎన్నికలకు ముందు పాదయాత్రలలో గత, ప్రస్తుత ముఖ్యమంత్రులు హామీలు ఇచ్చారని, అది ఆచరణలో అమలు కాలేదని దుయ్యబట్టారు. స్థానిక ఎమ్.ఎల్.ఏ. ఎం.పి. పెదనందిపాడు, ప్రత్తిపాడు వచ్చిన ప్రతి సారి గుంటూరు చానల్ పనులు ప్రారంభిస్తామని చెబురున్నారు కానీ ఎక్కడా పనులు ప్రారంభం కాలేదన్నారు. నిధులు కేటాయించిన దాఖలాలు లేవని అన్నారు. గుంటూరు చానల్ పొడిగింపుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తే నాలుగు మండలాలలోని సుమారు 50 గ్రామాలకు త్రాగునీరు 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు త్రాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఇటీవల నాగులపాడు వచ్చిన సందర్భంగా స్తానిక ఎం.పి. కి ఈప్రాంత ప్రజలు త్రాగునీటి కష్టాల గురించి విన్నవించుకున్నారని తెలిపారు. .ఎన్నో ఏండ్లుగా రైతులు ఎదురు చూస్తున్న గుంటూరు చానల్ పొడిగింపు పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. నల్లమడ ఆధునీకరణ కొరకు, గుంటూరు చానల్ పొడిగింపు కొరకు అన్ని ప్రజా సంఘాలు దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నా పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు.ఎనిమిది మండలాలలోని వేలాది ఎకరాలు ముంపుకు గురౌతున్నాయని అన్నారు.పిచ్చి చెట్లు, అడవి తుమ్మ చెట్లు అడవిలాగా పెరిగి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయని అన్నారు.వెంటనే నల్లమడ ఆధునీకరణ కొరకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, రైతుల్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.అన్నదాత సుఖీభవ అమలు జరిపి కౌలు రైతులకు కూడా వర్తింప జేయాలని కోరారు.మహిళలకు నెలకు 1500 రూపాయలు బ్యాంకు ఖాతాలో వేస్తామన్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారని , నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, వాటిని అమలు జరపడం లేదని వెంటనే వాటి అమలుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు 300 రూపాయలు వేతనం అమలు చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రతి కుటుంబానికి 300 పని దినాలు కల్పించాలని కోరారు. ఉచిత ఇసుక హామీని అమలు జరిపి



భవన నిర్మాణ కార్మికులకు పని దొరికేలా చూడాలని అన్నారు.ప్రస్తుతం ఇసుక కొరత కారణంగా పనులు లేక పస్తులుంటున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గత 5 నెలలుగా బకాయి ఉన్న మెనూ బిల్లులు, జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. 42 రోజుల సమ్మె విరమణ సందర్భంగా అంగన్ వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, కాపు వెంకట సుబ్బారావు, మర్రి లక్ష్మి, నల్లమోతు రాజేంద్ర, ఫణిదపు భువనేశ్వరి, అన్నలదాసు ఆశీర్వాదం పాల్గొన్నారు.

## మహానాడు వేదికగా టీడీపీ సరికొత్త పంథాకు శ్రీకారం : తెదేపా నేతలు

పిడుగురాళ్ల, మే 26 ప్రభాతవార్త: కడప మహానాడు వేదికగా టీడీపీ సరికొత్త పంథాకు శ్రీకారం చుట్టబోతోందని టీడీపీ నేతలు అన్నారు.



సోమవారం పిడుగురాళ్ల పట్టణం నుంచి వివిధ వాహనాల్లో అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కడప మహానాడుకు ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ ముఖ్య నేతలు జెండా ఊపి ప్రారంభించారు. నేతలు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులకు అధికార పార్టీ నిర్ణయం తీసుకోబోతుందన్నారు. టీడీపీ అధ్యక్ష ఎన్నిక మొదలు సంస్థాగత నిర్ణయాలకు విధివిధానాల ఖరారుకు మహానాడు వేదిక కానుందన్నారు. టీడీపీనే మరో 40 యేళ్లు నడిపించడానికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుత ప్రజా అవసరాలకు అనుగుణంగా అనేక మార్పులు చేపట్టవచ్చన్నారు. భవిష్యత్తు నిర్ణయించే విధానాలను రూపొందించే తరుణంకు కడప మహానాడు వేదిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడ పాండురంగ శ్రీనివాసరావు, గండికోట వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డు చైర్మన్ తురకా వీరస్వామి, రాష్ట్ర వాణిజ్య విభాగ కన్వీనర్ కనిగిరి శ్రీనివాసరావు, సీనియర్ నేత డాక్టర్ ఉన్నం నాగమల్లీశ్వరరావు, వడ్డపల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యదన అమీర్ అలీ, వడ్డపల్లి సాంబశివరావు, మాజీ ఎంపీపీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


## జూన్ 2న మాచర్ల మున్సిపల్ ఛైర్మన్, ఉపఛైర్మన్ ఎన్నిక

మాచర్ల, మే 26 ప్రభాతవార్త: మాచర్ల పురపాలక సంఘం కౌన్సిల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులకు జూన్ 2న ఎన్నిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిసైడింగ్ అధికారి, గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరుగుతుందన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే ఈ ఎన్నికకు కౌన్సిల్ సభ్యులందరూ హాజరు కావాలని కమిషనర్ పేర్కొన్నారు.

## క్రైస్తవుల స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలి

### -ఇన్‌చార్జీ జిల్లా కలెక్టర్‌ను కలసిన క్రైస్తవ ప్రజా సంఘాలు,దళిత సంఘాల నేతలు

గుంటూరు విద్య,మే 26,ప్రభాతవార్త : నగరంలో 4క్రైస్తవ సమాధి తోటలకు స్థలాల విషయమై ప్రభుత్వం నివేదిక కోరిన లేఖను ఇన్‌చార్జీ జిల్లా కలెక్టర్ ఏ.భార్గవ తేజకు క్రైస్తవ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో అందజేశారు.గత 5ఏళ్ళుగా,గుంటూరు నగరంలో అన్ని చర్చీలకు సంబంధించిన అన్ని క్రైస్తవ సమాధుల్లో, సమాధులు నిండిపోయి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న వైనాన్ని,అన్ని క్రైస్తవ సంస్థలు ఈనెల 6వ తేదిన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (మైనార్టీ సంక్షేమ శాఖ) ను కలసి వినతిపత్రం సమరి ్పంచడం జరిగింది.దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం మే 21వ తేదిన జిల్లా కలెక్టర్‌కు మెమోను జారీ చేసి తక్షణమే నివేదికను పంపాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు.ప్రభుత్వ ఆదేశాలను డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందరబాబు, మద్దు ప్రేమజ్యోతిబాబు, ఎస్.శరత్‌బాబు,బడుగు రత్నకుమార్,పాస్టర్ చింతాబత్తిని సుబ్బారావు,ఆగనాటి ఆంథోని,ఏఐసివైఏ నాయకులు గడ్డం సురేష్ గ్రీవెన్స్‌లో ఇన్‌చార్జీ కలెక్టర్‌కు సమర్పించారు.ఆయా వివరాలను సవివరంగా వివరించారు.అయితే 8వ తేదిన జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన లేఖ మేరకు,జిల్లా కలెక్టర్ మే 24న గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు రాసిన లేఖను గుంటూరు మున్సిపల్ కమీషనర్‌ను కలసి త్వరితంగా సర్వే జరిపి నివేదికను ప్రభుత్వానికి పంపే ఏర్పాటు చేయాలని కోరారు.లూథరన్ చర్చి ఆఫ్ ఆర్‌సిఎం చర్చి నుంచి వచ్చిన,దళిత క్రైస్తవులు అనేకమంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తెలుగు మహా వేడుకకు భారీగా తరలిరావాలి

### - టిడిపి మండల మైనార్టీ అధ్యక్షుడు ఆదాం పిలుపు

ఎ కొండూరు, మే 26, ప్రభాతవార్త : తెలుగుదేశం మహావేడుక కడప గడ్డపై తొలిసారిగా 27,28,29 తేదీల్లో టిడిపి జాతీయ అధ్యక్షుడు సిఎం నిర్వహిస్తున్న పసుపు పండుగకు అన్న ఎన్‌టిఆర్ స్ఫూర్తితో లక్షలాదిగా తరలివచ్చి జయ ప్రదం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కె ఆదాం షరీఫ్ సోమవారం మీడియా సమావేశంలో పార్టీ శ్రేణులు, నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నెల 27,28,29 తేదీల్లో నిర్వహించే ఈ మహావేడుకల్లో వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సౌకర్యాలతో పాటు భోజన వసతి సౌకర్యాలు లోటుపాట్లు లేకుండా పార్టీ హై కమాండ్ సూచనల మేరకు టిడిపి నాయకులు పర్యవేక్షించి జయప్రదం చేయడానికి అన్నివిధాలా సేవాభావంతో పనిచేస్తారని ప్రతి ఒక్కరు ఈ మహావేడుకల్లో పాల్గొని సిఎం చంద్రబాబు స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్ళి తెలుగు జాతీ కీర్తి ప్రతిష్ఠను భారతదేశం నలుమూలల విస్తరింప చేయాలని ఆదాం షరీఫ్ కోరారు.

## మహానాడుకు పదివేల మంది హాజరుకు ఏర్పాట్లు : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, మే26 ప్రభాతవార్త :** కడపలో మూడు రోజుల పాటు నిర్వహించే మహానాడుకు నియోజకవర్గం నుండి పదివేల మంది హాజరవుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు.



సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్యతో కలిసి మహానాడు ఏర్పాట్ల వివరాలు తెలిపారు. ఈ నెల 27,28,29 తేదిలలో కడపలో జరిగే పార్టీ కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. యువనేత నారా లోకేష్ సారధ్యంలో ఎన్నడు లేని విధంగా లక్షాలది మందికి అవసరమైన అన్ని వసతులు కల్పించటం జరుగుతుందన్నారు. నరసరావుపేట నుండి హాజరై వారి కోసం ప్రత్యేకంగా బస్సులు, ప్రైవేట్ వాహనాలు సిద్ధం చేస్తున్నామన్నారు. కడపలో ప్రత్యేకంగా నియోజకవర్గంకు సంబంధించి వసతి ఏర్పాటు చేసారని పేర్కొన్నారు. అధికారం ఉన్న లేక పోయిన మహానాడు పార్టీ శ్రేణులకు పండుగ వంటిదన్నారు. ప్రజలకు ఎమి చేస్తే మేలు జరుగుతుందో వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించటం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రత్యేకంగా వైద్య సేవల ఏర్పాటుకు కన్వీనర్‌గా తన సేవలు అందించటం జరుగుతుందని, మహానాడుకు హాజరై వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వివరించారు.

## నియోజకవర్గంలో పలు కుంటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నరసరావుపేట, మే26 ప్రభాతవార్త : నియోజకవర్గంలో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పరామర్శించారు. రొంపిచర్లలో మేడికొండ చిన్నమ్మ వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి చిత్ర పటానికి పూల మాలలు వేసినివాళి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల పార్టీ నాయకులు కురగంటి శ్రీనివాసరెడ్డి, పడాల చక్రారెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పచ్చువ రవీంద్ర, సుబ్బారెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంట ఉన్నారు.



## స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

**బాపట్ల,మే26,ప్రభాతవార్త:** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకము అమలులో స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి బ్యాంకర్లకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బ్యాంకులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన లక్ష్యాలను పూర్తి చేయుటకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. దిగువ మరియు మధ్య తరగతి నివాస వినియోగదారుల ప్రయోజనం కోసం ఈ పథకమును 13 ఫిబ్రవరి 2024 న భారత ప్రధాని ప్రవేశ పెట్టారని ఆయన తెలిపారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 75 వేల 021 కోట్ల రూపాయలు నిధులు కేటాయించారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలో వాట్స్ చొప్పున ఉచితంగా సోలార్ సిస్టం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీరి ఇంటిపై సోలార్ సిస్టం ఏర్పాటుకు సంబంధించి స్థలం ఇచ్చినందుకు వారికి గవర్నమెంట్ కొంత మొత్తం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్ర మొత్తం అమలు చేయుటకు



ముఖ్యమంత్రి లక్ష్యాలను నిర్దేశించారని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని నిర్దేశించారన్నారు. బాపట్ల జిల్లాకు 60 వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయుటకు నిర్దేశించారని ఆయన తెలిపారు. వీటిని 2027 సంవత్సరం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో డిసెంబర్ నాటికి 47 వేల కనెక్షన్లు ఏర్పాటుకు లక్ష్యాలను నిర్దేశించడమైనదని తెలిపారు. జిల్లాలో ఈ లక్ష్యాలను చేరుకోవడానికి స్వయం సహాయక గ్రూపు సభ్యుల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడమైనదని ఆయన అన్నారు. ప్రతి ఇంటికి 3 కిలో వాట్ సోలార్ ప్లేట్లు అమర్చుటకు నిర్ణయించడమైనదని ఆయన తెలిపారు. ఈ సోలార్ ప్లేట్ల అమర్చుటకు మొత్తం 2 లక్షల పదివేలు ఖర్చు అవుతుందని, అందులో 78 వేల రూపాయలు సబ్సిడీ కింద వస్తుందని, ఇందుకు లబ్ధిదారులు 20 వేలు చెల్లించాలని ఆయన తెలిపారు. ఇవి పోను బ్యాంకర్లు లోన్ కింద లక్ష 2 వేలు రుణం మంజూరు చేయాలన్నారు. ఈ పథకం కు సంబంధించి ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ మొదలు పెట్టడం జరిగిందన్నారు. దరఖాస్తు దారులు చెల్లించవలసిన 20 వేల రూపాయలను చెల్లించుటకు చర్యలు తీసుకోవడమైనదని ఆయన తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు వచ్చిన తరువాత వాటిని తిరస్కరించకుండా లోన్లు మంజూరు చేయాలని ఆయన బ్యాంకర్స్ కు సూచించారు. స్వయం సహాయక గ్రూపుల నుండి లోన్ రికవరీ మొత్తం చెల్లించే బాధ్యత తమదేనని ఆయన బ్యాంకులకు భరోసా ఇచ్చారు. లోన్ మంజూరు విషయంలో బ్యాంకు సిబ్బందికి సూచనలు చేయాలని ఆయన బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్. ఈ ఆంజనేయులు, ఎల్ డి యం శివకృష్ణ, బ్యాంకు మేనేజర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వసుపత్రిలో మత్తు వ్యసన విముక్తి కేంద్రం

నరసరావుపేట, మే26 ప్రభాతవార్త : పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మత్తు వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటు చేసేందుకు సోమవారంఅధికారులు అవకాశాలను పరిశీలించారు. జిల్లా ఆసుపత్రుల సమాన్వయ అధికారి డాక్టర్ ఎం ప్రసూన, ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మన్‌డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో కేంద్రానికి అనుకూలమైన స్థలాన్ని గుర్తించేందుకు రావటం జరిగిందన్నారు. అన్ని ప్రమాణాలు , మార్గదర్శకాలకు అనుగుణంగా రెండవ ఆంతస్తులో కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. మత్తు వ్యసనంతో బాధపడుతున్న వ్యక్తులకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు డిడిఏసి త్వరలో స్థాపించటం జరుగుతుందన్నారు. ముఖ్యంగా నరసరావుపేట పరిసర ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఈ కేంద్రం ఏర్పాటు ఎంతో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎన్ సురేష్ కుమార్ , వైద్యులు పాల్గొన్నారు.



## పలు ప్రాంతాలలో పర్యటించిన కమిషనరు

**గుంటూరు కార్పొరేషన్,మే26,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగ కార్మికులు సూపర్వైజర్లు లేదా ఇతర విధుల్లో ఉండడానికి వీలులేదని, వారు కేటాయించ బడిన పారిశుధ్య పనుల్లోనే ఉండాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం జిటి రోడ్, కెవిపి కాలనీ రోడ్ ల్లోని పలు ప్రాంతాలల్లో పర్యటించి, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులుగా ఉన్న వారు పారిశుధ్య పనులు కాకుండా సూపర్వైజర్లు పేరుతో ఉంటున్నారని, వారిని తక్షణం పారిశుధ్య విధులు కేటాయించాలని ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. ఇక నుండి తమ క్షేత్ర స్థాయి పర్యటనలలో సూపర్వైజర్లను గుర్తిస్తే సంబందిత ఇన్స్పెక్టర్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్య కార్మికులు పారిశుధ్య విధులు మాత్రమే నిర్వహించాలని, శానిటేషన్ కార్యదర్శులు తమ పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రజల ఇళ్ళ దగ్గర నుండి నూరు శాతం వ్యర్థాలు సేకరిస్తే రోడ్ల మీద చెత్త పడదని, అందుకు తగిన విధంగా అన్ని విధాల సపోర్ట్ చేస్తున్నా క్షేత్ర స్థాయి సిబ్బంది అలసత్వం వలన మెరుగైన పారిశుధ్య పనులు జరగడం లేదన్నారు. కెవిపి కాలనీ మెయిన్ రోడ్ గోతులతో నిండి ఉందని, రోడ్ నిర్మాణంకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని డిఈఈని ఆదేశించారు.కార్యక్రమంలో సిఎంఒహెచ్ డాక్టర్ అమృతం, డిఈఈ మధుసూదన్, బయాలజిస్ట్ రామారావు, ఎస్ఎస్ రాజేష్, సచివాలయ ఏఈ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజేశ్వరి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఆపరేషన్ కగార్ వెంటనే ఆపివేయాలి

**బాపట్ల,మే26,ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీల పైన కేంద్ర ప్రభుత్వం సాగించిన సాగిస్తున్న దమనకాండని వెంటనే ఆపివేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. సోమవారం జమ్ములపాలెం ఫ్లైఓవర్ వద్దగల అంబెద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరిపించి ఆదివాసీలు, రాజ్యాంగబద్ధమైన న్యాయబద్ధమైన హక్కులను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కే విజయ్ కుమార్, సిపిఎం పార్టీ బాపట్ల టౌన్ కమిటీ నాయకులు శరత్ ,జై భీమ్రావు పార్టీ బాపట్ల అసెంబ్లీ ఇన్చార్జి కొచ్చెర వినయ్ రాజు ,బహుజన సమాజ్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు గుదే రాజారావు, సిపిఎం పార్టీ జిల్లా నాయకులు పి కొండయ్య , ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి మువ్వల పల్లవి ,కేశవులు ,ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎం రాఘవులు తదితరులు పాల్గొన్నారు.




## మహానాడు కార్యాక్రమాన్ని జయప్రదం చేయాలి

**పిట్టలవానిపాలెం,మే26,ప్రభాతవార్త:** తెలుగు ప్రజల కోసం తెలుగు రాష్ట్రాల ప్రగతి కోసం దశాబ్దాలుగా కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీ మహా పండుగ మహానాడు పిలుస్తోంది రా కదలిరా కార్యక్రమం అని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి అన్నారు.సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవం పెంచే పసుపు పండుగ తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాయలసీమ కడప గడ్డపై ఏర్పాటు చేయబడిన మహానాడును జయప్రదం చేయాలని కోరారు. స్వర్గీయ ఎన్టీఆర్ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే గొప్ప మనస్సుతో తెలుగుదేశం పార్టీని స్థాపించి స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని చేసే అతి పెద్ద పండగ మహానాడు అని అన్నారు.స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సారధ్యంలో బాపట్ల నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, మహిళలు వేలాదిగా క్రమశిక్షణతో పాల్గొని మహానాడు ను జయప్రదం చేయవలసిందిగా కోరారు.మహానాడుకు వెళ్లే ప్రతి ఒక్కరూ విధిగా సభ్యత్వ కార్డును ధరించవలెనని తెలిపారు.



## జూన్2న తిరువూరు మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

### - నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్రఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని

**ఎ కొండూరు, మే 26, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక జూన్ 2న నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉప ఎన్నికకు సంబంధించి వైసిపికి నగర పంచాయతీలో మెజార్టీ సభ్యుల బలం ఉన్నా అధికార టిడిపి ఎమ్మెల్యే దాష్టీకంతో వైసిపి కౌన్సిలర్‌లను హాల్లోకి వెళ్లి ఓటింగ్‌లో పాల్గొనకుండా చేసిన తీరును పట్టణ ప్రజలు గర్హించారు. రెండుసార్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక జరక్కుండా అడ్డుకోవడంతో ఇటీవల 2వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మిని తాత్కాలిక చైర్‌పర్సన్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ నీలం సాహ్ని జూన్ 2న ఉప ఎన్నిక నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఈ సారైనా ప్రశాంత వాతావరణంలో ఎన్నిక నిర్వహించటానికి ఎన్నికల సంఘం పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఘట్టాన్ని పూర్తి చేయాలని పట్టణ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




## మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

**బాపట్ల,మే26,ప్రభాతవార్త:** మహిళలు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. 2023 సంవత్సరం నవంబర్ లో బాపట్ల జిల్లా వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 9వ తరగతి



చదువుతున్న బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10,000/ జరిమానా విధిస్తూ ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లా వేటపాలెం మండలం మరియు గ్రామంలో తన తల్లితండ్రులతో పాటు నివాసం వుంటూ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9 వతరగతి చదువుకుంటున్న 13 సంవత్సరాల మైనర్ బాలికను వారి ఇంటి సమీపంలో వుండే ముద్దాయి తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు తండ్రి కోటయ్య, వయస్సు 65 సం.లు మాయ మాటలతో లోబరుచుకొని అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. ముద్దాయి నిర్వహిస్తున్న సిమెంట్ రాళ్ళ తయారీ ప్రదేశంలో ఆడుకోవడానికి వెళ్ళే మైనర్ బాలిక పై పలుమార్లు అత్యాచారంకు పాల్పడ్డాడని తెలిపారు.ఎవరికైనా చెపితే చంపేస్తాను అని బెదిరించడంతో జరుగుతున్న దారుణం గురించి ఎవ్వరికీ చెప్పలేదన్నారు.బాలిక కడుపునొప్పితో బాధపడుతుండడంతో ఆమె తల్లి స్థానిక ప్రవేటు ఆసుపత్రిలో చూపించగా ఆమె గర్భవతి అని తెలిసిందన్నారు. జీజీహెచ్ గుంటూరు ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్య పరీక్షలు చేయించి గర్భవతి అని నిర్ధారించుకుని జరిగిన ఘటన గురించి తెలుసుకుని 2023 నవంబర్ 17 న తగు చర్య నిమిత్తం బాలిక తల్లి ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి వేటపాలెం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ జి.సురేష్ కేసు నమోదు చేశారన్నారు.కేసు విచారణ అధికారి అయిన అప్పటి చీరాల డిఎస్పీ ఎస్. ప్రసాద రావు నేర స్థలాన్ని సందర్శించి, ప్రత్యేక్ష సాక్షులను విచారించి భౌతిక సాక్ష్యాధారాలను సేకరించి ముద్దాయిలు నేరం చేసినట్లు తగిన సాక్షాదారాలతో నిరూపించి ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.తదుపరి నిపుణుల నివేదికను పొందుపరిచి సంబంధిత న్యాయ స్థానంలో 03.08.2024న చార్జ్ షీట్ ఫైల్ చేశారన్నారు. ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్ట్ లో కేసు విచారణకు రాగ, బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపిఎస్ ఆదేశాల మేరకు, చీరాల డిఎస్పీ ఎమ్.డి.మోయిన్ పర్యవేక్షణలో చీరాల రూరల్ సీఐ పి.శేషగిరిరావు, వేటపాలెం ఎస్.ఐ వెంకటేశ్వర్లు, కోర్ట్ లైజనింగ్ ఏఎస్ఐ స్వామి, కోర్టు కానిస్టేబుల్ కరిముల్లాలు సాక్షులు సరైన రీతిలో నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి సరైన సమయంలో కోర్టుకు హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్రీనివాసరావు కోర్టులో వాదోపవాదాలు వినిపించి నిందితులపై మోపబడిన నేరాన్ని తగిన సాక్షాదారాలతో నిరూపించారు. వాదోపవాదనలు విన్న ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ ముద్దాయికి 20 సంలు కఠిన కారాగార శిక్ష మరియు రూ.10,000/, జరిమానా విధిస్తు సోమవారం తీర్పు వెలువరించారు. మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వ తరపున 6 లక్షల నగదు పరిహారం చెల్లించే విధంగా ఆదేశాలు జారీచేశారు. ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి వెలువరించిన తీర్పు నిదర్శనమని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు వేగవంతంగా చేసి, ముద్దాయిని అరెస్ట్ చేసి, భౌతిక సాక్షాదారాలను కోర్టు వారికి సమర్పించి, ప్రత్యేక ఫోక్సో కోర్ట్ లో వేగవంతంగా ట్రయిల్ జరిగేవిధంగా పర్యవేక్షించుకుంటూ నేరం జరిగిన 18 నెలలోపే ముద్దాయికి కఠిన కారాగార శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను, కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది మరియు పీపీని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## కొల్లూరు రేషన్ డీలర్లతో వీఆర్వోలతో తహశీల్దార్ సమీక్ష

**కొల్లూరు, మే 26( ప్రభాతవార్త):** జూన్ 1 వ తేదీ నుండి రేషన్ షాపు నుండి నిత్యవసర సరుకులు పంపిణీ జరుగుతున్న సందర్భంగా సోమవారం కొల్లూరు మండల తహసిల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, గ్రామ రెవిన్యూ అధికారులతోనూ విధివిధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ చౌక దుకాణాలను తనిఖీ చేసి ఈ పి ఓ ఎస్ మిషన్లను ఎం డి యు ఆపరేటర్లు వద్ద నుండి రేషన్ డీలర్లకు అందే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ పంపిణీ జూన్ ఒకటవ తేదీ నుండి రేషన్ షాపుల నుండి నిత్యవసర సరుకులు పంపిణీ జరుగుతుందని రేషన్ షాపులో 1 వ తేదీ నుండి 15వ తేదీ వరకు పంపిణీ ఉంటుందని ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పంపిణీ జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో సి ఎస్ డి టి పణి కుమార్ డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, మండల పరిధిలోని డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



## సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలి : ఎంపీడీఓ విజయలక్ష్మీ

**కొల్లివర,మే 26 ప్రభాతవార్త:** సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు.సోమవారం మండల పరిధిలోని వల్లభాపురం,మున్నంగి,కొల్లివర తదితర సచివాలయాలను ఆమె తనిఖీ నిర్వహించి సిబ్బందికి తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలన్నారు.సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోనున న్నట్లు తెలియజేసారు.అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు.



## న్యాయవాది 'పడవల' సోదరునికి నివాళులర్పించిన 'రాధా'

**విజయవాడ,మే 26,ప్రభాతవార్త:** విజయవాడకు చెందిన ప్రముఖ న్యాయవాది పడవల ఏడుకొండలు స్వగృహానికి వెళ్ళిన వంగవీటి రాధాకృష్ణ ఏడుకొండలు సోదరుడు స్వర్గీయ పడవల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు అలమనేని వెంకటరావు, వల్లభనేని సుబ్బారావు,పొట్లూరి రవి,పోలవరపు వెంకట్రావు, చంటి,వాసు బాబ్జి,వల్లభనేని కృష్ణప్రసాద్, ఈదుపుగంటి ఉమామహేశ్వరరావు,కోసం కృష్ణమోహన్,కోసం హనుమప్రసాద్,రాము తదితరులు పాల్గొన్నారు.



## ఐక్యూ నియో 10 ఆవిష్కారం

**విజయవాడ, మే 26, ప్రభాతవార్త :** హైపెర్‌ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తన లేటెస్ట్ పవర్ హౌస్ ఐక్యూ నియో 10ను లాంచ్ చేసినట్లు సంస్థ ప్రతినిథులు తెలిపారు. యువ నిపుణుల నుండి భారీ పనితీరు వినియోగదారుల వరకు యువతకోసం రూపొందించామన్నారు. డ్యూయల్ చిప్ ఆర్కిటెక్చర్, మెరుగైన శీతలీకరణ వ్యవస్థతో భారత్‌లో మొదటిగా స్నాప్‌డ్రాగన్, 8ఎస్‌జెన్ చిప్సెట్తో, 7000 ఎంఏహెచ్ బ్యాటరీ స్లిమ్ డిజైన్‌తో లభిస్తుందన్నారు.

## అన్నదాత సుఖీభవ పథక అమలుపై అధికారులు చర్యలు తీసుకోవాలి

**బాపట్ల,మే25,ప్రభాతవార్త:** సి.సి.ఆర్.సి కార్డుల జారీ లక్ష్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు.సీసీఆర్‌సి కార్డుల జారీ, అన్నదాత సుఖీభవ పథక అమలుపై రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మీ సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సీసీ ఆర్సీ కార్డుల జారీ జూన్ మాసంలోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్డులను నిజమైన రైతులకు ఇవ్వకుండా ఇతరులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. సిసిఆర్సి కార్డులను రెన్యువల్ చేసి వారికి బ్యాంకు రుణాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ల్యాండ్ రికార్డులను ఆధార్ తో అనుసంధానం చేయాలన్నారు. ఆధార్ తో లింక్ కానీ భూములను తహసిల్దార్లచే వాటిని వెంటనే అనుసంధానం చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు.బాపట్ల జిల్లాలో గత సంవత్సరం లక్ష సిసిఆర్ సి కార్డులకు గాను 92 వేల కుటుంబాలకు కార్డులు జారీ చేయడమైనదని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. వీరిలో 11370 కుటుంబాలకు 55 కోట్లు రుణం ఇవ్వడమైనదని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మూడు లక్షల 41 వేల 974 మంది రైతులు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లాలో 80 ల్యాండ్ రికార్డులను ఆధార్తో అనుసంధానం చేయడమైనది అని తెలిపారు. మిగిలిన వాటిని పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో సిసిఆర్సి కార్డుల లక్ష్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.



## ఎండియూ రేషన్ వాహనాలు కొనసాగించాలి

**బాపట్ల,మే26,ప్రభాతవార్త:** ఎండియు రేషన్ వాహనాలను కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు.ఎం డి యు రేషన్ వాహనాలు కొనసాగించి వాహనదారులు అసిస్టెంట్లకు ఉపాధి కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం బాపట్లలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి కలెక్టరేట్ వరకు ఎండియు (మండల డిస్ట్రిబ్యూట్ యూనిట్స్) వాహనాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా పేద ప్రజలకు ప్రతినెల నిత్యవసర వస్తువులు అందిస్తున్నారని దాంట్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి సమాచారం లేకుండా జూన్ ఒకటో తేదీ నుండి వాహనాలను ఆపి వేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.వాహనాల ద్వారా 18520 కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఉపాధి దొరుకుతుంది అని ఇంటర్మీడియట్ డిగ్రీలు చదువుకున్న అనేకమంది యువకులు దీనిలో ఉపాధి లభించిందని ,నేడు రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో వీడి రద్దు చేయడం సరైన చర్య కాదని అన్నారు. 2027 జనవరి వరకు రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై డిపార్ట్మెంట్ ద్వారా ఒప్పందం చేసుకుందని, నేడు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించి వాహనాలను ఆపివేయటం సరైన చర్య కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న షాపుల్లో ఈ వాహనాల ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని చెప్తున్నారని ఈ అక్రమాలు ఆపటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుందని అన్నారు అక్రమాల అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వ విఫలమైందన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ విధానాన్ని కొనసాగించాలని, లోపాలు ఉంటే సరిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బాపట్ల పట్టణ నాయకులు కే శరత్ ఎండియు వాహనాల జిల్లా నాయకులు ధార దేవ సహాయం, గోపి, పేర్ని రమేష్ ,మేకల రాజేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు పెట్టి వేధించటమే కూటమి ప్రభుత్వం పాలనగా మారింది

### -మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట, మే26 ప్రభాతవార్త :** అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్ సిపి నాయకులను వేధించటమే కూటమి ప్రభుత్వం పాలనగా మారిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్దుర్తి మండలంలో జరిగిన హత్య కేసులో నిందితులు టిడిపికి చెందిన వారని స్వయంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రకటించారని గుర్తుచేసారు. తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు కారణంతో జరిగిన హత్యాలను వైకాపాకు అంటగట్టి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిరామకృష్ణారెడి తో పాటు ఏడాది కాలంగా కనీసం మాచర్ల నియోజక వర్గానికి రానటువంటి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పైన కేసులు పెట్టటం అన్యాయంగా ఉందన్నారు. అంతేగాక జంట హత్యాలకు సంబంధించిన గ్రామంలో గతంలో చనిపోయిన తోట చంద్రయ్య కేసుకు దీనికి ఎటువంటి సంబంధం లేదని ఎస్పీ ప్రకటించారని గుర్తు చేసారు. అప్పట్లో చంద్రయ్య పాడె మోసి ఇప్పటి సియం చంద్రబాబు నానా హంగామా చేసారన్నారు. పార్టీలో రెండు గ్రూప్‌ల మధ్య అధిపత్య పోరు హత్యాల వరకు వెళ్లిన పరిష్కరించుకోలేని టిడిపి నాయకత్వం వైకాపా వారిపై నిందలు వేస్తుందన్నారు. అంతేగాక నెల రోజుల క్రితం గ్రామంలో పల్లె నిద్రను ఎస్పీ నిర్వహించి ఘర్షణలు పడవద్దని చెప్పారని పేర్కొన్నారు. అత్యంత సమస్యాత్మక గ్రామంలో ఎందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టి హత్యాలను అపలేదన్నారు. కనీసం ఖాళీగా ఉన్న డిఎస్పి పోస్టును భర్తీ చేయలేదన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధించటం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హితువు పలికారు.



## హైస్కూల్ నూతన భవనాకికి మార్చండి

**తిరువూరు, మే 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గానుగపాడు తరగతులు ప్రస్తుతం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహించబడు తున్నాయని దాతలు ఇచ్చిన స్థలంలో నూతన భవన నిర్మాణం పూర్తయిందని, ప్రాథమిక పాఠశాల ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మారినందున, ఈ విద్యా సంవత్సరం నుండి హైస్కూల్ తరగతులను నూతన భవనంలో నిర్వహించడానికి పరిశీలించి తగిన అనుమతులు మంజూరు చేయాలని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, సభ్యులు కె.సత్యం, టి జమలయ్య, కె చిన వెంకటరత్నం, పాఠశాల ఉపాధ్యాయుడు ఎం రాంప్రదీప్ సోమవారం ఎంపిడివో సిహెచ్ రవిబాబు, మండల డిప్యూటీ తహశీల్దార్ వై.నాగమణిలకు వినతిపత్రం అందచేశారు.



## టివి అమ్మకాల్లో శాంసంగ్ కొత్త మైలురాయి

**విజయవాడ, మే 26, ప్రభాతవార్త :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన తాము తమ టెలివిజన్ అమ్మకాల్లో రు.10వేలకోట్ల అమ్మకాలను అధిగమించినట్లు శాంసంగ్ ప్రతినిథులు తెలిపారు. ప్రీమియం టివిల విస్తృత ఫోర్ట్‌ఫోలియో, పెద్ద స్క్రీన్, ఏఐ శక్తి టివిలకు పెరుగుతున్న డిమాండ్ ద్వారా 2025లో రెండంకెల వృద్ధిని సాధించగల నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# ‘థగ్ లైఫ్’ పైనే మా నమ్మకం

యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా, లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హైయాక్షన్ గ్యాంగ్‌స్టర్ డ్రామా థగ్ లైఫ్. ఈ భారీ చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్ నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. హీరో నితిన్ ఫాదర్ ఎన్ సుధాకర్ రెడ్డి శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నైలో భారీ ఆడియో లాంచ్ ఈవెంట్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక నాయకుడు కమల్ హాసన్ మాట్లాడుతూ ఈ జర్నీలో నాతో కలిసి ఎందరో ఉన్నారు. ఇప్పటికీ వారు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. గుండెల్లో ఎంతో కన్నీరుంది. సంతోషంతో వచ్చే కన్నీరుంది.. బాధతో నిండిన కన్నీరు కూడా ఉంది. ఎంతో మంది, ఎన్నో తరాలుగా నన్ను ఆదరిస్తున్నారు. వారికి ధన్యవాదాలు తప్ప మరేం చెప్పలేను. నేను సినిమాకు పెద్ద అభిమానిని. థగ్ లైఫ్ సినిమా గురించి మాట్లాడాలంటే ముందుగా ఎ.ఆర్.రెహమాన్ గురించి. ఇళయ రాజా తర్వాత తన సంగీతంలో నన్ను ముంచెత్తింది రెహమానే. వారిద్దరూ మన దక్షిణాది గర్వపడే గొప్ప కళాకారులు వారు. వారి వయసు మనం లెక్కపెట్టలేం. నన్ను, మణిరత్నంగారిని కలిపింది సినిమానే. ప్రేక్షకులు మమ్మల్ని చూసి వేసే విజిల్స్ మాకోసమే కాదు..సినిమా కోసం కూడా అని నాకు తెలుసు. నేను ఇక్కడున్నందుకు సంతోషపడుతున్నాను. సినిమాటోగ్రాఫర్ రవి కె.చంద్రన్‌గారు గొప్ప టెక్నీషియన్.హాలీవుడ్ రేంజ్‌కు వెళ్లాల్సిన టెక్నీషియన్. ఆయనతో పని చేయటాన్ని గర్వకారణంగా భావిస్తాం. అన్బరివు గొప్ప యాక్షన్ సన్నివేశాలను కంపోజ్ చేశారు. ఇక నటీనటుల విషయానికి వస్తే అందరూ భవిష్యత్తులో గొప్పవారు అవుతారు. శింబు తనెంత గొప్ప స్థాయిని చేరుకుంటాడో నాకు తెలుస్తుంది. ఈ సమూహాన్ని ముందుక నడిపే నాయకుడిగా శింబు ఎదుగుతాడు. ఆ బాధ్యత తనకుంది. త్రిష గురించి చెప్పాలంటే బాహ్య సౌందర్యమే కాదు.. మానసికంగా ఎంతో అందమైనవారు. మరోవైపు జీవాగా నటించిన అభిరామి.. గొప్పగా నటించారు. అశోక్ సెల్వన్‌ను చూస్తుంటే నాజర్‌ను చూస్తున్నట్లే అనిపించింది. నాజర్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సినిమాను చూసేటప్పుడు అందరూ ఎంతో సంతోషిస్తారు. కానీ తీసేటప్పుడు చాలాసమస్యలను దాటిచిత్రీకరించాల్సి ఉంటుంది. అలాంటి సమస్యలను నేను ఎన్నింటినో దాటి వచ్చాను. అందుకు కారణం.. అభిమానులే. వారికి నేను ఎలా ధన్యవాదాలు చెప్పలో కూడా తెలియటం లేదు. అలాంటి వారి కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. నేను ముఖ్యమంత్రి కావటానికో, ఎం.ఎల్.ఎ, ఎం.పి నోమకావటానికి రాజకీయాల్లోకి రాలేదు. ఓ ఎం.ఎల్.ఎ ఏం చేస్తాడో దాన్ని తమిళనాడుకి మెల్లగా చేస్తున్నాం. నాతో పాటు ఉన్నవారందరూ ఇప్పుడు సమాజంలో పెద్దవారిగా ముందుకు నడుస్తున్నారు. అది నాకెంతో గర్వంగా ఉంటుంది. రేపు శింబు కూడా తన వారిని అలాగే ముందుకు తీసుకెళ్లాలి.


కమల్ హాసన్

# 30న ‘షష్టిపూర్తి’ విడుదల

డా.రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన ప్రధాన పాత్రల్లో రూపేశ్ హీరోగా, నిర్మాతగా పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం షష్టిపూర్తి. ఈ మూవీలో ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రను పోషించారు. ఈ సినిమాను మే 30న విడుదల చేయబోతోన్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న క్రమంలో దర్శకుడు పవన్ ప్రభ షష్టిపూర్తి గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..నేను హోటల్ మేనేజ్మెంట్‌చేశాను. మా ఇంట్లో అంతా ట్రెడిషనల్ సింగర్స్ ఉంటారు. నాకు చిన్నతనం నుంచే సినిమాలపై మక్కువ ఏర్పడింది. సినిమాలతోనే మనం మంచిని చెప్పగలమని నమ్ముతాను. అలా నేను చివరకు ఇండస్ట్రీలోకి వచ్చాను. ఫిట్టింగ్ మాస్టర్ సినిమాకు డైరెక్షన్ టీంలో పనిచేశాను. ఆ సినిమాలో ఓ చోట, ఓ చిన్న సీన్‌లో కూడా నేను కనిపిస్తాను. సినిమా విషయంలో నాకు చాలా గ్యాప్ వచ్చింది. ఇన్నేళ్లలో సినిమా అంటే ఏంటో ఇంకా నేర్చుకున్నాను. నేను ఈ షష్టిపూర్తి గురించి చాలా చోట్ల తిరిగాను. ఇళయరాజా కావాల్సిందే అని ముందు నుంచీ ఫిక్స్ అయ్యాను. ఇళయరాజా ఎలా వస్తారు? అని చాలా మంది అంటుండే వారు. ఫ్యామిలీ డ్రామాకు ఎక్కువ క్యాస్టింగ్ కావాల్సి ఉంటుంది. ఇలాంటి చిత్రాలకు డేట్లు అడ్జస్ట్ అవ్వాలి.. షూటింగ్‌కి టైం పడుతుంది. కానీ నేను ఈ సినిమానే చేయాలని ఫిక్స్ అయ్యాను. అందుకే ఇన్నేళ్లు పట్టింది. మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం. నాకు అందరి ప్రేమ తెలుసు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త ఇలా అందరి మధ్య పెరిగాను. కానీ ఇప్పుడు కొందరికి అమ్మానాన్నలు కూడా బరువు అవుతున్నారు. నడి రోడ్డు మీద వారిని వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనాన్ని, ప్రేమ విలువను చెప్పాలనే ఉద్దేశంతోనే షష్టిపూర్తిని తీశాను. ఇప్పటి వరకు షష్టిపూర్తి గురించి చూసిన దాని కంటే మే 30వ తేదీని మీరు సర్ ప్రైజ్ అయ్యే అంశాలెన్నో సినిమాలో ఉంటాయి. షష్టిపూర్తి విషయంలో నేను ముందు నుంచీ చాలా క్లారిటీతో ఉన్నాను. రాజేంద్ర ప్రసాద్, అర్చనని నేను మళ్లీ రెండో టేక్ అని అడగాలంటే ఎంత ధైర్యం కావాలి. ఎందుకు అని వారు ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పేలా, క్లారిటీ ఇచ్చే స్థాయిలో నేను ప్రిపేర్ అవ్వాలి. అసలు వాళ్లు ఎలా చేయాలో చెప్పే స్థాయిలో నేను ఉండాలి. వాళ్లని యంగ్ లుక్‌లోకి తీసుకెళ్లి.. మళ్లీ ఓల్డ్ లుక్‌లోకి తీసుకు వచ్చాను. ఓ స్ట్రిక్ట్ మదర్ ఎలా ఉంటారో అలానే చూపించాను. ఓ జోవి యల్ ఫాదర్ ఎలా ఉండాలో అలా రాజేంద్ర ప్రసాద్‌ని చూపించాను. షష్టి పూర్తి ట్రైలర్‌ను అందరూ మెచ్చుకుంటారు. సినిమాలో ఏదో విషయం ఉందని అంతా అంటున్నారు. మరీ ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ గురించి మాట్లాడుతున్నారు.



# ‘కుబేర’ సెకండ్ గ్లింప్స్

ధనుష్ నాగార్జున హైలీ యాంటిసిపేటెడ్ యాక్షన్‌ప్యాక్డ్ డ్రామా కుబేర సెకండ్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రాన్స్ ఆఫ్ కుబేర్‌ పేరుతో ఉన్న ఈ వీడియో, ప్రేక్షకులను కుబేర డార్క్ అండ్ హిప్నోటిక్ వరల్డ్‌లోకి తీసుకెలుతోంది. సినిమాలోని కీలక పాత్రలను, వారు క్రియేట్ చేయబోయే తుఫానును అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ముగ్గురు నేషనల్ అవార్డ్ విన్నర్స్ ధనుష్, విజనరీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల, రాక్ స్టార్ శ్రీ ప్రసాద్ కలిసి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతున్నారు. ఈ సినిమా లార్జర్ దెన్ లైఫ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందని ట్రాన్స్ ఆఫ్ కుబేర ప్రామిస్ చేస్తోంది. ఈ ఎక్సయిటింగ్ టీజర్‌లో డీఎస్‌పీ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచింది. నాది నాది నాది నాదే ఈ లోకమంతా అనే హిప్నాటిక్ కోరస్ అదిరిపోయింది. నంద కిషోర్ రచించిన ఈ పాటను ధనుష్, హేమచంద్ర వేదాల కలిసి తన డైనమిక్ వోకల్స్‌తో అదరగొట్టారు. ఎస్.పి.అభిషేక్, శెణ్బగరాజ్, సాయి శరణ్, శ్రీధర్ రమేష్, భరత్ కె రాజేశ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్‌తో హార్మోనీలను యాడ్ చేశారు. ఈ పాట కుబేర వరల్డ్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.నాగార్జున పవర్ ఫుల్ అండ్ ఎమోషనల్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టారు. ఆయన పాత్ర బలమైనది, భావోద్వేగంతో కూడినది, విలువలతో నడుచుకునే వ్యక్తిలా కనిపించినా అంతర్గతంగా ఎన్నో ప్రశ్నలతో ఉన్నట్టుగా ఉంది. ఆయన పాత్రను మంచో చెడో అనలేని విధంగా రూపొందించటం సినిమా పట్ల ఎక్సయిట్మెంట్ మరింతగా పెంచుతుంది.



# సంక్రాంతి కానుకగా ‘అనగనగా ఒక రాజు’

తనదైన ప్రత్యేక కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న బ్లాక్ బస్టర్ మెషిన్ నవీన్ పొలిశెట్టి మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ అనగనగా ఒక రాజుతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చిత్ర బృందం విడుదల చేసిన మోషన్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రంతో నవీన్ పొలిశెట్టి థియేటర్లలో నవ్వుల పండుగను తీసుకురాబోతున్నాడని మోషన్ పోస్టర్ తోనే అర్థమైంది. తెలుగు సినీ అభిమానులు సంక్రాంతి పండుగను సినిమా పండుగలా భావిస్తుంటారు. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ ఉంటుంది. ఈ క్రమంలోనే పండుగకి సరైన సినిమాగా అనగనగా ఒక రాజు వచ్చే సంక్రాంతికి థియేటర్లలో అడుగుపెట్టనుంది. తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకుపోతున్న మీనాక్షిచౌదరి అనగనగా ఒక రాజులో నవీన్ పొలిశెట్టికి జోడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రేక్షకులను సరికొత్త వినోదాన్ని అందించేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. పండుగ రుచికి సరిగ్గా సరిపోయేలా ఆయన తనదైన మ్యూజిక్‌తో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థలు కొన్నేళ్లుగా వరుస ఘన విజయాలను సొంతం చేసుకుంటున్నాయి. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన డాకు మహారాజ్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 2026 సంక్రాంతికి అనగనగ ఒక రాజుతో మరో పండగ విజయాన్ని ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. తారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షిచౌదరి ఛాయాగ్రహణం: జె. యువరాజ్ సంగీతం: మిక్కీ జె. మేయర్.



# ఘనంగా భావయామి పుస్తక ఆవిష్కరణ!

సీతాయణం చిత్ర దర్శకుడు ప్రభాకర్ ఆరిపాక రచించిన కథల సంపుటి భావయామి పుస్తక ఆవిష్కరణోత్సవం హైదరాబాద్ ప్రసాద్ ఫిలిం ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. దర్శకుడు వైవిఎస్ చౌదరి, దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ నటులు అజయ్ ఘోష్, గుండు సుదర్శన్, గేయ రచయిత సురేంద్ర కృష్ణ, డియర్ కామ్రేడ్ దర్శకుడు భరత్ కమ్మ, ప్రముఖ కథా రచయిత మహమ్మద్ ఖదీర్ బాబు, సీనియర్ నిర్మాత వేమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆవిష్కరణ సభకు ప్రముఖ నటుడు, రచయిత డా. తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా




తనికెళ్ల భరణి మాట్లాడుతూ, ఒకప్పుడు రచయితలు తమ పుస్తకం తామే రాసుకుని వాళ్లే ప్రింట్ చేసుకుని వాళ్లే అమ్ముకునే స్థితి నుంచి ఈరోజు పుస్తకం సింహాసనంపై కూర్చుని రచయిత గర్వపడే విధంగా పాఠకుల ముందుకు పుస్తకాన్ని తీసుకొచ్చిన ఘనత పబ్లికేషన్ సంస్థలదేనన్నారు. ఇలాంటి అద్భుతాలు అన్వీక్షికి వంటి సంస్థలు రావడం వల్లే సాధ్యమైందన్నారు.పాఠకులు, రచయితలు ఇటీవల కాలంలో బాగా పెరిగారని కొత్త రచయితల రాక వలన లక్షల్లో పుస్తకాలు అమ్ముడుపోయే విధంగా అద్భుతాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పుడే విడుదలైన భావయామి పుస్తకంలో మంచి కథలు ఉన్నాయని రచయితను అభినందించారు.

# ‘భైరవం’ ప్రీరిలీజ్ ఈవెంట్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తుతోంది. విజయ్ కనక మేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గాడా సమర్పిస్తున్నారు. ఈ సినిమా మే 30న సమ్మర్ సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రిరిలీజ్ ఈవెంట్‌లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. మీరందరూ కూడా మాకు మంచి హిట్ పడాలని కోరుకుంటున్నారు. అది మాకు తెలుస్తుంది. ఈ సినిమాల్లో పని చేసిన సాంకేతిక నిపుణులకు నటీనటులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ఇరగదీశారు. మే 30న మీరందరూ సినిమా చూసి మా టీమ్ అందరిని బ్లెస్స్ చేయాలి అని కోరుకుంటున్నాను. సినిమా మీ అందరికీ ఒక అద్భుతమైన ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. ఒక మంచి సినిమా చూసామనే సాటిస్ఫాక్షన్ ఉంటుంది. ఈ సినిమా కోసం మేము చాలా కష్టపడి ఇష్టపడి మీ అందరికీ ఒక మంచి సినిమా ఇవ్వాలని ఇవ్వాలని ఉద్దేశంతో చేసాం. డైరెక్టర్ విజయ సినిమాని చాలా కష్టపడి తీశారు. ఆయన హార్డ్ వర్క్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. ఈ సినిమా ఫైనల్ కట్ చూశాను. అదిరిపోయింది. మామూలుగా ఉండదు. మే 30న మనందరికీ పెద్ద పండగ. ఆ పండగలో మీరందరూ భాగం కావాలని కోరుకుంటున్నాను. రాధా మోహన్ లాంటి నిర్మాతలు ఇండస్ట్రీలో ఉండాలి. మనోజ్ అన్నకి రోహిత్‌కి అతిథి ఆనంద్‌కి ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. సినిమా అద్భుతంగా ఉండబోతుంది. సక్సెస్ మీట్‌లో మాట్లాడుకుందాం. లవ్ యు ఆల్ అన్నారు హీరో మంచు మనోజ్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సినిమా మే 30న రిలీజ్ కాబోతుంది. చాలా ఆనందంగా ఉంది. రోహిత్ నేను సాయి సొంత బ్రదర్స్ లాగే ఉన్నాం. ఈ సినిమాతో మా బంధం మరింత పెరిగింది. కలకాలం అది ఇలాగే ఉండాలని ఆ దేవున్ని కోరుకుంటున్నాను. అతిథి ఈ సినిమాలో పార్ట్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఆనంది గారితో కలిసి వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. మా టీమ్ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. సినిమా అనేది కులం చూడదు.




త్రిష నయా లుక్

# తెలుగు, హిందీలో ‘డకాయిట్’ గ్లింప్స్

అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్ ఫైర్ గ్లింప్స్ తెలుగు, హిందీలో రిలీజ్ అయ్యింది. ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఫైర్ గ్లింప్స్ అదిరిపోయింది. శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య ఉద్రిక్త క్షణంలో గ్లింప్స్ ప్రారంభమోతోంది. సానుభూతితో నిండిన వాయిస్‌లో శేష్ ఆమెను జూలియట్ అని పిలుస్తాడు, అందరూ ఆమెకు అన్యాయం చేశారని చెబుతాడు. కానీ వెంటనే అతని వాయిస్ మారుతుంది. నేను నిన్ను మోసగించడానికి రాలేదు, అంతకంటే ఎక్కువ చేస్తా అని మిస్టీరియస్ స్టైల్‌తో శేష్ చెప్పే డైలాగ్ అదిరిపోయింది. నెక్స్ట్ ఎపిసోడ్, ఖైదీ యూనిఫాంలో జైలు వ్యాన్‌లో వున్న శేష్ కూల్‌గా తన నోటి నుండి ఒక కీని బయటకు తెస్తాడు. తర్వాత ఓ రైలు వ్యాన్ మీదుగా దూసుకెళ్తుంది. చివరి సన్నివేశంలో, మృణాల్ అతని పక్కన కూర్చుంటుంది, శేష్ ఫైరింగ్ చేస్తాడు. ప్రేమ, ప్రతీకారం, మోసంతో నిండిన ఓ గొప్ప కథకు ఇది నాంది. విజువల్‌గా డకాయిట్ ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. అడివి శేష్ ఇంటెన్స్ అండ్ రగ్గడ్ పాత్ర కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. మదనపల్లె యాసలో అదరగొట్టాడు. అతని వాయిస్ మాడ్యులేషన్, ఎక్స్ ప్రెషన్స్ అద్భుతంగా వున్నాయి. హిందీ వెర్షన్‌కు కూడా తనే డబ్బింగ్ చెప్పారు. అది అద్భుతంగా వచ్చింది. మృణాల్ ఠాకూర్ స్ట్రాంగ్ క్యారెక్టర్‌లో కనిపించింది. అనురాగ్ కశ్యప్ ప్రజెన్స్ ఇంపాక్ట్ ఫుల్‌గా వుంది. దర్శకుడు షానియల్ డియో విజువల్ ప్రజెంటేషన్ అదరగొట్టాడు. టీజర్ సినిమా స్కేల్ ఎంత బిగ్గర్‌గా వుంటుందో తెలియజేసింది. భీమ్స్ సిసిరోలియో నేపథ్య సంగీతం ఎమోషన్‌ని మరింత ఎలివేట్ చేసింది.



# ఒరు ఆధార్ లవ్ మూవీతో ‘ప్రియా ప్రకాష్ వారియర్’ ఎంట్రీ

మలయాళ పరిశ్రమ నుంచి వచ్చే భామలకు మిగతా సౌత్ భాషల్లో మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా అక్కడ భామలు అభినయానికి ప్రాధాన్యత ఇచ్చే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తూ ఉంటారు. అందుకే అక్కడ ఏదైనా హీరోయిన్ క్లిక్ అయితే చాలు వెంటనే తెలుగు, తమిళ భాషల్లో ఛాన్స్‌లు ఇస్తుంటారు. అలా మలయాళం నుంచి వచ్చిన ఎంతోమంది హీరోయిన్స్ తెలుగు, తమిళ్‌లో సక్సెస్ ఫుల్ హీరోయిన్స్‌గా రాణించారు. ఐతే అందరికీ అలాంటి బజ్ వస్తుందని చెప్పడం కష్టం. ముఖ్యంగా పాపులారిటీ వచ్చినా కథల ఎంపికల వల్ల ఆ క్రేజ్ తెచ్చుకోవడంలో వెనుకబడతారు. అలాంటి వారిలో చెప్పుకుంటే ముందు వరుసలో ఉంటుంది వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్. ఒరు ఆధార్ లవ్ సినిమా టీజర్ తో నేషన్ మొత్తాన్ని తన కన్నుగీటి మాయలో పడేసింది అమ్మడు. ఆ సినిమా రిలీజ్ టైంలో ప్రియా క్రేజ్ ఒక రేంజ్‌లో ఉంది. ఐతే సినిమాలో ఆమె సైడ్ హీరోయిన్ అవ్వడం అంచనాలను అందుకునేలా సినిమా లేకపోవడం వల్ల నిరాశపరిచింది. ఐతే ఆ క్రేజ్ తో తెలుగు ఆఫర్లు వచ్చినా అమ్మడు అప్పుడు కాదనేసింది. స్టార్ ఛాన్స్‌ల కోసం ఎదురుచూసి వచ్చిన ఒకటి అర అవకాశాలు కాదనుకుంది. కట్ చేస్తే తెలుగు పరిశ్రమ అమ్మడికి లైట్ తీసుకుంది. ఆ తర్వాత మళ్లీ కొన్ని ఆఫర్లు రాగా వాటిని ఓకే చేసింది. నితిన్, తేజా సజ్జ లాంటి వారితో సినిమాలు చేసిన ప్రియా ప్రకాష్ ఆ సినిమాతో ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. ఫైనల్‌గా తెలుగులో ఆశించిన బ్రేక్ రాబట్టలేదు సరికదా అసలు ఆమెను పట్టించుకోలేదు. ఐతే ఇదే క్రమంలో తమిళ్‌లో ప్రయత్నాలు చేస్తుంది అమ్మడు. రీసెంట్‌గా అజిత్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో ఆమె స్పెషల్ క్యామియో ఆడియన్స్‌ని అలరించింది. ఇక రీమిక్స్ సాంగ్ కి డ్యాన్స్ చేసి అలరించింది అమ్మడు. ఆ సినిమా కూడా అజిత్ ఫ్యాన్స్‌ని అలరించింది. సో హిట్ వైబ్‌ని క్యాచ్ చేస్తూ అమ్మడు మరికొన్ని అవకాశాలు అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. ప్రియా ప్రకాష్ వారియర్ సినిమా ఆఫర్లు ఎలా ఉన్నా అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం గ్లామర్ షోతో అదరగొట్టేస్తుంది. కెరీర్‌లో ఒక మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న అమ్మడు ప్రయత్నాలు మాత్రం ఆపట్లేదు. మరి అమ్మడికి అలాంటి ఛాన్స్ ఎవరిస్తారన్నది చూడాలి.



27-5Pg5.qxd:27-5Pg5.qxd 01/01/01 9:54 AM Page 1




# యూనస్‌ను దించేందుకు ఆర్మీచీఫ్ కసరత్తు



## మరింత సంక్షోభంలోకి బంగ్లాదేశ్

ఢాకా, మే 26: బంగ్లాదేశ్ రాజకీయ వాతావరణం మళ్లీ ఉద్రిక్తంగా మారేలా సంకేతాలు కనిపిస్తున్నాయి. సైనిక చీఫ్ వాకర్ ఉజ్ జమాన్, తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్‌ను అధికారంలో నుంచి తొలగించేందుకు ప్లాన్స్ చేస్తున్నారని ప్రముఖ నిఘా వర్గాలు వెల్లడించాయి. జమాన్ ఈ ప్రయత్నాన్ని సైనిక స్థాయిలోనే కాదు, రాజకీయంగానూ శ్రమిస్తున్నట్టు సమాచారం. ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధి కారుల సమావేశాల్లో పాల్గొంటూ సైన్యం తమ ఉనికిని, ఉద్దేశాన్ని ప్రజలకు తెలిపిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జమాన్ ఎన్నికలు జూన్‌లో నిర్వ హించాలన్న యూనస్ ఆలోచనకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన, బంగ్లాదేశ్ రాజ్యాంగంలో ఉన్న అస్పష్టతలను వాడుకుని యూనస్ అధికారాలను సవాలు చేయాలని భావి స్తున్నట్టు తెలుస్తోంది. రాజ్యాంగం ప్రకారం, ప్రభుత్వం రద్దైన 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వ హించాలి. కానీ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వానికి చట్టపరంగా సరైన ఆధారంలేదని నిఘా వర్గాలు స్పష్టంగా చెబుతున్నాయి. దేశ రాజకీయాలను పునరుద్దరించే దుకు జమాన్ కీలక ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ప్రత్యేకంగా, షేక్ హసీనా, ఖలీదా జియా నేతృత్వంలోని ప్రధాన రాజకీయపార్టీలను కలిపి ఎన్నికల్లో పోటీ చేయించేదిశగా ఆయన ఆలోచన చేస్తున్నారని వర్గాలు చెబుతున్నాయి. అయితే, యూనస్‌ను అధికారంలో నుంచి తప్పించడంలో జమాన్ విఫలమైతే, పరిస్థితిని తాత్కాలికంగా ఆధీనంలోకి తీసుకొని దేశ రాజకీయంగా స్థిరంగా ఉంచేలా చూస్తారని సమాచారం.

**అత్యవసర పరిస్థితి దిశగా సైన్యం పావులు కదుపుతోందా?:** ఎన్నికల ప్రక్రియలో జాప్యం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమవుతుందని భావిస్తున్న సైన్యం, అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్‌ను అత్యవసర పరిస్థితిని ప్రకటించమని ఒత్తిడి చేస్తున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అలాంటి సందర్భంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయమని కోరే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 58 ప్రకారం, అవసరమైతే అధ్యక్షుడు తక్షణ అధికారం చేపట్టే అధికారం పొందుతారు. ఇదే అధికారం ద్వారా యూనస్‌ను అధికారానికి దూరం చేయాలని సైన్యం భావిస్తున్నట్టు సమాచారం. 2007 తరహాలో మళ్లీ రాజ్యాంగ అస్పష్టత వస్తోందని ఇది కొత్త పరిణామం కాదని నిఘా వర్గాలు గుర్తు చేస్తున్నాయి. 2007లో కూడా బంగ్లాదేశ్‌లో సైనిక మద్దతుతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అప్పటిలాగే ఇప్పుడు కూడా అదే స్క్రిప్ట్ తిరిగి నడుస్తున్నట్టు కనిపిస్తోంది. జమాన్ - యూనస్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు, విదేశీ జోక్యం, రఖైన్ కారిడార్ ప్రతిపాదనలు, దేశ భద్రతకు ముప్పుగా మారతాయన్న ఉద్దేశంతో తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నట్టు సమాచారం. జమాన్ ఇప్పటికే నావికాదళం, వైమానిక దళాల అధిపతుల మద్దతు పొందారు. ఇప్పుడు ప్రజల మద్దతు కూడా తనవైపుగా తిప్పేందుకు యత్నిస్తున్నారు.



# యుద్ధోన్మాదంతో పుతిన్

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం

వాషింగ్టన్, మే 26: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణకు సంబంధించి ఒకవైపు చర్చలు జరగుతున్న వేళ పుతిన్ సైన్యం అతిపెద్ద వైమానిక దాడులు చేయడంపై మండిపడ్డారు. పుతిన్ పూర్తిగా పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని తన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ నాకు చాలా కాలంగా తెలుసు. ఆయనతో ఎప్పుడూ నాకు మంచి సంబం ధాలే ఉన్నాయి. కానీ ఆయనకు ఏదో జరిగింది. పూర్తిగా పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఎటువంటి కారణం లేకుండానే ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నారు. అనవసరంగా చాలా మందిని చంపేస్తున్నారు. పుతిన్ ఉక్రెయిన్‌లో కొంత భూభాగాన్ని కాదు, ఆదేశం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుకుంటున్నారు. ఆయన దృష్టిలో అది సరైనదే కావొచ్చు. కానీ, ఇది రష్యా పతనానికే దారితీస్తుందని పేర్కొన్నారు. ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరును కూడా ట్రంప్ విమర్శించారు. జెలెన్‌స్కీ మాట్లాడే విధానం కూడా ఆ దేశానికి ఏమాత్రం మేలు చేయదని అన్నారు. ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాటా సమస్యలు సృష్టిస్తోందని చెప్పారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇకనైనా ఆపాలని పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం తాను అమెరికా అధ్యక్షుడిగా ఉండి ఉంటే, ఈ యుద్ధం మొదలయ్యేదే కాదని పునరుద్ఘాటించారు. అసమర్థత, ద్వేషంతో మొదలైన ఈ ఉద్రిక్తతలను ఆపేందుకు ప్రయత్నిస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ రాసుకొచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా ఆదివారం భీకర దాడులు చేసింది. రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా రష్యా సైన్యం 367డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 12 మంది మృతి చెందగా, చాలా మంది గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ, అమెరికా మౌనంగా ఉంటే అది పుతిన్‌ను మరింత ప్రోత్సహించినట్లు అవుతుందని విమర్శించారు.


# సిందూర్ దాడుల తర్వాతనే పాక్‌కు సమాచారం ఇచ్చాం

## కాంగ్రెస్ ఆరోపణలు తప్పపట్టిన విదేశాంగమంత్రి జైశంకర్



న్యూఢిల్లీ,మే 26: ఆపరేషన్ సిందూర్ దాడులు గురించి పాకిస్థాన్‌కు ముందే సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను కేంద్రప్రభుత్వం ఖండించింది. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడింది. ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్‌కు సమాచారం అందించామని తెలిపింది. ఈ మేరకు విదేశాంగశాఖకు చెందిన కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశం సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టతనిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్‌కు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు సమాచారం అందించాం. ఎంపీల బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తున్నాయి. అందుకే దేశం మొత్తం ఒక్కతాటిపై నడవాలని జైశంకర్ అభ్యర్థించారు. ఆపరేషన్ సిందూర్ పాక్ దళాల విశ్వసనీయత, నైతికతను దెబ్బతీసిందని జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదంపై భారత వైఖరిని మూడు దేశాల తప్ప మిగిలిన దేశాలు విమర్శించలేదని ఆయన పేర్కొన్నారు. భారత్ తీసుకున్న నిర్ణ యాన్ని ప్రపంచ దేశాలు ప్రశంసిం చాయని వెల్లడించారు. ఉగ్రస్థావ రాలపై ఆపరేషన్ కంటే ముందే పాక్ చెప్పినట్లు కాంగ్రెస్ ప్రచారం చేయడం వాస్తవాలను వక్రీక రించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. అయితే పాకిస్థాన్ సమాచారం విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌కు ముందు గానే ఆపరేషన్ విషయం చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశంలో జైశంకర్ స్పందించినట్లు ఉన్నారు. దాడుల తర్వాతే డిజిఎంఒ స్థాయిలో పాక్ సంప్రదింపులు జరిపిందని జైశంకర్ చెప్పారు.

# 8 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు



న్యూఢిల్లీ,మే 26: రాజ్యసభలోని ఎనిమిది స్థానాలకుగాను ఎన్నికల సంఘం ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించనున్నది. తమిళనాడు, అస్సాం రాష్ట్రాల్లో ఉన్న ఎనిమిది స్థానాలకు జూన్ 19న ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలుకూడా ప్రకటిస్తుంది. రాష్ట్రాల శాసనసభ, మండళనుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సభ్యుల కాలపరిమితి జూన్, జులైల్లోనే ముగుస్తోంది. అందువల్లనే ఈ రెండురాష్ట్రాల్లో రిటైర్ అవుతున్నవారిస్థానంలో మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తోంది. అస్సాంలో రెండు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. మిషన్ రంజన్‌దాస్, బీరేంద్ర ప్రసాద్ బైష్యలు రిటైర్ అవుతున్నారు. జూన్14వ తేదీ వారు రిటైర్ అవుతున్నారు. ఇక తమిళనాడులో అయితే ఆరుగురు రాజ్యసభ సభ్యులు రిటైర్ అవుతున్నారు. వచ్చేనెల 24వ తేదీవరకూ వారికి పదవీకాలం ఉంటుంది. వార అన్బుమణిరామ్‌దాస్, ఎం షన్ముగం, ఎన్ చంద్రశేగరన్, ఎం మహ్మద్ అబ్దుల్లా, పి విల్సన్, వైకోలు ఉన్నారు. వచ్చేనెల 2వ తేదీ నోటిషికేషన్ జారీ అవుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరితేదీ జూన్‌తొమ్మిదిగా నిర్ణయించారు. జూన్ పదవ తేదీ పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణకు జూన్12వ తేదీగా నిర్ణయించారు. కమిషన్ ఈ ఎన్నికల్లో వయెలెట్ రంగు స్కెచ్‌పెన్నులను మాత్రమే వినియోగిస్తోంది. బ్యాలట్‌పత్రాలపై మార్కింగ్‌నకు ఈ రంగు పెన్నులు మాత్రమే వినియోగించేందుకు అనుమతించింది. ఎన్నిక సజావుగా సాగేందుకు పరిశీలకులను నియమిస్తున్నామని, అదనంగా కొవిడ్19 మార్గదర్శకాలు కూడా పాటించాలని ఆదేశించింది. పోలింగ్‌ముగిసిన వెంటనే లెక్కింపును ప్రారంభిస్తారు. జూన్ 23నాటికల్లా మొత్తం ఎన్నికల ప్రనరకియ ముగుస్తుందని ఇసి తెలిపింది. అలాగే ఇదే జూన్ 19వ తేదీ ఎన్నికల సంఘం ఐదు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా నిర్వహిస్తోంది.

# పాకిస్థాన్‌లో జ్యోతికి వివిపి భద్రత

## ఎకె47తో ఆరుగురు సెక్యూరిటీ



న్యూఢిల్లీ, మే 26: దేశ రహస్యాలను పవిత్ర యాత్రాస్థలాల వివరాలను శతృదేశానికి చేరవేసిందన్న అభియోగాలపై ఎన్‌ఐఎ అరెస్టుచేసిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ పర్యటనలో ఆమెకు అడుగడుగునా ఎకె47తో కూడిన భద్రతను కల్పించారు. కనీసం ఆరుగురు సాయుధ సిబ్బంది ఆమెకు భద్రతగా వెళ్లారు. లాహోర్‌లోని అనార్కలి బజార్‌లో ఆమె పర్యటించిన దృశ్యాలు ఆమె ఫోన్‌లనుంచే వైరల్ అయ్యాయి. అదే సమయంలో ఒక స్కాటిష్ యూట్యూబర్‌కూడా పాక్‌లో పర్యటిస్తు ఆమెకు ఎందుకంత సెక్యూరిటీ ఇచ్చారని ఆశ్చర్యపోయినట్లు తేలింది. కాల్లమ్ అబ్రాడ్ పేరిట నిర్వహిస్తున్న యూట్యూబ్ నిర్వాహకుడు కాల్లమ్ మిల్ గత మార్చిలో పాకిస్తాన్‌లోపర్యటించాడు. లాహోర్‌లోని అనార్కలి బజార్‌పర్యటనలో అనేకమంది సాయుధ సిబ్బంది జాకెట్లు ధరించి మరీ అక్కడ తిరుగుతుండటం చూసాడు. వారిమధ్యనుంచే జ్యోతి మల్హోత్రా విడియో షూట్‌చేయడం కూడా చూసాడు. తనను తాను జ్యోతితో పరిచయం చేసుకున్న కాల్లమ్‌ను ఎన్నిసార్లు వచ్చారని అడిగితే ఐదుసార్లు వచ్చానని చెప్పాడు. మీరు ఇండియాకు వచ్చినపుడు నేను కూడా పరిచయం చేస్తానని, పాకిస్తాన్ ఆతిథ్యం ఎలా ఉందని కాల్లమ్‌ప్రశ్నిస్తే జ్యోతి చాలా గొప్పగా ఉందని బదులిచ్చిందని చెప్పాడు. ఆమెకోసమే ఈ సెక్యూరిటీ ఉందని అప్పుడు కాల్లం గుర్తించాడు. ఆమెచుట్టూ ఆరుగురు ఎకె47 తుపాకులతో ఉన్నారన్నారు. మరికొందరు పర్యాటకులుగా ఉన్నారని వారుకూడా జ్యోతి మల్హోత్రతో ఉన్నారన్నారు. అయితే సాయుధులు యూనిఫామ్‌లో లేరని సాదా దుస్తుల్లోనే కనిపించినట్లుస్కాటిష్ యూట్యూబర్ తెలిపాడు. ఆమెకు ఎందుకంత బందోబస్తు ఇచ్చారు. ఇంటెలిజెన్స్‌లోని అత్యున్నతస్థాయి అధికా రులతోకూడా ఆమెకు పరిచయాలున్నాయని స్కాటిష్ యూట్యూబర్ తన విడియోలో తెలిపాడు. అంతేకాకుండా భారత్‌కు వచ్చినతర్వాత జ్యోతిని అరెస్టుచేసిన ఎన్‌ఐఎ, పోలీసులు దర్యాప్తులో తేలింది. జ్యోతివద్దనుంచి మొత్తం ఆమె వినియోగించే ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటినీ స్వాధీనంచేసుకున్నట్లు తేలింది. పాకిస్తాన్‌లో మాత్రం జ్యోతికి వివిపి ట్రీట్‌మెంట్ లభించిందని స్కాటిష్ యూట్యూబర్ విడియోద్వారా తేలింది.



# పాకిస్థాన్‌కు రహస్యాలు లీక్ చేస్తున్న సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్!

న్యూఢిల్లీ, మే 26: సిఆర్‌పిఎఫ్‌కు చెందిన సిబ్బంది ఒకరు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో మమేకం అయి భారత్ కీలక సమాచారాలు, రహస్యాలను చేరవేస్తున్నట్లు రూఢికావడంతో ఎన్‌ఐఎ అరెస్టు చేసింది. మోతిరామ్ జాట్ అనే ఈవ్యక్తి సిఆర్‌పిఎఫ్‌లో పనిచేస్తున్నాడు. రహస్యసమాచారాన్ని, జాతీయభద్రతకు సంబంధించిన కీలక డేటాను పాకిస్తానీ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తున్నట్లు తేలింది. 2023నుంచి మోతిరామ్ ఈ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నట్లు ఎన్‌ఐఎ గుర్తించింది. అంతేకాకుండా వివిధ ఛానెళ్లనుంచి పిఐఒలు మోతిరామ్‌కు సొమ్ములు కూడా పంపిస్తున్నట్లు ఎన్‌ఐఎ ఆరాతీసింది. ఢిల్లీలో అరెస్టుచేసిన మోతీరామ్‌ను ప్రస్తుతం ఇంటరాగేషన్ చేస్తున్నారు. వచ్చే జూన్ ఆరవ తేదీవరకూ ఆయన ఎన్‌ఐఎ కస్టడీలో ఉండాలని స్పెషల్‌కోర్టు ఆదేశించింది. సిఆర్‌పిఎఫ్ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనచేస్తూ మోతీరామ్‌ను సర్వీసునుంచి డిస్మిస్‌చేస్తున్నట్లు ప్రకటించింది. జాట్ సోషల్‌మీడియా కార్యకలాపాలపై నిఘా వేసిన ఎన్‌ఐఎ ఇతర కేంద్రేజెన్సీల సాయంతో పక్కాగా సమాచారం రాబట్టింది. తదుపరి విచారణకు మోతీరామ్‌ను ఎన్‌ఐఎకు అప్పగించినట్లు తెలిపింది. దీనితోపాటుగానే ఈనెల 21వ తేదీనుంచే అమలుకు వచ్చేటట్లు ఆతడిని సిఆర్‌పిఎఫ్ సర్వీసులనుంచి డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

# నరమాంస భక్షకుడికి జీవితఖైదు

లక్నో, మే 26: మనిషిని చంపి ఆ తలతో సూప్ చేసుకుని తాగే నరమాంశ భక్షకుడికి ఉత్తర్ ప్రదేశ్ లోని లక్నో కోర్టు జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది. ఇద్దరు వ్యక్తుల హత్యకేసులో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సీరియల్ కిల్లర్ రామ్ నిరంజన్ అలియాస్ రాజా కోలందర్, అతడి సహచరుడు బక్ష్‌రాజ్‌కు లఖ్‌నవూ కోర్టు జీవితఖైదు విధించింది. కోలందర్ నరమాంస భక్షకుడని, మనిషితలతో చేసిన సూప్ తాగడానికి ఇష్టపడేవాడనే ఆరోపణలు ఉన్నాయి. జడ్జి శిక్ష విధించే సమయంలో కోలందర్ కోర్టు గదిలో నవ్వుతూ కనిపించాడు. అతడిలో ఎటువంటి పశ్చాత్తాపం, భయం కనిపించలేదు. ప్రయాగ్‌రాజ్‌కు చెందిన జర్నలిస్టు ధీరేంద్రసింగ్ హత్యకేసులో కోలందర్‌పై మొదటి ఎఫ్‌ఐఆర్ నమోదైంది. పోలీసులు ఈ కేసు దర్యాప్తు ప్రారంభించినప్పుడు అతడి బండారం బయటపడి, అనేక ఇతర నేరాలు వెలుగులోకి వచ్చాయి. ధీరేంద్రసింగ్ హత్యకేసు దర్యాప్తు కోసం పోలీసులు కోలందర్ ఫామ్‌హౌసుకు వెళ్లగా అక్కడ మనుషుల పుర్రెలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని కోలందర్‌ను ప్రశ్నించగా పాతికేళ్ల కిందట 2000 సంవత్సరంలో మనోజ్ అనే వ్యక్తిని, అతడి డ్రైవరు రవిని తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. వారి మృతదేహాలను ముక్కలుగా నరికి పూడ్చిపెట్టినట్లు కోలందర్, బక్ష్‌రాజ్ వెల్లడించారు. జర్నలిస్ట్ ధీరేంద్రను పిప్రీలోని తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి చంపినట్లు కోలందర్ తెలిపాడు.

# యశ్వంత్‌వర్మ కేసు వివరాలు ఆర్టీఐ కింద ఇవ్వలేం..!

## అర్జీదారుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ, మే 26: యశ్వంత్‌వర్మ ఇంటి ఆవరణలో నోట్లకట్టల వివాదంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలు, అంతర్గత విచారణ నివేదికలు, చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా ప్రధాని నరేంద్రమోడీకి రాసిన లేఖలు వంటివాటిని బహిర్గతం చేయాలంటూ సమాచారహక్కు చట్టం కింద దాఖలయిన పిటిషన్‌ను సుప్రీం తిరస్కరించింది. అంతేకాకుండా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధానిమోడీలకు ఇచ్చిన సమా చారం వారి స్పందనను కూడా తెలియజేయాలని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఈ విచారణ మొత్తం గోప్యంగానే ఉంటుందని, ఆర్‌టిఐ దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటరీ ప్రతిష్టను ఉల్లంఘించినట్లవు తుందని అందుకే ఆర్టీఐకింద ఇవ్వడం సాధ్యం కాదని తెలియజేసారు. అంతకుముందు మాజీ సిజె ఖన్నా రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు తన సిఫారసులను రాసారు. అలాగే త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను కూడా తన లేఖకు జత చేసారు. అలాగే జస్టిస్ వర్మనుంచి వచ్చిన స్పందనను కూడా ఆయన జోడించారు. ఇపుడు కార్యనిర్వాహక వ్యవస్థ, పార్లమెంటు పరిధిలోనే యశ్వంత్‌వర్మపై చర్యల అంశం ఉంటుందని అన్నారు. జడ్జి రాజీనామా చేయాలని చేసిన సూచనలు కూడా అమలుకు రానందున ఆయన్ను పదవీచ్యుతి చేయాల్సిం దేనని సంజీవ్‌ఖన్నా సూచించారు. ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిననివేదికలో యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా అనేక సిఫారసులున్నాయని అందువల్ల రాజీనామాచేయడమే మంచిదనిక ఊడా సూచించారు.

మొత్తం 50 మందినుంచి వాం గ్మూలాలను సేకరించారు. ఢిల్లీపోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా, ఢిల్లీ ఫైర్‌సర్వీస్ చీఫ్ వంటి ఉన్నతాధికారులనుంచి కూడా నివేదికలు కోరింది. జస్టిస్‌వర్మ అధికారిక నివాసం ల్యూటెన్ ప్రాంతంలో గత మార్చి 14వ తేదీ రాత్రి 11.35 గంటలకు జరిగిన ప్రమాదం అదుపుచేసేందుకు వెళితే అక్కడ నోట్లకట్టలు ఉన్నాయని అన్నారు. మార్చి24వ తేదీ సర్వోన్నత న్యాయస్థానం కొల్లిజియం జస్టిస్ వర్మను తన మాతృ సంస్థ అలహాబాద్ హైకోర్టుకు పంపించింది. అదేనెల 28వ తేదీ సుప్రీంకోర్టు జస్టిస్ వర్మకు ఎలాంటి కేసులు బాధ్యతలు అప్పగించవద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది.



# గంగూలీ సోదరుడి కుటుంబానికి తృటిలో తప్పిన ప్రాణాపాయం

పూరి(ఒడిశా)మే 26: క్రికెటర్ సౌరవ్ గంగూలీ ఫ్యామిలీకి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఒడిశాలో ఆదివారం సౌరవ్ గంగూలీ సోదరుడు స్నేహాశిష్ గంగూలీ మరియు అతని భార్య అర్పితకు సముద్రంలో ప్రమాదం సంభవించింది. వారు ప్రయాణిస్తున్న స్పీడ్ బోట్ మునిగిపోవడంతో తృటిలో తప్పించుకున్నారు. పూరీలో సెలవులను ఎంజాయ్ చేస్తున్న గంగూలీ దంపతులు బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ ఆస్వాదిస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. లైఫ్‌గార్డ్‌లు పర్యాటకులను రక్షించడానికి ప్రయత్నిస్తుండగా సముద్ర జలాల్లో స్పీడ్ బోట్ తలక్రిందులయింది. అధికారులు వారిని రక్షించడానికి రబ్బరు ఫ్లోట్‌లను ఉపయోగించారు. పడవలో ప్రయాణికుల సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల పడవ తేలికగా ఉండటం వల్ల అది బోల్తా పడిందని అర్పితా గంగూలీ ఆరోపించారు. సముద్రం ఇప్పటికే చాలా అల్లకల్లోలంగా ఉంది. పడవలో 10 మంది సామర్థ్యం ఉంది. కానీ వారు ముగ్గురు నుండి నలుగురు వ్యక్తులను మాత్రమే ఎక్కించుకున్నారు. ఆ రోజు సముద్రంలోకి వెళ్ళిన చివరి పడవ ఇదే. సముద్రంలోకి వెళ్ళడంపై మేము ఆందోళన వ్యక్తం చేసాము, కానీ ఆపరేటర్లు అంతా బాగానే ఉందని మాకు చెప్పారని శ్రీమతి గంగూలీ అన్నారు. సముద్రంలోకి వెళ్ళిన వెంటనే, ఒక పెద్ద అల పడవను ఢీకొట్టిందని ఆమె చెప్పారు. లైఫ్‌గార్డ్‌లు రాకపోతే మేము బతికేవాళ్లం కాదన్నారు. పడవలో ఎక్కువ మంది ఉంటే, బహుశా అది తిరగబడి ఉండేది కాదని ఆమె అన్నారు. పడవలను నడిపే ఆపరేటర్ల నైపుణ్యంపై మరింత పరిశీలన చేయాలని గంగూలీ పిలు పునిచ్చారు. అధికారులు ఇక్కడ ఈ క్రీడలను నిషేధించాలి. పూరి బీచ్‌లో సముద్రం చాలా అల్లకల్లోలంగా ఉంటుంది. నేను కోల్‌కతాకు తిరిగి వెళ్లిన తర్వాత, ఇక్కడ జల క్రీడలను నిలిపివేయమని కోరుతూ పోలీసు సూపరింటెండెంట్ మరియు ముఖ్యమంత్రికి లేఖ రాస్తాను అని ఆమె చెప్పారు.



# రోడ్‌షోలో మోడీపై పూలు చల్లి స్వాగతం పలికిన సోఫియా ఖురేషి కుటుంబం!

వదోదర, మే 26: ఆపరేషన్ సింధూర్ తర్వాత తొలిసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో రెండురోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వడోదరలో రోడ్‌షోతో పర్యటనను ప్రారంభించారు. త్రివర్ణపతాకాలతో ప్రధానికి వడోదర ప్రజలు ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. ప్రధాని మోదీకి నారీశక్తి స్వాగతం పలికింది మోదీకి 30వేల మంది మహిళలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఆపరేషన్ సింధూర్‌తర్వాత తొలిపర్యటన గుజరాత్‌లోచేసిన మోడీకి స్వరాష్ట్రంలో అపూర్వ స్వాగతం లభించింది. ప్రత్యేకించి వేలాదిగా మహిళలు రోడ్లకిరువైపులా బారులు తీరి మోడీ కాన్వాయ్‌పై పూలు చల్లుతూ కనిపించారు. కాగా గుజరాత్ లోని వడోదరలో ప్రధాని మోదీ పాల్గొన్న సింధూర్ సమ్మాన్‌యాత్రలో కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోఫియా ఖురేషీ వడోదర చెందినవారు. ఆమె కుటుంబీకులు అక్కడే స్థిరపడ్డారు. ప్రధాని మోదీ వడోదరలోనే రోడ్‌షో చేయడంతో, ఖురేషీ కుటుంబసభ్యులు రోడ్‌షోలో స్పెషల్‌గా కనిపించారు. మోదీపై కల్నల్‌సోఫియా ఖురేషీ కుటుంబ సభ్యులు పూలవర్షం కురిపించారు. ప్రధాని మోదీ వారికి అభివాదం చేశారు. కాగా పహల్గామ్ ఉగ్రదాడిని కల్నల్ సోఫియా ఖురేషీ కుటుం బీకులు ఖండించారు. మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ తమకు చాలా గర్వంగా ఉందని సోఫియా సోదరి షాయనా చెప్పారు. భారత్‌వైపు ఎవరైనా చూడాలంటే ఇక భయప‌డతారని షాయనా చెప్పారు. మహిళల సిం ధూరం కోసం తన కూతురు యుద్ధం చేయడం తనకు గర్వంగా ఉందని సోఫియా తల్లి చెప్పారు.

# ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కమాండర్ మనీష్‌యాదవ్ హతం



రాంచి, మే 26: మావోయిస్టు కమాండర్‌గా పేర్కొంటున్న మనిష్‌యాదవ్ సోమవారం జార్ఖండ్‌లోని లతేహార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయినట్లు పోలీసులు తెలిపారు. యాదవ్‌పై ఐదు లక్షల రివార్డుకూడా ఉంది. మరో వాంటెడ్ మావోయిస్టు కుందర్ ఖేర్వార్‌పైనా 10 లక్షల నగదు రివార్డు ఉంది. ఆతడిని ఎన్‌కౌంటర్‌ప్రాంతంనుంచే అరెస్టు చేసినట్లు తెలిపారు. కరంఖద్ ప్రాంతం, దౌనా ప్రనాంతాల్లోని అటవీప్రాంతాల్లో ఈ ఎదురుకాల్పులు జరిగినట్లు అధికారులు తెలిపారు. లతేహార్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో మావో యిస్టుల సంచారం ఉందన్న సమాచారంతో భారీ ఎత్తున గాలింపు చర్యలకు పాల్పడ్డారు. ఆదివారం రాత్రినుంచే మావోయిస్టులకు, భద్రతా బలగాలకు కాల్పులుప్రారంభం అయ్యాయి.

ఆ తర్వాత తనిఖీల్లో మనిష్ యాదవ్ మృతదేహం లభించిందని పాలము డిఐజి వైఎస్‌రమేష్ తెలిపారు. మనీష్‌యాదవ్ తన బృందంతో అడవుల్లో ఉన్నట్లు సమాచారం అందగానే పోలీస్ టీమ్ ఏర్పాటుచేసి ఆపరేషన్ ప్రారం భించామన్నారు. మావోయిస్టులను గుర్తించిన వెంటనే సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు ప్రారంభించారని, ప్రతిగా జరిపిన కాల్పుల్లో మనీష్‌యాదవ్ స్పాట్‌లోనే చనిపోయినట్లు తెలిపారు. రెండు ఆటోమేటిక్ తుపాకులు, రోజువారి వినియోగించే సామగ్రి ఆప్రాంతంలో లభించాయన్నారు. బీహార్ కేంద్రంగా ఉన్న మావోయిస్టు యూనిట్లు, బుద్ధపహాడ్ శిక్షణా కేంద్రం కూడా ఇకముగిసినట్లేనని డిఐజి చెప్పారు. గయ జిల్లాలోనిచక్రబంధ ప్రాంతానికి చెందిన యాదవ్ బీహార్‌లోని బుధపహాడ్‌ప్రాంతంలో టాప్ మావోయిస్టు కమాండర్‌గా కొనసాగుతున్నాడు. దశాబ్దకాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. దళంలో ఒక సామాన్య కేడర్‌నుంచి కమాండర్‌స్థాయికి వచ్చాడు. ఇపుడు ఎన్‌కౌంటర్‌ఝరిగిన ప్రాంతంలోనే ఆతని బంధువులు ఉంటున్నారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జార్ఖండ్ పోలీసులు రెండో మేజర్ సక్సెస్‌ను సాధించారు. జజెఎంపి కమాండర్ పప్పు లోహ్రా, సబ్‌జోనల్ కమాండర్ ప్రభాత్ గంఝులను కూడా ఎన్‌కౌంటర్‌లో హత్యచేసారు. లోహ్రా, గంజులపైనా వరుసగా పదిలక్షలు, ఐదు లక్షల రివార్డులున్నాయి.

భారత్ 'బాయ్‌కాట్' వేళ..

# పాక్-తుర్కియే తొలి భేటీ



అంకారా, మే 26: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సాయం చేసిన తుర్కియేపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ ఉత్పత్తులను నిషేధించాలంటూ 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం మార్మోగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భేటీ అయ్యారు. ఇస్తాంబుల్‌లో ఆదివారం రాత్రి వీరి సమావేశం జరిగింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పాక్ ప్రధాని చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. 'నా ప్రియమైన సోదరుడు ఎర్డోగాన్‌తో గౌరవప్రద భేటీ జరిగింది. భారత్‌తో ఉద్రిక్తతల సమయంలో మాకు అండగా నిలిచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలను సమీక్షించాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. పాక్-తుర్కియే స్నేహబంధం సుదీర్ఘకాలం కొనసాగాలి' అని షెహబాజ్ షరీఫ్ పోస్టులో రాసుకొచ్చారు. అటు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కూడా షెహబాజ్ వెంట వెళ్లారు. దీనిపై ఎర్డోగాన్ కూడా స్పందించారు. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహబంధం ఉందని అన్నారు. రాజకీయ, వాణిజ్య రంగాల్లో చారిత్రక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత వీరిద్దరూ భేటీ అవడం ఇదే తొలిసారి. భారత్-తుర్కియే మధ్య విభేదాలు నెలకొన్న వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

27-5Pg6exHMNWJQE.qxd:27-5Pg6exHMNWJQE.qxd 01/01/01 9:57 AM Page 1



# ఖరీఫ్ పంటలకు సబ్సిడీతో విత్తనాలు అందించాలి

## కలెక్టరేట్, ఆర్డీఓ, మండల కేంద్రాల్లో కౌలు రైతుల ఆందోళన



కలెక్టరేట్‌లో వినతి పత్రం అందిస్తున్న కౌలు రైతుల సంఘం నాయకులు

**విజయవాడ,మూ26,ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ సీజన్ లో పండించే పంటలకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యల్లమందారావు, కౌలురైతుల సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ వాసు తదితరులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ మొదటి వారం నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నప్పటికి ఇంతవరకు పంటల వారీగా ప్రణాళికలు, క్రెడిట్ ప్రణాళికలు, విత్తన ప్రణాళికలు ప్రకటించలేదని, సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఖరీఫ్ కు అవసరమైన పరపతి సౌకర్యం, విత్తనాలు, వ్యవసాయపరికరాలు అందించి రైతులకు అండగా నిలబడాలని కోరారు. నేడు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని చేపట్టిన కార్యక్రమంలో భాగంగా యన్ టి ఆర్ జిల్లా, విజయవాడలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఆఫీసర్ లక్ష్మీ నరసింహా గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.జమలయ్య, యం.యలమందారావు, నిమ్మగడ్డ వాసు మాట్లాడుతూ జిల్లాలో 90 శాతం కౌలురైతులే వ్యవసాయం చేస్తున్నారని, వీరికి ఇంతవరకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయలేదని గ్రామసభలు నిర్వహించలేదని దీనివల్ల కౌలురైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. మార్కెట్ లో అన్ని రకాల పంటల విత్తనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని,విత్తనాల ధరలు పెరగడంతో పాటు నాణ్యతలేని విత్తనాలను బయట మార్కెట్లో విచ్చలవిడిగా అమ్ముతున్నారని, చదువు లేని రైతాంగ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కల్తీ, నకిలీ విత్తనాలు రైతాంగానికి అంటగడుతున్నారన్నారు.



# గాలివానల వలన విద్యుత్తు సరఫరాకు ఇబ్బంది కలుగకూడదు

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**విజయవాడ , మే 26,ప్రభాతవార్తప్రతినిధి:** ముందస్తు రుతుపవనాల ప్రభావంతో ఏర్పడే గాలివానల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీట్రాన్స్కో , డిస్కాములతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం వచ్చినా, తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిస్కాములకు ఆయన సూచించారు. దీనికోసం డిస్కంల దిలీదీలు రోజూ వారి పరిస్థితిని సమీక్షించాలని ఏఈ నుండి ఎస్ఈ ) వరకు ఫీల్డ్ స్థాయిలో సమన్వయం తో పనిచేయాల్సిన అవసరం ఉందని కె విజయానంద్ పేర్కొన్నారు. అన్ని డిస్కంలు 247 కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని తద్వారా ఎమర్జెన్సీ సమయంలో తక్షణ స్పందన, ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతాయని తెలిపారు. విద్యుత్ మరమ్మత్తు పనులు లేదా షట్డౌన్ల విషయంలో వినియోగదారులు మరియు ప్రజాప్రతినిధులకు ముందుగా మీడియా, మొబైల్ కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం గా వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వేగవంతమైన స్పందన, పారదర్శక సమాచారం ఇచ్చే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. లైన్ మెయింటెనెన్స్ , చెట్ల కొమ్మల ట్రిమ్మింగ్ వంటి పనులు నిర్వహిస్తున్నప్పుడు, విద్యుత్ అధికారులు ప్రత్యక్షంగా అక్కడే ఉండాలని, ఇది ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడానికీ, సమర్ధవంతంగా పనులు చేపట్టడానికి తోడ్పడుతుందన్నారు . ప్రతి డిస్కమ్ డైరెక్టర్కు రెండు లేదా మూడు జిల్లాల బాధ్యతలు అప్పగించాలని ఆయన ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో, విద్యుత్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా పరిస్థితి, పీక్ డిమాండ్ సీజన్కు సిద్ధత, కింద జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, అలాగే ఇటీవల జరిగిన వాతావరణ ప్రభావాల నుంచి పునరుద్ధరణ చర్యల పురోగతిపై సమీక్ష చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో , ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం తో, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. వేసవి, అకాల వర్షాలు వంటి అత్యవసర సమయాల్లో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు, డిస్కంలు పీక్ లోడ్ మేనేజ్మెంట్ను బలోపేతం చేయాలని , ఆదీలీలీ పనులను వేగవంతం చేయాలని , వినియోగ దారుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను మరింత ప్రభావవంతంగా నిర్వ హించాలని సీఎస్ ఆదేశించారు. నమ్మకమైన విద్యుత్ సరఫరా అనేది రాష్ట్రాభివృద్ధికి దోహద పడుతుందన్నారు.



## తిరుపతిలో 'బైక్‌రైడర్ల'పై కొరడా!

**తిరుపతి,మే 26ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం...విద్యాకేంద్రంగా విరాజిల్లుతున్న తిరుపతినగరం శివార్లలో యువత సామాజిక మాధ్యమాలు వేదికగా నగరరోడ్లపై బైక్‌రేసింగ్‌లు, బైక్ స్టంట్స్ చేస్తున్నవారిపై తిరుపతి జిల్లా పోలీసులు కొరఢా ఝుళిపిస్తున్నారు. ఇప్పటివరకు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు, చెడువ్యసనాలకు బానిసై శృతిమించిన వారిపై ఏకంగా పోలీసులు కేసులు నమోదు చేసేవారు. తాజాగా తిరుపతి నగరంలో డ్రోన్‌కెమెరాల,సోలార్ సిసికెమెరాల నిఘాతో ఇలాంటి పెడదారిన పట్టిన, నగరరోడ్లపైనేగాక శివార్లలోని బైపాస్‌లలో, చివరకు గరుడవారధిపై రాత్రి సమయాల్లో అర్ధరాత్రి దాటినా బైక్‌రేస్‌లు, బైక్‌స్టంట్స్, బైక్‌తో ఆర్ట్స్ చేస్తుండటంతో డ్రోన్ కనిపెట్టి సమాచారం అందించింది. దీంతో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు, చంద్రగిరి పోలీసులను అలర్ట్‌చేశారు. తిరుపతి డిఎస్పీ రామకృష్ణమ ఆచారి, రూరల్ డిఎస్పీ ప్రసాద్ సిఐలతో సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఇలాంటి వాటికి పాల్పడుతున్న పదిమంది యువతను అదుపులోకి తీసుకున్నారు. సామాజికమాధ్యమాల్లో పోస్టులు పెట్టి యువతను ఆకర్షిస్తున్న అకౌంట్స్‌ను గుర్తించారు. ఏకంగా సోమవారం యువత తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి డిఎస్పీ రామకృష్ణమా ఆచారి, సిఐలు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పిల్లల వ్యసనాలు వెలుగుచూసింది. అంతేగాక అర్ధరాత్రిదాటిన తరువాత పిల్లలు ఇంటికి వస్తే గట్టిగా ప్రశ్నించాలని, ఇలాంటి బైక్‌లతో రేసింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాలతో దళితులు అభివృద్ధి

## - మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

**చిత్తూరు రూరల్, మే 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్డీఓ కూటమి ప్రభుత్వంతోనే దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. చిత్తూరు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి జిల్లా సాంఘీక సంక్షేమ, సాధికారిత అధికారి చిన్నయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మాలలు, మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 954 యూనిట్లు, తిరుపతి జిల్లాలో 1,267 యూనిట్లు మంజూరు అయ్యాయని, ఈ రెండు జిల్లాలకు కలిపి 2,221 యూనిట్లు మంజూరు అయితే 92 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 117 షాపులు వున్నాయని, 2014-2019 సంవత్సర మధ్యకాలంలో రాష్ట్రంలో 7,500 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెడితే అందులో 40 వేల కోట్ల రూపాయలు దళితుల అభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో 2015-2018 సంవత్సర మధ్యకాలంలో జిల్లాలో 242 కోట్ల రూపాయలతో 4 లక్షల మంది యువతకు వివిధ రకాలుగా ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే సబ్‌ప్లాన్ ద్వారా జిల్లాలో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. డ్రైవర్లుగా వున్న దళిత యువతను ఓటర్లుగా మార్చిన ఘనత సిఎం నారా చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. గతంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా వున్న నారా లోకేష్ 4 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు రాష్ట్ర వ్యాప్తంగా వేస్తే అందులో ఎక్కువ శాతం దళిత గ్రామాల్లో వేయడం జరిగిందన్నారు.

# పిల్లల కళ్లముందే తల్లి దుర్మరణం

## కదులుతున్న రైలు ఎక్కబోతుండగా ప్రమాదం





**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రైలు బోగీ మారేందుకు యత్నించిన ఓ మహిళ ప్రమాదవశాత్తూ రైలు, ప్లాట్‌ఫాం మధ్య పడిపోయి ప్రాణాలు కోల్పోయింది. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో కన్నపిల్లల కళ్ల ముందే ఆ తల్లి రైలు బోగీ నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం చర్లపల్లి రైల్వేస్టేషన్లో విషాదాన్ని నింపింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపిలోని అనకాపల్లి జిల్లా దొండపూడికి చెందిన మట్ట వెంకటేశ్, శ్వేత (33) దంపతులు. నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వెంకటేశ్ తన భార్య శ్వేత, ఇద్దరు పిల్లలతో కలిసి లింగంపల్లి హెచ్ఎంటీ టౌన్‌షిప్ చింతల్ చంద్రానగర్‌లో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవులు పూర్తవుతున్న క్రమంలో కొద్దిరోజులు శ్వేత తన ఇద్దరు పిల్లలతో దొండ పూడిలో గడిపి రావాలనుకుంది. ఇందుకోసం భర్త వెంకటేశ్ ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేశాడు. ఆదివారం ఉదయం భార్య, పిల్లలను లింగంపల్లి రైల్వే స్టేషన్ తీసుకువచ్చిన వెంకటేశ్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించి డీ-3 బోగీలోని సీట్లలో కూర్చోబెట్టాడు. సీట్ నంబర్ సరిగా ప్రింట్ కాక పోవడంతో.. వీరు డి-8 బోగీలో ఎక్కాల్సి ఉండగా పొరపాటుగా డి-3లో ఎక్కారు. రైలు లింగంపల్లి స్టేషన్‌కు చేరాక..వేరే ప్రయాణికులు వచ్చి తమ సీట్లు అని చెప్పడంతో ఆమె విషయాన్ని గుర్తించారు.

తన వద్ద ఉన్న టికె టును మరోసారి సరిచూసుకోగా తన బోగీ డి-8గా గుర్తించింది శ్వేత. రైలులో రద్దీ ఎక్కువగా ఉండడంతో 3-డి నంబరు బోగీ నుంచి 8-డి నంబర్ బోగీ వరకు బోగీల మార్గం నుంచి వెళ్లడం సాధ్యం కాలేదు. బోగిలో రద్దీ ఉండటంతో ఆమె చర్లపల్లి స్టేషన్‌లో రైలు దిగి ఇద్దరు పిల్లలతో పాటు డి-8 బోగీ వద్దకు చేరుకున్నారు. పిల్లలను, లగేజీని హుటాహుటిన బోగీ లోకి ఎక్కించి తాను ఎక్కేందుకు ఉపక్రమిస్తున్న సమయంలోనే రైలు కదులుతూ వేగం పుంజుకుంది. దీంతో కాలుజారి కిందపడిన శ్వేత బోగీకి ప్లాట్‌ఫామ్ మధ్యలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై పట్టాల పక్కన పడిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన ప్రయాణికులు, పోలీసులు ఆమెను రక్షించే ప్రయత్నం చేస్తుండగానే అప్పటికే మృతి చెందింది. తమ కళ్లెదుటే తల్లి చనిపోవడంతో పిల్లలు బోరున విలపిస్తూ తల్లడిల్లిపోయారు. సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరు కున్న భర్త వెంకటేశ్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఆన్లైన్ టికెట్లో ప్రింట్ సరిగా పడని కారణంతోనే తన భార్య రైలు ప్రమాదానికి బలైందన్నాడు. శ్వేత మృతదేహానికి గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు.

# అక్రమ ప్యాకింగ్ వాటర్‌పై బిఐఎస్ కొరడా

## - విజయనగరంలోని శ్రీ గంగా భవానీ ఆక్వా ఇండస్ట్రీస్ పై దాడులు



**విజయవాడ, మే 26, ప్రభాతవార్త :** భారతప్రమాణాల మంత్రిత్వ శాఖ వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం విజయవాడ శాఖాధికారులు అక్రమ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్ పై దాడులు నిర్వహించారు. బిఐఎస్ సర్టిఫికేషన్ లేకుండానే లో నకిలీ బిఐఎస్ లేబుల్స్‌తో ప్యాకింగ్ చేసిన వాటర్‌ను మార్కెట్లో చలామణి చేస్తున్న విజయనగరంలోని శ్రీ గంగాభవాని ఆక్వా ఇండస్ట్రీస్ విజయవాడ బిఐఎస్ అధికారులు రైడ్ చేసి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా బిఐఎస్ విజయవాడ శాఖ సైంటిస్ట్ సి/ డిప్యూటి డైరెక్టర్ మాట్లాడుతూ సెక్షన్ 17(3) ప్రకారం సరైన నిబంధనలు పాటించని సంస్థలపై చట్ట ప్రకారం తాము చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులకు మొదటి ఉల్లంఘన సందర్భంలో 2 ఏళ్ళ జైలు శిక్ష లేదా రెండు లక్షల జరిమానా, రెండోసారి అయితే 5ఏళ్ళ జైలు, రు5లక్షల జరిమానా వుంటుందన్నారు. కోర్టు నిర్ణయం మేరకు ఉత్పత్తి చేసిన,
విక్రయించిన వస్తువులపై పదిరెట్లు వరకు జరిమానా పొడిగిస్తామన్నారు. నకిలీ వస్తువుల పంపిణీ చేయకుండా నిరోధానికి ప్రజలంతా అప్రమత్తంగా వుంటూ బిఐఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగిం చాలన్నారు. అలాగే బిఐఎస్ నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రజలెవరికైనా తెలిస్తే సదరు సమాచారాన్ని బిఐఎస్ యాప్ ద్వారా ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని,

ఫిర్యాదు దారు వివరాలు గోప్యంగా వుంచుతామన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు

## ఇఓ వికె శీనా నాయక్



మీడియాకు వివరిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 26, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో జరిగే అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరపించి త్వరలో భక్తులకు అందుబాటులోకి తెస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సోమవారం ఆయన ఆలయ ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జూన్ 3 నుండి 5 వరకు నవగ్రహా మండపం పున:ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో అన్నదాన భవనం, లడ్డూపోటు తదితర నిరా ్మణాలను దసరా నాటికి అందుబాటులోకి తెచ్చేలా పనులు వేగిరం చేసామన్నారు. రాతియాగశాల , పూజా మండపాలు శ్రావణమాసంలో అందుబాటులోకి తెస్తామన్నారు ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్టాండ్, రైల్వేస్టేషన్, పున్నమిఘాట్ వద్ద నుండి బస్సులు ఏర్పాటు చేసి కొండపై ట్రాఫిక్ రద్దీ నివారణకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. సీతమ్మవారి పాదాల వద్ద 4 ఎకరాల్లో హోల్డింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, అవసరమైతే కుమ్మరిపాలెం వద్ద టిటిడి స్థలంలో కూడా హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తామన్నారు. దుర్గాఘాట్‌ను విస్తరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ పథకం ద్వారా నిధులను రాబట్టడానికి విజయవాడ ఎంపి, పశ్చిమ ఎమ్మెల్యేలు విశేష కృషి చేస్తున్నారన్నారు. అలాగే అమ్మవారి నైవేద్య విరామ సమయంలో ఉదయం 11.30 నుండి 1.30 వరకు విఐపి దర్శనాలు నిలిపేశామన్నారు. ఆ సమయంలో క్యూలైన్లో భక్తులకు, వృద్ధులకు, పసిపిల్లలకు ఇబ్బందికలగడానికి తాను స్వయంగా చూశానని, దాంతో విఐపి దర్శనాలు క్రమబద్దీకరణ చేశామన్నారు. దర్శనానికి వచ్చే విఐపిలు వివరాలతో కూడిన ఫార్మట్‌ను ముందుగా తమకివ్వాలన్నారు.

## చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక పాలసీ

### మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,మే 26,ప్రభాతవార్త ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి, సినీ రంగానికి సంబంధించి ఇటీవల చోటు చేసుకున్న పలు పరిణామాల గురించి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ప్రశ్నించారు. ఆయన "ఎక్స్"సినిమా విషయాలపై పరిజ్ఞానం లేని వారు మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. సినీ ప్రముఖులు కలవలేదని మేము ఎప్పుడైనా పరి శ్రమకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నామా? అని ప్రశ్నించారు. డీజీపీని మేమేదో అన్నట్లు వక్రభాష్యాలు చెప్పేవాళ్ళు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సినిమా టికెట్ల రేట్లు పెంచమని సినీ రంగం నుండి నిర్మాతలు విడివిడిగా వచ్చి తమను కలుస్తారని, తాము కూడా అందుకు సరే అని చెబుతున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ క్రమంలో ఎవరో ఒకరు కోర్టుల్లో పిల్ వేస్తున్నారని తద్వారా అధికారులు కోర్టులు చుట్టూ తిరిగే దుస్థితి నెలకొందన్నారు. టికెట్ల ధరల పెంపుపై దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోందన్నారు. ఈ విధానాలన్నింటికి చెక్ పెట్టి నూతన ఫిల్మ్ పాలసీ ద్వారా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధానాలను తీసుకురావాలని భావించామన్నారు. సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసమే తాము రేట్ల పెంపుకు అనుమతిస్తున్నామన్నారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకుంటామని కొందరు అహంభావంతో మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. ఇది సరైన విధానం కాదని సూచించారు. సినిమా రంగం వ్యాపారమని కొందరు మాట్లాడుతున్నట్లుగా సినిమా రంగానికి ప్రభుత్వంతో సంబంధం లేనప్పుడు గత ప్రభుత్వాన్ని సినీ ప్రముఖులు ఎందుకు కలిశారన్నారు.

# యోగాచరణతో దేహదారుఢ్యం, మానసిక ఆరోగ్యం మన సొంతం

## ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు



విజయవాడ యోగ అభ్యసన చేస్తున్న అధికారులు

**విజయవాడ,మే 26,ప్రభాతవార్త ప్రతినిధి**శ్వాసపై ధ్యాసతో తనువు మనసును ఏకం చేసి.. సుసంపన్న ఆరోగ్యాన్ని బాటలు వేసే యోగా ఔన్నత్యాన్ని ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ చేరువచేసే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా థీమ్ యోగా కార్యక్రమాలు ప్రారంభమైనట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. సోమవారం విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆయుష్ శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో థీమ్ యోగా కార్యక్రమ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్ జి.వీరపాండ్యన్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ గిరీష పీఎస్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు, నగర ప్రజలు పాల్గొని డా. రత్న ప్రియదర్శిని మార్గనిర్దేశనంతో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ మే 21న ప్రారంభమైన యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 రోజులపాటు 26 ఇతివృత్తాలతో థీమ్ యోగా కార్యక్రమాలు ప్రారంభమైనట్లు వివరించారు. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు.. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేసేందుకే ఈ థీమ్ యోగాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 104 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ప్రతిజిల్లాలో నాలుగైదు చొప్పున పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం రెండుకోట్ల మందికి యోగాలో ప్రవేశం కల్పించాలనే యోగాంధ్రను నిర్వహిస్తున్నామని, గ్రామ/వార్డు, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందని.. రాష్ట్రస్థాయి విజేతలు జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో గౌరవ ప్రధానితో ఇంటరాక్ట్ కానున్నారని స్పెషల్ సీఎస్ కృష్ణబాబు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో దాదాపు 15 లక్షల మందికి యోగాను నేర్పే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయానికి ఏడుగురు చొప్పున దాదాపు దాదాపు అయిదువేల మంది ట్రైనర్లతో ప్రజలకు యోగాసనాలు నేర్పించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. యోగా ప్రయోజనాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలు తమ జీవనశైలిలో యోగాను భాగం చేసుకొని జీవితాంతం అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. విజయవాడలో బీఆర్‌టీఎస్ రోడ్డును యోగా స్ట్రీట్‌గా గుర్తించి, ప్రతిరోజూ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామ ప్రదర్శన, మెడిటేషన్, యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే, యోగా క్విజ్, యోగా పోస్టర్, స్లోగన్ తదితరాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

# కూటమి ప్రభుత్వమొచ్చాక ఆయుష్ బలోపేతం

## - వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్



**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వం ఆయుష్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఆయుష్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంతో పాటు వారికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పర్యాటక విధానానికి రూపకల్పన చేసిందని ఆయన చెప్పారు. కేంద్ర పర్యాటక శాఖతో నిరంతరం కూటమి ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ సోమవారం చెన్నయ్ లో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల మంత్రులు, అధికారుల రెండవ ఆయుష్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఆయుష్ ఆధారిత ఆరోగ్య పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా గతేడాది సెప్టెంబరులో ముంబయిలో మొదటి సదస్సును నిర్వహించింది. చెన్నైయ్ లో జరిగిన రెండవ సదస్సు ఇప్పుడు నిర్వహిస్తుంది.ఇందులో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మహానంది, బెలుం గుహల వంటి పర్యాటక కేంద్రాలతో పాటు సుదీర్ఘమైన సముద్ర తీరం కూడా ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ సముద్ర తీరం వున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకించి 960 కిలో మీటర్ల సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉందన్నారు. దీంతో పాటు అత్యంత సుందరమైన బీచ్ లు కూడా ఏపీలో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం కొత్త పర్యాటక విధానాన్ని రూపొందించిందన్నారు. ఈ కొత్త విధానంలో ఆయుష్ వెల్నెస్ వంటి అంశాలను సమ్మిళితం చేశామన్నారు. రాష్ట్రంలో పర్యాటకులను యాత్రా స్థలాలకన్నా మిన్నగా పర్యాటక కేంద్రాలు ఆకర్షిస్తున్నాయన్నారు. రాష్ట్ర పర్యటనకొచ్చే వారిలో దేశీయ పర్యాటకులతో పాటు అంతర్జాతీయ పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో యాత్రా స్థలాలతో పాటు పర్యాటక కేంద్రాలను కూడా విస్తరించి అక్కడ పర్యాటకుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన ఆయుష్ వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు.

27-5ffffffffE.qxd:27-5P g7exHMNWJQE.qxd 01/01/01 10:16 AM Page 1



## 28న ఆర్జీయుకెటి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

### ఆరేళ్ల బిటెక్ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఒకే ఒక్క ట్రిపుల్ ఐటీ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో ప్రవేశాలకు ఈ నెల 28(బుధవారం)న నోటిఫికేషన్ వెలువడనుంది. బాసర లోని ఆర్జీయూకేటీలో 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ ప్రోగ్రాం ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను 28 విడుదల చేయాలని నిర్ణయించినట్లు యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ తెలిపారు. ఆర్జీయూకేటీలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను 28న విడుదల చేయనున్నామని, ప్రవేశాలకి సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచబడుతుందని వీసి తెలి పారు. వివరాలకు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ ఏడాది నుంచి ఆర్జీయూకేటీలోని 1500 సీట్లతోపాటు అదనంగా మరో కొత్త కోర్సులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తోపాటు డాటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులను ప్రారంభించాలని... ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 180 సీట్లలో అడ్మిషన్లను తీసుకోనున్నట్లు తెలిసింది.

## తెలుగు వర్సిటీ రెగ్యులర్ కోర్సుల ప్రవేశం

**హైదరాబాద్ (నాంపల్లి), మే 26, ప్రభాతవార్త:** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025 విద్యాసంవత్సరానికిగాను వివిధ రెగ్యులర్ కోర్సుల ప్రవేశ ప్రకటనను సోమవారం విడుదల చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించే శిల్పం-చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, శాస్త్రీయ నృత్యం (కూచిపూడి, ఆంధ్రనాట్యం), జానపదం, తెలుగు, చరిత్ర, పర్యా టకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా కోర్సుల కొరకు ఎం.ఎ; డిగ్రీ; డిప్లొమా; సర్టిఫికెట్ ప్రోగ్రాంలలో అర్హత కలిగిన ఆశక్తిగల విద్యార్థుల ప్రవేశం కోసం విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతుంది. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్లు డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.తెలుగుయూనివర్సిటీ.ఏసి.ఇన్; డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. పిఎస్‌టి యుసెట్.ఓఆర్‌జి (ఆర్గ్)లను సందర్శించాలని, పూర్తిచేసిన దరఖాస్తులను తేదీ 24-6-2025లోగా సాధారణ రుసుముతో; తేదీ 30-6-2025 వరకు ఆలస్య రుసుముతో స్వీకరించడం జరుగుతుందని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఈ ప్రకటనలో తెలిపారు.

## స్కిల్ వర్సిటీ నిర్మాణానికి ఒక్క గోడైనా కనీసం నిర్మించారా?

### బిజెపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమరనాథ్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 16 నెలలుగా ఒక్క సిమెంట్ బస్తా వినియోగించని దుస్థితిలో ఉన్నారని, యంగ్ ఇండియా నా బ్రాండ్ అని చెప్పుకుంటూ స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి కనీసం ఒక్క గోడైనా కట్టించారా? బిజెపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమరనాథ్ సారంగులు ప్రశ్నించారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి చేయలేక కేంద్రం ఏం చేయలేదు, మోదీ ఏం ఇవ్వలేదంటూ పిచ్చి ఆరోపణలు చేయడం తప్ప సీఎం దగ్గర ఇంకేటి లేదన్నారు. హైదరాబాద్ నగరానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. జీహెచ్ఎంసి పరిధిలో 100 కోట్లకు ఎకరం విలువైన ప్రాంతాల్లో రోడ్ల మీద గుంతలే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినా, జీహెచ్ఎంసికి కేవలం రూ.3000 కోట్లు కేటాయించి, వాటిని కూడా పూర్తిగా వినియోగించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. ఇటీవల పాతబస్తీ చార్మినార్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. అగ్నిమాపక శాఖకు కేటాయించిన మొత్తం బడ్జెట్ కేవలం రూ.10 కోట్లు అన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన గంటన్నర తర్వాత ఫైర్ సిబ్బంది వచ్చారు. ఇదేనా గవర్నెన్స్ అన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధి బోటిలేదు. వారి పాలన అంటే డిక్లరేషన్, కాల్పుల వేతలు, రైతు ఆత్మహత్యలు అన్నారు. హైదరాబాద్ నగరంలో అభివృద్ధి చేయకుండా 'పేద ఇళ్లను కూల్చడం తప్ప ఇంకేటి కనిపించడంలేదన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక్క పార్క్ అయినా కట్టించారా, ఒక్క చెరువు అయినా పునరుద్ధరించండి అంటూ సవాల్ విసిరారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బండ ప్రకాశ్, హరీశ్‌రావు

## ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### లేదంటే యుద్ధానికి సిద్ధమవుతాం

### శాసనమండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాష్

**నంగునూర్, మే 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సర్కారు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. హామీలు నెరవేర్చకుంటే యుద్ధానికి సైతం సిద్ధ మవుతామని శాసన మండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం పాలమాకులలో సోమవారం పండుగ సాయన్న ముదిరాజ్,కొరవి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాలను మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 యేళ్లు అయినా పేద ముదిరాజ్‌ల సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కెసిఆర్ హయాంలోనే మత్స్యకారులకు న్యాయం జరిగిం దన్నారు. తెలంగాణ ఉద్యమ ప్రముఖుల విగ్రహాలను పెట్టుకొని గుర్తు చేసుకుంటున్నామన్నారు. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ అందాల పోటీల నిర్వహణకు ప్రభుత్వం వద్ద పైసలు ఉన్నాయి కానీ రైతులకు విత్తనాలు, మత్స్యకారులకు చేపపిల్లలు ఇవ్వడానికి మాత్రం పైసలు లేవట అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ శ్రేణులు జాప క్రాంత్‌రెడ్డి, రాగుల సారయ్య, ఎల్ల సోమిరెడ్డి, దువ్వల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కిన ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ అరుణ

**ఖమ్మం రూరల్, ప్రభాతవార్త:** ఖమ్మం రూరల్ మండలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో ఏసీబీ డీస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి నుండి 30,000 లంచం తీసుకుంటు రూరల్ సబ్ రిజిస్ట్రార్ అరుణ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఓ డాక్యుమెంట్ రైటర్ ద్వారా గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం 50 వేల రూపాయలు డిమాండ్ చేసి 30 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపారు. మొదట యాభై వేలు డిమాండ్ చేసి 30 వేల రూపా యలు తీసుకునేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

# ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు భేష్



### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు సమర్థతను నిరూ పించుకున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం సచివాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ జెండర్లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 6 నెలల క్రితం ప్రయోగా త్మకంగా మహిళా శిశు సంక్షేమ, వృత్తిలో దివ్యాం గులు ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా 44 మందిని ట్రాఫిక్ అసిస్టెం ట్‌గా నియమించిన ప్రభు త్వం.. దేశంలో మొట్ట మొదటిసారిగా ట్రా ఫిక్ అసిస్టెంట్‌గా ట్రాన్స్ జెండర్లు 10 రోజుల్లోనే ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్‌లో నియ మించి రికార్డు సృష్టించిం దన్నారు. గత ఆరు నెలల్లో సకాలంలో విధులకు హాజరై తమ అంకిత భావాన్ని ప్రదర్శించారని, ఎంతో క్లిష్టమైన ట్రాఫిక్ డ్యూటీని క్రమశిక్షణతో నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్‌లను నియ మించామన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ ఉద యపూర్‌లో నిర్వహించిన చింతన్ శివిర్‌లో తాను ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు చెప్పారు. పోలీస్ శాఖ లోనే కాకుండా ఇతర శాఖలో కూడా ట్రాన్స్ జెండర్‌లను నియమించే ఆలోచనతో సిఎం ఉన్నట్లు తెలిపారు. పోలీస్ డ్రెస్‌లో ట్రాన్స్ జెండర్ లను చూసి సామాన్యులు సెల్యూట్ కొడుతు న్నారన్నారు. కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకొని తోటి ట్రాన్స్ జెండర్‌లలో నమ్మకం కలిగించాలని, ప్రభుత్వ సహాయాన్ని అందుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ట్రాన్స్‌జెండర్‌ల ఆరోగ్య పరిరక్షణ కోసం త్వరలో మరిన్ని మైత్రి క్లినిక్లను ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అసిస్టెంట్లుగా తమకు అవ కాశం కల్పించిన మంత్రి సీతక్కను, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్‌ను ట్రాన్స్‌జెండర్లు సన్మానించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్య దర్శి అనిత రామచంద్రన్, వృద్ధులు, దివ్యాం గులు ట్రాన్స్ జెండర్ల శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ, ప్రముఖ రచయిత్రి, మహిళా హక్కుల నేత కొండవీటి సత్యవతి, ప్రజ్వల ఫౌండేషన్ ప్రతి నిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ వల్లనే దేశంలో సాకారం కానున్న కులగణన

### దేశంలో విస్తృత కులగణనకు కేంద్రం రూ.8వేల కోట్లు కేటాయించాలి

### అఖిల భారత కాంగ్రెస్ ఒబిసి రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి పొన్నం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌గాంధీ వల్లనే దేశంలో కులగణన సాకారం కాబోతుందని తెలంగాణ బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తమ ఒత్తిడి వల్లనే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టా లని నిర్ణయం తీసుకుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కాంగ్రెస్ పార్టీ ప్రణాళికను సిద్ధం చేసుకుంటోంది. అందులో భాగంగా సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓబీసీ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో ఏఐసిసి నాయకులు, పిసిసి అధ్యక్షులు, ఓబిసి మంత్రులు, బిసి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వల్లన దేశంలో కులగణన సాకారం కాబోతుందని.. రాహుల్ గాంధీకి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపడం, తదుపరి కార్యాచరణ ఖరారు చేసుకోవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నేతలు, ప్రజా ప్రతినిధులు సమావేశమ య్యామని తెలిపారు. రాహల్ గాంధీ డిమాండ్ చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం వల్లనే కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగ కుల గణనకు నిర్ణయం తీసుకుంద న్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లను మోదీ ప్రభుత్వం కేటాయించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.అయితే దేశంలో కుల గణన చేసేందుకు సుమారు రూ.8 వేల కోట్ల రూపాయలు అవసరమని అంచనా ఉందని మంత్రి పొన్నం తెలిపారు. కులగణన పూర్తికి నిర్దిష్ట కాలపరిమితి కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించలేదని.. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాలని.. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓబీసీ నేతల అభిప్రాయం తీసుకున్నామని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. లక్షలాది మందితో పెద్ద ఓబీసీ ర్యాలీని కూడా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం చేసిన కులగణన గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కులగణన అనంతరం సామాజిక న్యాయం జరిగేలా రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని దానికి అన్ని పార్టీలు మద్దతు ఇచ్చారని మంత్రి పొన్నం తెలిపారు.

# నకిలీవిత్తన సరఫరాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

### డిజిపికి ఫిర్యాదు చేసిన బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలపై మనీలాం డరింగ్ యాక్ట్, అలాగే యజమానులపై పిడియాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన గిరిజన రైతులకు న్యాయం కల్పించాలంటూ బిజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర బృందం డిజిపిని కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా డా. కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా ఎస్ఐఎంజెఎన్‌టివి, హైటెక్, భేయర్, ఎస్ఐబిఐ వంటి కంపెనీలు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతోనే ఈ మోసాలు జరుగుతున్నా యన్నారు. నాణ్యమైన విత్తనాలపై భరోసా ఉంచిన గిరిజన రైతులు పూర్తిగా నష్టపోయారు. అప్పుల్లో కూరుకుపోయిన కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇది కేవలం వ్యవసాయ విఫలం కాదు – అమాయక గిరిజ నులపై అవినీతి రాష్ట్ర ప్రభుత్వ కుట్ర. బాధ్యులైన కంపెనీలపై పీడియాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి. రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇటువంటి మోసాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవా లన్నారు. 3000 ఎక రాలు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి 800 వందల మంది గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాని డిమాండ్ చేశారు. చనిపోయిన 5 గురు రైతుల కుటుం బాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు. బాధ్యులైన ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా నియంత్రణ చర్య లు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాల న్నారు. మంత్రి సీతక్కకు ఇసుక క్వారీలపై ఉన్న శ్రద్ధ, అందాల పోటీలపై ఉన్న ఆసక్తి గిరిజన రైతుల ఆత్మహత్యలపై ఏమాత్రం లేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి సైతం ఈవిషయంలో స్పందించలేదని, ముఖ్యమంత్రి సమీక్షలు చేస్తున్నా, గిరిజన రైతుల విషయంలో పూర్తిగా విస్మరించారన్నారు. మంత్రివర్గంలో ఒక్క గిరిజన మంత్రిని కూడా నియమించని ఈ ప్రభుత్వ ధోరణి గిరిజనుల పట్ల అవమానకరంగా ఉందిని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిపిని కలిసిన ఎస్‌టి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శ రవి నాయక్ నేనావత్, రాష్ట్ర కార్యదర్శి కుంజా సంతోష్, మహేష్ రూపావత్, బానోత్ అనూష, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగం రక్షణకు చర్యలు తీసుకోవాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యత గల చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంతోనే పుట్టిన చేనేత వృత్తి పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాను రాను నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగానికీ ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు వృత్తి ఆధునీకరించి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు చేనేత రంగాన్ని పరిరక్షించాలని.. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చింది. సంఘం గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావుతోపాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, చేనేత రంగ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతా రాములు, పద్మశాలి సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, చేనేత సం ఘాల నాయకులు కర్నాటి ధనంజయ, దేవాదాసు, రాపోలు జగన్ తదిత రులు పాల్గొన్నారు. సమావేశంలో కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ఎస్ సబ్ తరహాలో బిసిలకు సైతం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటా యించాలన్నారు. తద్వారా కుల వృత్తుల పరి రక్షణకు.. వృత్తుల వారికి నిధులను కేటాయించి వాటిని ఆధునీకరించి వాటిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో చేనేత సహకారా సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించా లన్నారు. ఎన్నికలకి ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం వాటిని దాటే వేసే ప్రయత్నం చేస్తోందని విమ ర్శించారు. చేనేత రంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులందరూ ఒక్క తాను ముక్కలేనని, ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప వారికి వృత్తిదారుల సమస్యలను పరిష్కారించాలనే చిత్తశుద్ధి లేద న్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి శాసనమండలి వేదికగా తన గళాన్ని వినిపిస్తానని, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతోపాటు ఈ ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు సంఘాలన్నీ సంఘటితం కావాలన్నారు.




సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

# సుపరిపాలనకు సమగ్ర కులగణనే కీలకం : కేసన శంకరరావు

**మంగళగిరి, మే 26, ప్రభాతవార్త:** సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం సక్రమంగా అందించి,సామాజిక అభివృద్ధి సజావుగా జరిగేలా, జనరంజక సుపరిపాలనను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అందించాలంటే, ఈసారి జనగణనతో పాటు సమగ్ర కుల గణన జరపడమే కీలకమని,ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రజలందరినీ వారి వారి కులాలతో సహా లెక్కించడం ద్వారా,ఆయా కులాల జనాభా ఎంతెంత ఉంది?... వారిలో ఎందరు సామాజిక,ఆర్థిక, రాజకీయ,విద్యా ఉద్యోగ రంగాలలో ఏ మేరకు వెనుకబడి ఉన్నారు?.... అనే అంచనాలు వేయడానికి ప్రభుత్వాలకు ఉపయోగపడుతుందన్నారు. దానితో దేశంలోని అన్ని కులాల ప్రజలందరినీ సమాన స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రచించడం,వివిధ పథకాలు ప్రభుత్వ విధానాల ద్వారా దేశాభివృద్ధికి దోహదమవుతుందన్నారు.2047 విజన్"వికసిత భారత్"తో పాటు రాష్ట్రంలో"విజన్ స్వర్ణాంధ్ర" సాధనతో ప్రపంచంలోనే మరో అగ్రరాజ్యంగా భారత్ అవతరించే అవకాశాలు మెరుగవుతాయన్నారు.అనాదిగా భారత్ లో ఆధిపత్యకులపెత్తందారీ వర్గాలు అణగారిన కులాల వారిని నిరంతరం అణిచివేతకు,దోపిడీకి, పీడనకు గురిచేస్తూ, వెనుకబడిన తరగతులుగా మార్చేశాయన్నారు. దానితో అన్ని రంగాలలో వివక్ష అసమానతలు తీవ్రతరమయ్యాయన్నారు. అలా సామాజిక అన్యాయానికి గురైన అట్టడుగు వర్గాలకు,సమన్యాయ మందించి,దేశంలో సమానత్వ సాధన ద్వారా దేశాభివృద్ధికి కులగణన చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు.

మనువాదుల పుణ్యమా అంటూ ఈ దేశంలో ప్రతి ఒక్కరికి ఏదో ఒక కులం పేరుతో గుర్తింపు ఉండడం వల్లనే,భారతీయ సమాజాన్ని కుల సమాజంగా రాజనీతిజ్ఞులు భావిస్తున్నారన్నారు. ఆనాటి బ్రిటిష్ ఇండియా పాలకులు పదేళ్లకు ఒకసారి 1931 వరకు, జనగణనతో పాటే కులగణన నిర్వహించారని, కానీ భారత పాలకులు మాత్రం నాటి నుండి నేటి వరకు జనగణన తో పాటు సమగ్ర కుల గణన చేయలేదన్నారు. ఈ విషయమై ఇప్పటివరకు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాటగా మేనమేషాలు లెక్కిస్తూ వచ్చాయన్నారు. ఓబీసీల సమరశీల పోరాటాలు ఒకపక్క, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ మరో పక్క ఓబీసీలలో పోరాట చైతన్యం నింపడంతో, బెంబేలెత్తిన కేంద్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కులగణనకు ఒప్పుకోవడం సంతోషదాయకమన్నారు. కేంద్రంతో పాటు,అన్ని రాజకీయ పార్టీలు కుల గణనకు అంగీకరించడం ద్వారా, దేశంలో సుపరిపాలనకు నాంది పలికినట్ల యిందన్నారు. అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయ మందించేందుకే కుల గణనని, కుల,మత,ప్రాంత,భాష, రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలుసామాజిక వర్గాలు భావించడం శుభ పరిణామ మన్నారు.అందులో భాగమే నిన్న ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉపముఖ్యమంత్రులచే జరిగిన అత్యున్నత సమావేశమన్నారు. దేశంలో సుపరిపాలన నందించేందుకు, చేపట్టనున్న సమగ్ర కుల గణనను ఏ మేరకు ఉపయోగించుకోవాలో,ఆ సమావేశంలో చర్చించడాన్ని దేశ ప్రజలందరితో పాటు, ముఖ్యంగా బీసీ సమాజం హర్షిస్తుందని శంకరరావు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



## త్వరలో ఎస్ఆర్ఒ కార్యాలయాల్లో ఆధార్ ఇ-సంతకం

### పైలట్ ప్రాజెక్టుగా కూసుమంచి కార్యాలయాల్లో..

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** అవినీతిరహితంగా, పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువస్తున్న నేపథ్యంలో ఆధార్ ఇ సంతకం కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువరావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధార్ ఇ-సంతకం వల్ల 10 నుంచి 15 నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి స్లాట్ బుకింగ్ విధానం, పనిభారం అధికంగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగ్‌లపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామని, ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే అమల్లోకి తీసుకు వస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్ఆర్ఒలను నియమించారు. అవినీతికి దూరంగా ప్రజలకు మెరుగైన సేవ లందిస్తూ ప్రభుత్వ పేరుప్రతిష్టలు పెంచేలా సబ్‌రిజిస్ట్రార్ల పనితీరు ఉండాలన్నారు.




సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

## రైతులను పట్టించుకోని ప్రభుత్వం

### ఇప్పటికే 442 మంది కర్షకులు చనిపోయారు

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ఎద్దు ఏడిస్తే రైతులు ఎంతగానో బాధపడతారని, అలాంటి రైతు ఏడిస్తే మన రాష్ట్రం కూడా బాధపడుతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల దుస్థితిపై పట్టించుకోలేదని మండిపడ్డారు. సుమారు 30 లక్షల టన్నులు వరిధాన్యం తడిసి పోయిందని, ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 51 ఏళ్ల గుగ్గులోత్ కిషన్, సూర్యాపేట అన్నారం గ్రామంలో రైతు ఉప్పల వెంకన్న, జనగాం వెల్ది గ్రామంలో యాదగిరి వంటి రైతులు నష్టాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 442 మంది రైతులు చనిపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పంటకు 2320 రూపాయల ఎంఎస్‌పి అందిస్తుందని, పంట కొనుగోలు ఖర్చు అంతా కేంద్రమే భరిస్తుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు పని కల్పించకుండా, పంట కొనుగోలు సరిగ్గా జరపకుండా రైతులను ఇబ్బంది పెడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ ఇస్తూ, 10 రకాల పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, రైతులను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏవీ అమలు చేయకుండా రైతులను, మహిళలను, విద్యార్థులను, యువకులను మోసం చేసిందన్నారు.

## నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి

### కాల్పుల విరమణ తక్షణమే ప్రకటించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** దేశంలోని నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని.. కాల్పుల విరమణను తక్షణమే ప్రకటించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు. నక్సలైట్లపై కాల్పుల విరమణ తక్షణమే ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే నక్సలైట్లు రాసిన లేఖ ప్రకారం కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అర్థమవుతుందనితెలిపారు. నక్సలైట్లు .. టెర్రరిస్టులు కాదని వారు మన దేశ పౌరులని అన్నారు. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌తో చర్చలు జరిపినప్పుడు మన దేశ పౌరులైన నక్సలైట్లతో శాంతి చర్చలు జరపడం పెద్ద కష్టమేమీ కాదని.. ఆటంకం ఏమి రాదని నారాయణ అన్నారు. సిద్ధాంతపరమైన విభేదాలే తప్ప మరొకటి కాదని, రెండు తుపాకి గొట్టాల ద్వారా సమస్య పరిష్కారం కాదని.. రాజకీయ చర్చలు జరిపి శాంతి ఒడంబడికకు రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని నారాయణ కోరారు.

27-5pg10exH.qxd:27-5pg10exH.qxd 01/01/01 9:21 AM Page 1



# ఐపిఎల్‌లో.. కాస్ట్లీ స్టార్లు ఫెయిల్యూర్


## రూ.కోట్లతో కొన్నా ఫలితం సున్నా చెత్త ప్రదర్శన చేసిన టాప్ 5 ప్లేయర్లు



గ్లెన్ మాక్స్‌వెల్



రిషబ్ పంత్



మహమ్మద్ షమీ



రచిన్ రవీంద్ర

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్ ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. అభిమానులు ఇప్పటివరకు చాలా ఉత్తేజకరమైన మ్యాచ్‌లను చూశారు. చాలా మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు తమ పేలుడు ఆటతో అందరి హృదయాలను గెలుచుకున్నారు. క్రికెట్ ప్రేమికులు అద్భుతమైన ప్రదర్శనను ఆశించిన చాలా మంది ఆటగాళ్ళు ఉన్నారు. కానీ వారు ఆ అంచనాలను చేరుకోలేకపోయారు. ఐపిఎల్ 2025కి ముందుజరిగిన మెగావేలంలో భారీ ధరకు అమ్ముడు పోయిన కొంతమంది స్టార్ ఆటగాళ్లు మైదానంలో ఫెయిల్ అయ్యారు. వీరు తమ టీమ్స్‌కు భారంగామారిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈజాబితాలో ఉన్న టాప్ 5 టీమిండియా క్రికెటర్స్ కూడా ఉన్నారు. 65 మ్యాచ్‌ల తర్వాత ఈ ఐపీఎల్‌లో అత్యంత చెత్త ప్రదర్శనగా నిలిచిన ఐదుగురు ఆటగాళ్లలో రిషబ్ పంత్ ఒకడు. ఈ ఐపిఎల్ ప్రారంభానికి ముందు, అందరి దృష్టి టీం ఇండియా ఆశాజనక వికెట్ కీపర్ రిషబ్ పంత్ పైనే ఉంది. పంత్ కోసం అన్ని జట్ల మధ్య పోటీ నెలకొంది. కానీ లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రికార్డు స్థాయిలో రూ.27 కోట్లకు వేలం వేయడం ద్వారా అతనిని తమ ఫ్లీట్‌లో చేర్చుకోవడంలో విజయవంతమైంది. కానీ మైదానంలో ప్రదర్శన విషయానికి వస్తే, పంత్ అందరినీ తీవ్రంగా నిరాశ పరిచాడు. రిషబ్ పంత్ లాగే, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ గ్లెన్ మాక్స్‌వెల్ కూడా ఈ ఏడాది అత్యంత చెత్తగా ఆడాడు. వేలంలో గ్లెన్‌మాక్స్వెల్‌పై నమ్మకం ఉంచి, పంజాబ్ కింగ్స్ ఫ్రాంఛైజీ రూ.4.20 కోట్లకుకొన్నది. కానీ అతను బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఘోరంగా విఫలమయ్యాడు. గాయం కారణంగా వైదొలగడానికి ముందు అతను తన జట్టు తరపున మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడాడు. మహ్మద్ షమీ గాయం తర్వాత తిరిగి వచ్చిన టీం ఇండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి ఈ ఐపిఎల్ 18వ సీజన్ ప్రత్యేకం అంటూ ఏమీ లేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరపున తొమ్మిది మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. అతను తొమ్మిది ఇన్నింగ్స్‌లో 56.16 సగటుతో ఆరు విజయాలు మాత్రమే సాధించాడు. ఇక గతేడాదిఅద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి హృదయాలను గెలుచుకున్న ఆస్ట్రేలియా యువ బ్యాట్స్‌మన్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ బ్యాట్ కూడా ఈ ఏడాది మాత్రం రాణించలేకపోయాడు. ప్రస్తుత ఐపిఎల్‌లో అతను తన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తరపున మొత్తం ఆరు మ్యాచ్‌ల్లో పాల్గొ న్నాడు. అతను ఆరుఇన్నింగ్స్‌లో 9.17 సగటుతో 55 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కాగా ఈఏడాది న్యూజిలాండ్ క్రికెట్ జట్టు ఆశాజనక ఆట గాడు రచిన్‌రవీంద్ర ప్రదర్శన కూడా అంతగా లేదనే చెప్పవచ్చు. అతను చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఎనిమిదిమ్యాచ్‌ల్లో ఆడాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లో 27.29 సగటుతో 191 పరుగులు మాత్రమే చేయగలిగాడు.




# ఫార్ములా రేస్ విజేత కుష్ మైనీ

## చరిత్ర సృష్టించిన ఇండియన్

**న్యూఢిల్లీ:** ఫార్ములా ఎఫ్ 2 రేస్-2025 చరిత్రలో తొలిసారి భారతీయుడు చరిత్ర సృష్టించాడు. 25 ఏళ్ల భారత యంగ్ రేసర్ కుష్ మైనీ విజేతగా నిలిచాడు. ఫార్ములా ఎఫ్ 2 స్ప్రింట్ రేసింగ్‌లో విజయం సాధించిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కాడు. మొనాకోలోని కోట్ డి అజుర్‌లో భారత్ కాలమానం ప్రకారం సోమవారం జామున జరిగిన ఈ స్ప్రింట్ రేసులో కుష్ తొలి స్థానంలో నిలిచాడు. దీంతో, మొనాకోలో టాప్‌లో నిలిచిన ఏకైక భారతీయ రేసర్‌గా అరుదైన ఘనత సాధించాడు. ఫార్ములా 2 యొక్క రివర్స్‌గ్రిడ్ నియమం ద్వారా మైనీ స్ప్రింట్ రేసును పోల్ పొజిషన్ నుండి రైడ్ ప్రారంభించి, దాదాపు 30 ల్యాప్‌ల్లో లీడ్‌లో కొనసాగాడు. తన ప్రత్యర్థి గాబ్రియేల్ మినీ నుంచి తీవ్ర పోటీ ఎదురైనప్పటికీ కుష్ నిలకడగా రాణించి, రేసు పూర్తి చేశాడు. అతడు 44:57.63 నిమిషాల్లోనే రైడ్ కంప్లీట్ చేశాడు. ఇక తన విజయం పట్ల కుష్ సంతోషం వ్యక్తం చేశాడు. తనకు మద్దతుగా నిలిచి వారందరికీ ధన్యవాదాలు తెలిపాడు. ఇక ఈ తాజా విజయంతో కుష్ తదుపరి ఫీచర్ పి-10 రేసుకు కూడా అర్హత సాధించాడు. కాగా 2024లో బుడాపెస్ట్ స్ప్రింట్ రేస్‌లో కుష్ మైనీ తన తొలి విజయాన్ని సాధించాడు. అతని విజయం ఎఫ్2 స్ప్రింట్ ఫార్మాట్‌లో అతని మూడవ ప్రచారాన్ని సూచిస్తుంది. ఎంపి మోటార్‌స్పోర్ట్‌తో 2022 ఎఫ్ఐఎ ఫార్ములా 3 డ్రైవర్స్ ఛాంపియన్‌షిప్‌లో 13వ స్థానంలో నిలిచిన తర్వాత ఈ భారత డ్రైవర్ ఫార్ములా 2కి చేరుకున్నాడు. అతని సింగిల్ సీటర్ ప్రయాణం 2016లో ఇటాలియన్ ఎఫ్4తో ప్రారంభమైంది, ఆ తర్వాత 2018లో బ్రిటిష్ ఎఫ్3లో మూడవ స్థానంలో నిలిచింది మరియు 2020లో రన్నరప్‌గా నిలిచింది. ఈ మార్గంలో, మైనీ ఎఫ్3 ఆసియా సిరీస్‌లో కూడా అనుభవాన్ని పొందాడు.

# ఫోర్ నేషన్స్ హాకీ టోర్నీలో.. భారత్ మహిళా టీమ్‌కే రెండో మ్యాచ్

## ఉరుగ్వేపై 3-2 తేడాతో విజయం



**న్యూఢిల్లీ:** నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీలో భారత్ దూసుకుపోతోంది. ఫోర్ నేషన్స్ టోర్నమెంట్‌లో భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు తన రెండో మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో విజయం సాధించింది. అర్జెంటీనాలోని రోసారియోలా జరిగిన ఈ మ్యాచ్‌లో కనికా డబుల్ గోల్స్ సాధించింది. కనికా (46వ నిముషం, 50వ నిముషం) సోనమ్ (21వ నిముషం) భారత్ తరపున గోల్ చేయగా, మిలాగ్రోస్ సీగల్ (3 నిముషం), అగస్టినా మారి (24 నిముషం) ఉరుగ్వే తరపున గోల్స్ చేశారు. ఆట ప్రారంభం నుంచి మూడో నిమిషంలోనే మిలాగ్రోస్ సీగల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచడంతో ఉరుగ్వే తొలి ఆధిక్యంలో నిలిచింది. రెండవ క్వార్టర్‌లో, 21వ నిమిషంలో సోనమ్ పెనాల్టీ కార్నర్‌ద్వారా గోల్ చేయడంతో భారతదేశం ఈక్వలైజర్‌ను సాధించింది. అయితే, కేవలం మూడు నిమిషాల తర్వాత, అగస్టినా మారి పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేయడంతో ఉరుగ్వే తిరిగి ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ చివరి దశలో కనికా సివాచ్ కీలకమైన బ్రేస్ గోల్స్ చేసి భారత్ విజయం సాధించడంలో సహాయపడింది. ఆమె మొదట 46వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్‌చేసింది, ఆ తర్వాత 50వ నిమిషంలో నిర్ణయాత్మక ఫీల్డ్ గోల్ చేసి విజయాన్ని ఖరారు చేసింది. కాగా భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు తన తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 27వ తేదీన ఆతిథ్య అర్జెంటీనాతో తలపడనుంది.

# క్వలాండర్స్‌కు పాక్ సూపర్ లీగ్ టైటిల్

## 6 వికెట్ల తేడాతో గ్లాడియేటర్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** జింబాబ్వే ఆల్ రౌండర్ సికందర్ రాజా స్టన్నింగ్ ఆటను ప్రదర్శించాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో లాహోర్ క్వలాండర్స్ జట్టు తరపున అతను వీరవిహారం చేశాడు. కేవలం 7 బంతుల్లో 22 రన్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వాస్తవానికి పిఎస్‌ఎల్ ఫైనల్ మ్యాచ్ కోసం టాస్ వేయడానికి 10 నిమిషాల ముందే అతను లాహోర్ స్టేడియం చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆడిన సికందర్ రాజా బర్మింగ్‌హామ్ నుండి ఆగమేఘాల మీద లాహోర్ చేరుకుని లాహోర్ జట్టుకు టైటిల్ అందించాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫైనల్లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన క్వెట్టా గ్లాడియేటర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 రన్స్ చేసింది. ఆ జట్టులో నవాజ్ 76 రన్స్ చేశాడు. ఆ తర్వాత భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన లాహోర్ జట్టుకు మరో బంతి మిగిలి ఉండగా విజయాన్ని అందుకున్నది. లాహోర్ టీమ్‌లో పెరీరా 62, నహీమ్ 46, షఫీక్ 41, రాజా 22 రన్స్ చేశారు. ఆరు వికెట్ల తేడాతో లాహోర్ గెలిచింది. ఈ మ్యాచ్‌లో సికందర్ రాజా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాడు. 24 గంటల క్రితం ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఆడిన రాజా ఆ మ్యాచ్‌లో 25 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత 20 ఓవర్ల వరకు బ్యాటింగ్ చేశాడు. ఆ మ్యాచ్‌లో జింబాబ్వే ఓటమి పాలైంది. కానీ లాహోర్‌లో జరుగుతున్న పీఎస్‌ఎల్ ఫైనల్ మ్యాచ్‌తో 3 ఓవర్లలో 47 రన్స్ అవసరమైన దశలో బ్యాటింగ్‌కు దిగిన సికందర్ రాజా బ్రేవ్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరకు 3 బంతుల్లో 8 రన్స్ అవసరమైన టైంలో రెండు బౌండరీలు కొట్టి జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. దీంతో లాహోర్ మూడోసారి టైటిల్ చేజిక్కించుకున్నది.

# వెస్టిండీస్ చేతిలో ఐర్లాండ్ చిత్తు

## మూడో వన్డే సిరీస్ సమం



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డే సిరీస్‌ను వెస్టిండీస్ సమం చేసింది. మూడో వన్డేలో డక్ లూయిస్ పద్ధతిన 197 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమమైంది. డబ్లిన్ వేదికగా సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 385 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. విండీస్ ఇన్నింగ్స్‌లో ఫస్ట్ డౌన్ బ్యాటర్ కిస్ కార్టీ అద్భుత సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో 142 బంతులు ఎదుర్కొన్న కార్టీ 15 ఫోర్లు, 8 సిక్స్‌లతో 170 పరుగులు చేశాడు. వెస్టిండీస్ బ్యాటర్లలో కార్టీతో పాటు, కెప్టెన్ షాయ్ హోప్ (75), జస్టిన్ గ్రీవ్స్ (50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఐరిష్ బౌలర్లలో బారీ మెక్‌కార్తీ 3 వికెట్లు పడగొట్టగా, లైమ్ మెక్‌కార్తీ 2, మెక్‌బ్రైన్, డకిరల్ తలా వికెట్ సాధించారు. అనంతరం వర్షం కారణంగా 46 ఓవర్లలో ఐర్లాండ్ లక్ష్యాన్ని 365గా నిర్ణయించారు. భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 29.5 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. ఐర్లాండ్ బ్యాటర్లలో కేడ్ కార్మైకేల్ (48) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విండీస్ బౌలర్లలో జైడన్ సీల్స్ 3 వికెట్లు పడగొట్టి ఐర్లాండ్‌ను దెబ్బతీయగా, జోషఫ్, గ్రీవ్స్, ఛేజ్ తలా వికెట్ సాధించారు.

# టయోటా కార్ల విక్రయాలు భేష్

**ముంబై, మే 26:** టయోటా కంపెనీ భారతదేశంలో ఫార్చ్యూనర్ కార్లనే ఏకంగా మూడు లక్షల యూనిట్లను విక్రయించింది. 2009లో ప్రారంభమైన ఈ కారు ఆ తర్వాత కాలంలోనే అనేక అప్‌డేట్స్ పొందుతూ వచ్చింది. ఇందులో భాగంగానే 2021లో లెజెండర్ వేరియంట్ విడుదలైంది. అంతకంటే ముందు ఫేస్‌లిఫ్ట్ వేరియంట్స్ కూడా లాంచ్ అయ్యాయి. ఫార్చ్యూనర్ ప్రస్తుతం 2.8 లీటర్ డీజిల్, 2.7 లీటర్ పెట్రోల్ అనే రెండు ఇంజిన్ ఎంపికలలో అందుబాటులో ఉంది. డీజిల్ వేరియంట్ 6 స్పీడ్ మాన్యువల్ లేదా 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలను పొందుతాయి. పెట్రోల్ వేరియంట్ 5 స్పీడ్ మాన్యువల్ లేదా స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్స్ పొందుతుంది. లెదర్ సీట్లు, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, క్రూయిజ్ కంట్రోల్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, ఆండ్రాయిడ్ ఆటో అండ్ ఆపిల్ కార్ప్లే కనెక్టివిటీతో కూడిన 8 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, జెబిఎల్ స్పీకర్లు, డ్రైవింగ్ మోడ్‌లు, పార్క్ అసిస్ట్ వంటి ఫీచర్స్ ఫార్చ్యూనర్ కారులో ఉన్నాయి. టయోటా ఫార్చ్యూనర్ ధరల విషయానికి వస్తే, పెట్రోల్ 4/2 ఎటి వేరియంట్ ధర రూ.35.37 లక్షలు. డీజిల్ వేరియంట్ ధర 4/2 ఎంటి ధర రూ.36.33 లక్షల నుంచి రూ.51.94 లక్షల వరకు ఉంటుంది.




# లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు..



**ముంబై, మే 26:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో, మెటల్ స్టాక్స్ అండతో సూచీలు వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభపడ్డాయి. ఈయూతో వాణిజ్య చర్చల గడువును జులై 9 వరకు పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో 50 శాతం టారిఫ్‌ల అమలు వాయిదా పడింది. తాత్కాలికంగా అనిశ్చితులు చల్లారడంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. నిఫ్టీ 25 వేల మార్కు ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,928.95 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే జోరును కొనసాగించింది. ఇంట్రాడేలో 82,492.24 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 455.37 పాయింట్ల లాభంతో 82,176.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 148 పాయింట్ల లాభంతో 25,001 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి 85.10గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.75 డాలర్లు వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,332 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


# డాలర్ డీలా..రూపాయి పైపైకి

**ముంబై, మే 26:** డాలర్‌తో పోలిస్తేరూపాయి విలువ 40పైసలు పెరిగింది. కరెన్సీ 85.02 వద్ద ప్రారంభమై ప్రారంభ ట్రేడింగ్ లో 84.98ని తాకింది. దీనికి డాలర్ విలువ పతనం, ఆసియా కరెన్సీలలో, ముఖ్యంగా చైనీస్ యువాన్‌లో ర్యాలీ మద్దతు ఇవ్వడంతో రూపాయి ధర పెరిగింది. ఇది ఏడు నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. సోమవారం (మే 26)అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 40 పైసలు బలపడి 85.05 వద్ద ప్రారంభమైంది. డాలర్‌లో విస్తృత బలహీనత దేశీయ ఈక్విటీలు బలంగా ఉండటం వంటి కారణాలతో శుక్రవారం (మే 23) నుండి లాభాల వైపు రూపాయి ప్రయాణించింది. భారత కరెన్సీ 85.02 వద్ద ప్రారంభమై ప్రారంభ ట్రేడింగ్‌లో 84.98ని తాకింది. దీనికి డాలర్ విలువ పతనం, ఆసియా కరెన్సీలలో, ముఖ్యంగా చైనీస్ యువాన్‌లో మార్పులతో రూపాయి విలువ పెరిగింది. ఇది ఏడునెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. రూపాయి విలువను ఏది నడిపిస్తోంది? ప్రపంచ ఆర్థిక ఆందోళనలు, అమెరికా వాణిజ్యంలో హెచ్చుతగ్గులు కారణంగా డాలర్ ఇండెక్స్ 0.34శాతం తగ్గి 98.67కి చేరుకుంది. డాలర్ విలువ తగ్గడంతో ఆసియా కరెన్సీలు అన్ని చోట్ల లాభపడ్డాయి. చైనీస్ యువాన్ డాలర్‌కు 7.1650కి బలపడి ప్రాంతీయ సెంటిమెంట్‌ను పెంచడంలో సహాయపడింది. ప్రభు త్వానికి ఆర్‌బిఐ రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్ ఆర్థిక ఒత్తిడిని తగ్గించడం ద్వారా రూపాయికి మద్దతు ఇస్తూనే ఉంది. శుక్రవారం (మే 23) రూ.1,794 కోట్ల నికర ఈక్విటీ కొనుగోళ్లతో బలమైన ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు భారత మార్కెట్లలో పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రపంచ సంకేతాలు, స్థానిక స్థూల డేటా ద్వారా ఈ వారం రూపాయి 84.9085.30 మధ్యలో ఉంటుందని కరెన్సీ వ్యాపారులు భావిస్తున్నారు. ఏప్రిల్ ఐఐపి, క్యూ1 జిడిపి సంఖ్యలతో సహా కీలకమైన దేశీయ డేటా పాయింట్లు ఈ వారం చివరిలో రానున్నాయి. ఇవి స్వల్పకాలిక సెంటిమెంట్‌ను రూపొందించవచ్చు. శుక్రవారం (మే 23) మార్కెట్ పుంజుకున్నప్పటికీ, ఈ నెలలో ఆసియా కరెన్సీలలో రూపాయి బలహీనమైన వాటిలో ఒకటిగా ఉంది. కొరియన్ వోన్, థాయ్ బాట్, ఇండోనేషియా రూపాయి బలమైన లాభాలను నమోదు చేశాయి. ఇక భారతదేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే జర్మనీని అధిగమించి మూడవ స్థానాన్ని కూడా పొందే అవకాశం ఉందని నీతీ అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం తెలిపారు. నీతీ అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ 10వ సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో భారత ఆర్థిక పురోగతిపై పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇప్పుడు ప్రపంచంలో మనం నాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. భారత్ 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ. భారతదేశం జపాన్ కంటే పెద్దది. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే ముందు ఉన్నాయి. మనం ప్రణాళిక వేసిన, ఆలోచించిన దానికే కట్టుబడి ఉంటే, మనం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి మరో 2 నుండి 3 సంవత్సరాల సమయం మాత్రమే ఉంది అని బీవీఆర్ సుబ్రమణ్యం అన్నారు.



# అధిక-రిస్క్ మొబైల్ నంబర్లపై యుపిఐ లావాదేవీలు బ్లాక్

**ముంబై, మే 26:** భారత ప్రభుత్వం ఒక పెద్ద ప్రకటన చేసింది. ఇప్పటి నుండి అనేక మొబైల్ నంబర్లకు ఆర్‌బిఐ చెల్లింపులు చేయలేరు. దేశంలోని కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆర్థిక మోస ప్రమాద సూచిక సాంకేతికతను ప్రవేశపెట్టింది. ఈ సేవ అన్ని మొబైల్ నంబర్‌లను విశ్లేషిస్తుంది. వాటిలో ఇది అధికరిస్క్ మొబైల్ నంబర్‌లపై యూపీఐ లావాదేవీలను బ్లాక్ చేస్తుంది. దేశంలో ఆర్థిక నేరాలను గుర్తించి నిరోధించడానికి ఈ కొత్త సాధనాన్ని రూపొందించామని ప్రభుత్వం తెలిపింది. దేశంలో సురక్షితమైన ఆర్థిక లావాదేవీలను నిర్ధారించడానికి రూపొందించబడిన ఒక పెద్ద డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లో ఈ కొత్త ఆర్‌బిఐ వ్యవస్థ భాగం అని కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు యూపీఐ లావాదేవీల నష్టాలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. భారతదేశంలోని మొత్తం యూపీఐ లావాదేవీలలో 90 శాతం ఈ ప్లాట్‌ఫామ్‌లకే పరిమితం అయ్యాయి. ఈ ఎఫ్ఆర్ఐ వ్యవస్థ ప్రాథమికంగా ఏదైనా సైబర్ నేరంలో పాల్గొన్న లేదా ధృవీకరణ ప్రక్రియకు ప్రమోట్ చేయబడని లేదా నియంత్రణ సంస్థ నియమాలను ఉల్లంఘించిన మొబైల్ నంబర్‌లను గుర్తిస్తుందని టెలికాం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సాంకేతికత ఈ సంఖ్యలన్నింటినీ రిస్క్ ఆధారంగా ఈ క్రింది విధంగా విభజిస్తుంది. మీడియం, హై, సీరియస్‌లీ హై. ఈ విభజన నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటా ప్రకారం జరుగుతుందని తెలిపింది. ఈ విభజన జాబితా అన్ని వాటాదారులకు రియల్ టైమ్ ప్రాతిపదికన పంపిస్తుంది. ప్రమాదకర మొబైల్ నంబర్లను త్వరగా గుర్తించడం సులభం అవుతుంది. ఒక వ్యక్తి అంత హైరిస్క్ మొబైల్ నంబర్‌లో యూపీఐ లావాదేవీ చేయడానికి వెళితే, ఆ యూపీఐ యాప్ ఆటోమేటిక్‌గా ఆ లావాదేవీలన్నింటినీ ఆపి బ్లాక్ చేస్తుంది. కస్టమర్‌కు మరో హెచ్చరిక సందేశం పంపిస్తుంది. అలాగే యూపీఐ ద్వారా మీడియంరిస్క్ నంబర్‌కు డబ్బు పంపేటప్పుడు కస్టమర్‌లకు హెచ్చరిక సందేశం పంపిస్తుంది. లావాదేవీని మాన్యువల్‌గా పూర్తి చేయమని అడుగుతారు.




# వాణిజ్యం

## ఇండియన్ స్టార్టప్‌తో యమహా జత..

**ముంబై, మే 26:** యమహా కంపెనీ త్వరలో రివర్ ఇండి ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. రాబోయే యమహా ఈవీకు ఆర్‌వై 01 అనే కోడే నేమ్ కూడా ఉంది. రివర్ ఇండి ఈవీ స్కూటర్ మాదిరిగానే బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, పవర్ ట్రెయిన్‌ను ఉపయోగిస్తుందని పలు నివేదికల ద్వారా స్పష్టమైంది. జపాన్‌కు చెందిన యమహా మోటార్ కంపెనీ ఫిబ్రవరి 2024లో రివర్ ఇండి కంపెనీ సుమారు 40 మిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టింది. రివర్ ఇండీ భాగస్వామ్యంతో కొత్త యమహా ఆర్‌వై01 ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ పండుగ సీజన్‌తో ఉత్పత్తి ప్రారంభించి ఈ సంవత్సరం చివరి నాటికి లాంచ్ అవుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త



ఈవీ భారతదేశం, అమెరికా, యూరప్‌లోని యమహా గ్లోబల్ ఇంజనీరింగ్ బృందాలు అభివృద్ధి చేస్తున్నాయి. యమహా డిజైన్ మరియు బ్రాండ్ ఎథోస్‌తో వచ్చే ఈ స్కూటర్ లాంచ్ అయినా ఇంజనీరింగ్, టెస్టింగ్, పరిశోధన, అభివృద్ధి, అన్నీ రివర్ కంపెనీ ద్వారా నిర్వహిస్తారు. డిజైన్ ఫైనల్ అయిన తర్వాత యమహా ఆర్‌వై ఈవీ స్కూటర్‌ను బెంగళూరులోని రివర్ కంపెనీ తయారు చేస్తుంది. ఇక్కడి నుంచే ఈ స్కూటర్ ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. దీని వల్ల దేశంలో ఉత్పత్తి పరిమాణం పెరుగడంతో ఖర్చులు నియంత్రణలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. యమహా ఆర్‌వై 01 భారతదేశంలో ప్రారంభిస్తే టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్టా, బజాజ్ చేతక్, హీరో విడీ వీ1 వంటి ఈవీ స్కూటర్లకు గట్టి పోటినిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14